www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

బుధవారం
27-11-2024

సంపుటి : 01 । సంచిక : 205 । పేజీలు : 12 । వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్




డా॥ కాచం సత్యనారాయణ
CMD

## రాజ్యాంగమే మనకు మార్గదర్శి

- పత్రం కాదు.. ప్రజాస్వామ్య దీపిక
- ఉగ్రవాదానికి భారత్ దీటుగా బదులిస్తుంది
- సుప్రీం కోర్టులో జరిగిన రాజ్యాంగ దినోత్సవం వేడుకల్లో ప్రధాని మోదీ

**ఢిల్లీ:** ఉగ్రవాదానికి భారత్ దీటుగా బదులిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ హెచ్చరించారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా సుప్రీంకోర్టు లో నిర్వహించిన కార్యక్రమంలో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. మిగతా2లో...



## మరోసారి రెచ్చిపోయిన రష్యా

- 188 డ్రోన్లతో ఉక్రెయిన్‌పై దాడి
- 17 ప్రాంతాల్లో ఈ దాడులు జరిగినట్టు ఉక్రెయిన్ వైమానిక దళం ప్రకటన
- ఈ దాడుల్లో ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదు
- వెల్లడించిన అధికారులు

**మాస్కో:** రష్యా మరోసారి రెచ్చి పోయింది. ఉక్రెయిన్‌పై 188 డ్రోన్లతో విరుచుకుపడింది. రాత్రి వేళ మొత్తం 17 ప్రాంతాల్లో ఈ దాడులు జరిగినట్టు ఉక్రెయిన్ వైమానిక దళం ప్రకటించింది. ఇప్పటివరకు జరిగిన దాడులతో పోలిస్తే మిగతా2లో...



## మాగనూరు ప్రభుత్వ పాఠశాలలో మళ్లీ ఫుడ్‌పాయిజన్

- 40 మందికి అస్వస్థత
- కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఇంకెందరు బలవ్వాలిః హరీశ్‌రావు
- ప్రజాపాలన అంటే ఇదేనాః ఎమ్మెల్సీ కవిత ఆగ్రహం




2

## ప్రధాని మోదీ రాజ్యాంగాన్ని చదవలేదు

ఆయన ఈ పుస్తకాన్ని చదివి ఉంటే, ప్రతి రోజు ఇలాంటి పనులు చేసేవాడు కాదు

సంవిధాన్ రక్షక్ అభియాన్‌లో రాహుల్ గాంధీ వ్యాఖ్యలు



2



## ధాన్యం కొనుగోళ్లపై రోజూ నివేదిక ఇవ్వాలి



### సన్న, దొడ్డు రకాలను వేరువేరుగా సేకరించాలి

- రైతుకు చెల్లింపులు వెంటనే పూర్తి చేయాలి
- సన్న రకాలకు బోనస్ ఇవ్వాలి
- కొనుగోలు కేంద్రాలలో రైతులకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలి
- వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్లకు ముఖ్యమంత్రి ఆదేశం

3


### బాపూఘాట్ అభివృద్ధికి భూమిని బదిలీ చేయాలి

- ప్రపంచ స్థాయిలో గాంధీ తాత్వికతను చాటే కేంద్రంగా తీర్చిదిద్దనున్నాం
- రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌కు సీఎం రేవంత్ రెడ్డి వినతి
- మామునూరుతో పాటు మరో మూడు విమానాశ్రయాలకు అనుమతినివ్వండి
- పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడుకు సీఎం వినతి

3

## సమాజానికి రాజ్యాంగం మూలస్తంభం

### మన రాజ్యాంగం సజీవ, ప్రగతిశీల పత్రం



- సామాజిక న్యాయం, సమ్మిళిత అభివృద్ధి లక్ష్యాలను సాధించగలిగాం
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- దేశం కంటే వ్యక్తిగత విశ్వాసాలకు ప్రాధాన్యం ఇస్తే.. ప్రజాస్వామ్యానికి ముప్పు: ఉపరాష్ట్రపతి
- ఘనంగా భారత రాజ్యాంగం @75 ఏళ్లు వేడుకలు
- 75 ఏళ్ల సంస్మరణ పోస్టేజ్ స్టాంప్, నాణెం విడుదల

**ఢిల్లీ:** మన దేశ రాజ్యాంగం ఆమోదం పొంది 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పాత పార్లమెంట్ ప్రాంగణంలోని సెంట్రల్ హాల్‌లో ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమం లో ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధాని మోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సహా లోక్‌సభ, రాజ్యసభ సభ్యులంతా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ముర్ముప్రసంగించారు. సమాజానికి రాజ్యాంగం మూలస్తంభం వంటిదని కొనియాడారు. మిగతా2లో...

## 2029 నాటికి 5 లక్షల ఐటీ వర్క్ స్టేషన్లు



2

- అమరావతిలో డీప్ టెక్నాలజీ ఐకానిక్ భవన నిర్మాణం
- యువతలో నైపుణ్యం పెంచే కార్యక్రమాలను అమలు చేస్తాం
- స్టార్టప్‌లకు రూ.25 లక్షల వరకు సీడ్ ఫండింగ్ చేస్తాం
- ఏపీ సీఎం చంద్రబాబు

## బయోసిమిలర్స్ ఉత్పత్తిలో ప్రపంచ గమ్యస్థానంగా తెలంగాణ

- ప్రపంచ వ్యాప్తంగా 33శాతం వ్యాక్సిన్లు, జనరిక్ ఔషధాలు రాష్ట్రం నుంచే
- లైఫ్ సైన్సెస్ రంగంలో మరింత ముందడుగు వేసే దిశగా ప్రస్థానం కొనసాగిస్తోంది
- ఇండో-బెల్జియన్ లైఫ్ సైన్సెస్ సదస్సులో శ్రీధర్‌బాబు



**విశ్వంభర, హైదరాబాద్:** టీకాలు, జనరిక్ ఔషధాలు, క్యాన్సర్, ఇతర సంక్లిష్ట వ్యాధుల నివారణకు అవసరమైన బయోసిమిలర్స్ ఉత్పత్తిలో తెలంగాణ రాష్ట్రం ప్రపంచ గమ్యస్థానంగా వృద్ధి చెందిందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు వెల్లడించారు. లైఫ్ సైన్సెస్ రంగంలో మరింత ముందడుగు వేసే దిశగా ప్రస్థానం కొనసాగిస్తోందన్నారు. మాదాపూర్‌లో ఏర్పాటు చేసిన ఇండో-బెల్జియన్ మిగతా2లో...

## దేవుళ్ల మీద ఒట్లు.. హామీలకు తూట్లు

### కొడంగల్‌లో రైతులకు దగ్గరకు వెళ్లలేని పరిస్థితి రేవంత్‌ది

- ఏడాది పాలనలో ముఖ్యమంత్రిని ప్రజలు ఇన్ని తిట్లు తిట్టటం నేను ఎప్పుడు చూడలేదు
- ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్ భారీ విజయం ఖాయం
- కేసీఆర్ మాత్రమే తెలంగాణ మట్టి మనిషి..
- సిరిసిల్ల దీక్షా దివస్ సన్నాహక కార్యక్రమంలో కేటీఆర్



**విశ్వంభర, హైదరాబాద్:** ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సరే బీఆర్ఎస్ భారీ విజయం సాధించడం ఖాయమని కేటీఆర్ అన్నారు. సిరిసిల్లలో దీక్షాదివస్ సన్నాహక కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రేవంత్ రెడ్డి సీఎం పదవి తుమ్మితే ఊడిపోయే ముక్కు లాంటిదేననని.. ఢిల్లీవాళ్లకు కోపం వస్తే ఆయన పదవి ఊడుతదన్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందో చెప్పలేమని.. కానీ నాలుగేళ్లు వేచి చూడాల్సిందేనన్నారు. సిరిసిల్లలో ప్రజలు మిగతా2లో...

మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి

## 'మహా' మంతనాలు

### 'సీఎం' ఎంపిక మరింత ఆలస్యమేనా?

- శాఖల కేటాయింపు, కీలక పదవులు ఖరారయ్యేవరకు సీఎం పేరును ప్రకటించకూడదని బీజేపీ యోచన
- భాగస్వామ్య పక్షాల్లో భేదాభిప్రాయాలు రాకుండా జాగ్రత్తలు



**ముంబయి:** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నిక-ల్లో ఘన విజయం సాధించిన మహాయుతి కూటమి.. ప్రభుత్వ ఏర్పాటుపై మల్లగుల్లాలు పడుతోంది. తదుపరి ముఖ్యమంత్రి ఎవర-న్నదానిపై నిర్ణయం మరింత ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. కొత్తగా ఏర్పడే ప్రభుత్వంలో శాఖల కేటాయింపు, కీలక పదవులు ఖరారయ్యేవరకు సీఎం పేరును ప్రకటించకూడదని బీజేపీ యోచిస్తున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఏక్‌నాథ్ శిందే రాజీనామా చేసిన తర్వాత.. ఆపద్ధర్మ సీఎంగా కొనసాగాలని మిగతా2లో...




### నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 110 | ₹ 132 |
| **స్కిన్** | **స్కిన్ లెస్** |
| ₹ 191 | ₹ 218 |

### వ్యాపార దిగ్గజం శశి రుయా కన్నుమూత

**ఢిల్లీ:** ప్రముఖ పారిశ్రామిక వేత్త, ఎస్సార్ గ్రూప్ సహ వ్యవస్థాపకుడు శశి రుయా కన్నుమూశారు. ప్రస్తుతం ఆయన వయసు 81 ఏళ్లు. వృద్ధాప్య కారణాలతో మంగళవారం మిగతా2లో...



## జీడిమెట్లలో భారీ అగ్ని ప్రమాదం

- మంగళవారం రాత్రి వరకు అదుపులోకి రాని మంటలు
- తీవ్రంగా శ్రమిస్తున్న అగ్నిమాపక డీఆర్‌ఎఫ్, జీహెచ్‌ఎంసీ, పోలీస్ సిబ్బంది
- కూలిపోయే స్థితిలో పరిశ్రమ భవనం

2

# దేవుళ్ల మీద ఒట్లు.. హామీలకు తూట్లు

(మొదటి పేజీ తరువాయి)

ఛీ కొట్టిన సరే అధికారులను అడ్డం పెట్టుకొని ఎగురుతున్న కాంగ్రెస్ సన్నాసులను గుర్తుపెట్టుకుంటామన్నారు. మొన్న సీఎం వేములవాడకు వచ్చాడని.. నాలుగు మంచి మాటలు చెబుతాడనుకున్నానన్నారు. బాలల దినోత్సవమైనా, రాజీవ్ సద్భావన యాత్ర అయినా, ఆయన పుట్టిన రోజు అయినా.. వేములవాడలో మీటింగ్ అయినా సరే కేసీఆర్‌ను తిట్టటమే పని అని.. దేవుళ్ల మీద ఒట్లు, హామీలకు తూట్లు, కేసీఆర్‌పై తిట్లు ఇవి తప్ప నువ్వేం పీకినవ్ అంటూ మండిపడ్డారు. ప్రజల దగ్గరకు పోతే జనాలు సీఎంను ఛీ కొట్టే పరిస్థితి ఉందన్నారు. కొడంగల్‌లో రైతులకు దగ్గరకు వెళ్లలేని పరిస్థితి రేవంత్‌ది అంటూ విమర్శించారు.

**నేరెళ్ల బాధితులకు న్యాయం చేశాం..**

నేరెళ్లలో ఒక సంఘటన జరిగిందని.. బాధితులకు న్యాయం చేసేందుకు తాను ప్రయత్నం చేశానన్నారు. వాళ్లను కలిశానని.. వీలైనంత వరకు సాయం చేశానన్నారు. మీరు రాజకీయం చేసే ప్రయత్నం చేశారని.. నెరెళ్ల ప్రజలంతా మొన్నటి ఎన్నికల్లో మాకే అత్యధిక ఓట్లు వేశారన్నారు. ప్రజాస్వామ్యంలో పాలకులు అంటే ప్రజలతో తిట్లు తిన్నా సరే వారి మనసు గెలుచుకునే ప్రయత్నం చేయాలంటూ చురకలంటించారు. కొడంగల్‌లో రైతులు ఏం అడిగారు.. తమ భూములకు ఎక్కువ డబ్బులు ఇవ్వాలని కోరారన్నారు. తొమ్మిది నెలలుగా నిరసన చేస్తున్నారని.. ధర్నాలు చేస్తున్నారన్నారు. అయినా వాళ్లకు సీఎం సమయం ఇవ్వలేదన్నారు. సీఎం తమ్ముడు, మంత్రులు ఎవ్వరూ వాళ్లు బతిమాలినా పట్టించుకోలేదన్నారు. ఆఖరికి కలెక్టర్ ప్రజాభిప్రాయ సేకరణకు వెళితే నిరసన తెలిపారని.. అదే రేవంత్ రెడ్డి పోయి ఉంటే ఉరికించి.. ఉరికించి కొట్టేవారన్నారు. సీఎం కేవలం అదానీ, తన అన్న, అల్లుడు, బావమరిదికి అమృతం పంచేందుకు మాత్రమే పని చేస్తున్నాడని.. ప్రజల కోసం ఏమీ చేయలేదంటూ మండిపడ్డారు. 28 సార్లు ఢిల్లీకి పోయిండని.. ఫ్లైట్ ఛార్జీలు వృథా తప్ప 28 రూపాయలు కూడా తీసుకురాలేదన్నారు. ఎనిమిది 8 మంది బీజేపీ ఎంపీలు గెలిచారని.. వారంతా 8 రూపాయల నిధులు లేదన్నారు. ప్రజలందరూ కాంగ్రెస్, బీజేపీ చేస్తున్న పనులను గమనిస్తున్నారన్నారు.

**ఈ ప్రభుత్వం పోయే ఉపాయం లేదా అంటున్నరు..**

హైదరాబాద్‌లో ఓ ఆటో డ్రైవర్‌తో మాట్లాడితే ఈ ప్రభుత్వం పోయేందుకు ఏదైనా ఉపాయం లేదా అడుగుతున్నాడన్నారు. ఒకసారి ఓటు వేస్తే ఐదేళ్లు శిక్ష పడాల్నా అంటున్నాడని.. తప్పదు మరో నాలుగేళ్లు వీళ్లు పీక్క తింటూనే ఉంటారన్నారు. ఈ ముఖ్యమంత్రికి కనీస అవగాహన, పరిజ్ఞానం కూడా లేదన్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా సిరిసిల్లలో నేతన్నలు ఉన్నారని.. మరి ఇక్కడ పెట్టాల్సిన నూలు డిపోను తీసుకొని పోయి వేములవాడలో పెట్టిండంటూ ప్రశ్నించారు. గుండుకు దెబ్బ తాకితే మోకాలి మందు పెట్టినట్లుగా ఉందన్నారు. ఇంత తెలివైన వాళ్లు ఉండటం మన అదృష్టమన్నారు. ఏడాది పాలనలో ముఖ్యమంత్రిని ప్రజలు ఇన్ని తిట్లు తిట్టటం నేను ఎప్పుడు చూడలేదన్నారు. మీడియా, యూట్యూబ్ వాళ్లు మైక్ పెడితే చాలు ఏమాత్రం సంకోచించకుండా రేవంత్ రెడ్డిని పొట్టు పొట్టు తిడుతున్నారన్నారు. ఆ తిట్లు విన్నాక రేషం ఉన్నోడైతే బిల్డింగ్ మీది నుంచి దూకి చస్తాడన్నారు. కానీ, రేవంత్ రెడ్డి కాబట్టి నడిచిపోతోందన్నారు. ఏడాదిలోపే ప్రభుత్వంపై ఇంత వ్యతిరేకత ఊహించలేదన్నారు. మనం పిలుపునిస్తే ఈ ప్రభుత్వానికి ప్రజలే సంవత్సరీకం పెట్టే పరిస్థితి ఉందన్నారు. అమ్మ విలువ, అన్నం విలువ లేనప్పుడే మనకు తెలుస్తుందన్నారు. అదే విధంగా ఇప్పుడు గ్రామ గ్రామాన కేసీఆర్ గురించే మాట్లాడుతున్నారు. హైదరాబాద్‌లో నాచారంలోని చెప్పుల దుకాణం, హుజూర్‌నగర్‌లో నాయీ బ్రహ్మణుడి షాప్‌ను రేవంత్ రెడ్డి ప్రభుత్వం తొలగిస్తుంటే వాళ్లు కేసీఆర్ ఎక్కడ ఉన్నావంటూ గుర్తు చేసుకుంటున్నారన్నారు. ఎప్పుడు ఎలక్షన్ వస్తుందా? కాంగ్రెస్ ను ఎప్పుడు పాతర పెడదామా? అని ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు.



**ఏం నేర్చుకున్నామనేదే ముఖ్యం..**

2001 నుంచి ఇక్కడ జిల్లా పరిషత్ ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండానే ఎగిరిందని.. మళ్లీ బీఆర్ఎస్ గెలుపు ఖాయమన్నారు. ప్రజల్లో కేసీఆర్ పట్ల ఎనలేని వాత్సల్యం, ప్రేమ ఉందన్నారు. దాన్ని ఎలా అనుకూలంగా మలుచుకోవాలన్నదే మనం చేయాల్సిన పనన్నారు. మనుషులుగా మనం కూడా తప్పులు, పొరపాట్లు చేసి ఉండవచ్చని.. వాటి నుంచి ఏం నేర్చుకున్నామన్నదే ముఖ్యన్నారు. ఆనాడు 'కేసీఆర్ సచ్చుడో...తెలంగాణ తెచ్చుడో' అని కేసీఆర్ ఏ విధంగా తెలంగాణ తెచ్చారో గుర్తు చేసుకోవాలని సూచించారు. కేసీఆర్ స్ఫూర్తితో కాంగ్రెస్, బీజేపీకి వ్యతిరేకంగా మహా సంకల్ప దీక్ష చేయాల్సి ఉందన్నారు. తెలంగాణ తెచ్చిన దానికన్నా కేసీఆర్‌కు వచ్చే పెద్ద పేరు ఇంకేమీ లేదన్నారు. తెలంగాణ ఆడబిడ్డలు, తెలంగాణ రైతులు, నేతన్నలు, వృద్ధులు, తెలంగాణ ప్రజానీకానికి మేలు జరగాలంటే కేసీఆర్ కావాలన్నారు. విడిపోతే.. చెడిపోతాం అంటూ మొన్న మహారాష్ట్ర ఎన్నికల్లో ఒక నినాదం బాగా పాపులర్ అయ్యిందని.. మనం కూడా ఎన్నికలు వస్తే విడిపోకుండా జాగ్రత్త పడాలని.. లేకపోతే అన్యాయం జరుగుతుందన్నారు.

**కేసీఆర్ మాత్రమే తెలంగాణ మనిషి..**

తెలంగాణ మీద గులాబీ జెండాకు ఉన్న ప్రేమ ఢిల్లీ పార్టీలకు ఉండదని.. కేసీఆర్ మాత్రమే తెలంగాణ మట్టి మనిషి అవుతాడని.. కాంగ్రెస్, బీజేపీ నేతలు ఢిల్లీ మనుషులేనన్నారు. మన నాయకుడి పోరాటం, తెలంగాణ విద్యార్థుల బలిదానాన్ని దీక్షా దివస్ సందర్భంగా మరోసారి గుర్తు చేసుకోవాల్సి ఉందన్నారు. ఆనాడు తెలంగాణ ఇయ్యాక తప్పని పరిస్థితిని తీసుకొచ్చింది కేసీఆర్ అని.. నవంబర్ 29, 2009 నాడు కేసీఆర్ అనే ఒక్క మనిషి, ఉక్కు సంకల్పంతో చేపట్టిన దీక్ష కారణంగానే తెలంగాణ సాధ్యమైందని స్పష్టం చేశారు. తెలంగాణ ఏర్పాటైన జూన్ 2వ తేదీ ఎంత ముఖ్యమో.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కీలక మలుపు అయిన దీక్షా దివస్ నవంబర్ 29 అంతే ముఖ్యమన్నారు. నవంబర్ 29 నుంచి డిసెంబర్ 9 వ తేదీ వరకు పదకొండు రోజులు జరిగిన దీక్ష కారణంగా అనివార్యంగా తెలంగాణ ఇవ్వాల్సి వచ్చిందన్నారు. ఏ రోజైతే తెలంగాణ ప్రకటన వచ్చిందో అదే డిసెంబర్ 9వ తేదీని విజయ దివస్‌గా జరుపుకుందామన్నారు.

## రాజ్యాంగమే మనకు మార్గదర్శి

(మొదటి పేజీ తరువాయి)

''రాజ్యాంగమే మనకు మార్గదర్శి. రాజ్యాంగాన్ని ఆమోదించి 75 ఏళ్లయింది. భారత రాజ్యాంగం కాల పరీక్షకు నిలిచింది. రాజ్యాంగం అంటే కేవలం పత్రం కాదు.. ప్రజాస్వామ్య దీపిక. రాజ్యాంగం, రాజ్యాంగ నిర్మాతలకు శిరస్సువంచి నమస్కరిస్తున్నా'' అన్నారు.''జమ్మూకశ్మీర్‌లో ఇప్పుడు రాజ్యాంగం పూర్తిగా అమలులోకి వచ్చింది. తొలిసారి అక్కడ రాజ్యాంగ దినోత్సవాన్ని చేసుకుంటున్నాం. దేశం ముందు అనే భావన అనేక శతాబ్దాల పాటు రాజ్యాంగాన్ని సజీవంగా ఉంచుతుంది. ముంబయి మారణ హోమం దుర్ఘటన ఇదే రోజు జరిగింది.. ఆ విషాద ఘటనలో మృతిచెందిన వారికి నివాళులర్పిస్తున్నా'' అని అన్నారు.

## 2029 నాటికి 5 లక్షల ఐటీ వర్క్ స్టేషన్లు

**విశ్వంభర, అమరావతి:** అమరావతిలో డీప్ టెక్నాలజీ ఐకానిక్ భవనాన్ని నిర్మించనున్నట్లు సీఎం చంద్రబాబు వెల్లడించారు. నూతన ఐటీ పాలసీలో ప్రతిపాదనలపై సమీక్ష సందర్భంగా సీఎం తెలిపారు. 2029 నాటికి 5 లక్షల ఐటీ వర్క్ స్టేషన్లు అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. యువతలో నైపుణ్యం పెంచే కార్యక్రమాలను అమలు చేస్తామన్నారు. స్టార్టప్‌లకు రూ.25 లక్షల వరకు సీడ్ ఫండింగ్ చేస్తామని సీఎం వివరించారు.

## ప్రధాని మోదీ రాజ్యాంగాన్ని చదవలేదు

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ కచ్చితంగా రాజ్యాంగాన్ని చదవలేదని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన సంవిధాన్ రక్షక్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ రాజ్యాంగాన్ని చదవలేదన్న గ్యారెంటీ ఇవ్వగలనని అన్నారు. ఒకవేళ ఆయన ఈ పుస్తకాన్ని చదివి ఉంటే, ప్రతి రోజు ఇలాంటి పనులు చేసేవాడు కాదు అని రాహుల్ అన్నారు.సంవిధాన్ రక్షక్ అభియాన్‌లో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసిందని, కులగణన అనేది సమాజానికి మెగా హెల్త్ చెకప్ లాంటిందని ఆయన అన్నారు. రాజ్యాంగాన్ని రక్షించేది గాంధీ కుటుంబం మాత్రమే అని ఆయన పేర్కొన్నారు. మేం అంతా ఆ కుటుంబం వైపు మద్దతుగా ఉన్నామన్నారు.

## 'మహా' మంతనాలు..

(మొదటి పేజీ తరువాయి)

గవర్నర్ సూచించడం ఇందుకు బలాన్ని చేకూరుస్తోంది.ముఖ్యమంత్రి పేరును ప్రకటించడంలో కేంద్ర నాయకత్వం తొందరపడటం లేదని మహారాష్ట్రకు చెందిన ఓ బీజేపీ సీనియర్ నేత తెలిపారు. మంత్రిత్వ శాఖలు, జిల్లాల ఇన్‌ఛార్జులు వంటి కీలక పదవుల ఖరారు, ప్రభుత్వ ఏర్పాటుకు సమగ్ర ప్రణాళిక రూపొందించడమే తమ ప్రాధాన్యమన్నారు. భాగస్వామ్య పక్షాల్లో ఎటువంటి భేదాభిప్రాయాలు రాకుండా ఉండేందుకు అధిష్ఠానం అన్ని జాగ్రత్తలు తీసుకుంటోందని.. పార్లమెంటు సమావేశాల నేపథ్యంలో ఆ వ్యవహారాలతోపాటు మహారాష్ట్ర నేతలతోనూ సుదీర్ఘ మంతనాలు జరుపుతోందని చెప్పారు.

**త్వరలో క్లారిటీ..**

మహారాష్ట్ర ప్రభుత్వ ఏర్పాటుపై సందిగ్ధత కొనసాగుతుండటంపై శివసేన అధికార ప్రతినిధి సంజయ్ శిర్సాట్ స్పందించారు. మంగళవారం రాత్రి లేదా బుధవారం ఉదయం వరకు దీనిపై ఓ స్పష్టత వచ్చే అవకాశం ఉందన్నారు. శిందే, ఫడణవీస్, అజిత్ పవార్‌లు మంగళవారం సాయంత్రం భేటీ అవుతారని, ఆ తర్వాత ఓ నిర్ణయం వెలువడుతుందన్నారు. మరోవైపు, మహారాష్ట్ర పరిణామాలను పర్యవేక్షించేందుకు పరిశీలకుడు లేదా బృందాన్ని భాజపా నాయకత్వం ముంబయికి పంపించనున్నట్లు తెలుస్తోంది. కేబినెట్ కూర్పుపై ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలతో చర్చించిన తర్వాతే సీఎం పదవిపై ఓ ప్రకటన చేయనున్నట్లు సమాచారం.మహారాష్ట్రలో ప్రస్తుత ప్రభుత్వ గడువు మంగళవారంతో ముగిసింది. ఈ క్రమంలోనే ఏక్‌నాథ్ శిందే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. కొత్త సీఎం ప్రమాణం చేసేంతవరకు ఆపద్ధర్మ సీఎంగా కొనసాగాలని శిందేకు గవర్నర్ సూచించారు.

## మరోసారి రెచ్చిపోయిన రష్యా..

(మొదటి పేజీ తరువాయి)

ఈ సారి రికార్డు స్థాయిలో డ్రోన్లను ప్రయోగించిందని పేర్కొంది. వీటిలో చాలా డ్రోన్లను అడ్డుకున్నట్లు అధికారులు తెలిపారు. అయితే.. ఈ దాడి కారణంగా భవనాలు, జాతీయ పవర్‌గ్రిడ్‌తో సహా కీలక మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. 17 ప్రాంతాల్లో జరిగిన ఈ దాడుల్లో ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదని అధికారులు వెల్లడించారు. మరోవైపు.. సరిహద్దు ప్రాంతంలో ఉక్రెయిన్ ఉంచిన 39 డ్రోన్లను తమ సైన్యం ధ్వంసం చేసినట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. కాగా.. ఇటీవల వందలకొద్దీ గ్లైడ్ బాంబులను రష్యా తమ దేశంపై ప్రయోగించిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వెల్లడించిన సంగతి తెలిసిందే. 800 కేఏబీ శ్రేణికి చెందిన 1500 కేజీల బరువున్న బాంబులతో దాడులు చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలోనే మరోసారి రష్యా భారీగా డ్రోన్లను ప్రయోగించింది. ఇదిలా ఉండగా.. ఉక్రెయిన్‌పై ఆక్రమణకు పాల్పడిన రోజే తమ వద్ద ఉన్న అణ్వాయుధాలను యుద్ధంలో వాడేందుకు రష్యా సిద్ధంగా ఉన్నట్లు రష్యా నుంచి పారిపోయిన ఓ సైనికుడు వెల్లడించాడు. రష్యా అణుస్థావరాల్లో పరిస్థితులను వివరించాడు. ఈ నేపథ్యంలోనే పుతిన్ అణ్వాయుధాలను వాడే అవకాశం ఉందన్న ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి.

## వ్యాపార దిగ్గజం శశి రుయా కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

ఉదయం మృతి చెందారు. దిగ్గజ వ్యాపారవేత్త మరణం పట్ల ఎస్సార్ గ్రూప్ సంతాపం ప్రకటించింది. 'శశికాంత్ రుయా మృతి పట్ల ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాము. సమాజ అభ్యున్నతి, దాతృత్వం పట్ల తిరుగులేని నిబద్ధతతో ఆయన సేవలు అందించారు. ఆయన జీవిత కాలంలో లక్షలాది మందికి ఉపాధి కల్పించి వారి జీవితాల్లో మార్పునకు కారణమయ్యారు' అని ఓ ప్రకటనలో తెలిపింది. రుయా మరణవార్త తెలుసుకున్న పలువురు వ్యాపారవేత్తలు, దిగ్గజాలు ఆయనకు సంతాపం తెలుపుతున్నారు. శశి రుయా.. 1943లో జన్మించారు. 1969లో తన సోదరుడు రవి రుయాతో కలిసి ఎస్సార్ గ్రూప్‌ను స్థాపించారు. అతి తక్కువ సమయంలోనే తమ సేవలను అనేక రంగాల్లోకి విస్తరించారు. ఇక ఈ గ్రూప్ చేపట్టిన మొదటి ప్రాజెక్ట్ మద్రాస్ పోర్ట్ ట్రస్ట్ ఔటర్ బ్రేక్ వాటర్ నిర్మాణం. వీరి ప్రాజెక్టుల్లో ఇది ప్రధానమైంది. అప్పట్లో ఈ ప్రాజెక్ట్ విలువ రూ.2.5 కోట్లు. ఈ ప్రాజెక్ట్‌ను విజయవంతంగా పూర్తి చేయడంతో ఎస్సార్ గ్రూప్‌నకు అంతర్జాతీయ గుర్తింపు లభించింది. ఆతర్వాత డబుల్ బ్రిడ్జీలు, భారీ వంతెనలు, పవర్ ప్లాంట్‌లతో సహా అనేక ప్రధాన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ఈ సంస్థ నిర్మించింది. 1980వ దశకంలో ఎస్సార్ అనేక చమురు, గ్యాస్ ఆస్తులను కొనుగోలు చేయడంతో ఇంధన రంగంలోకి విస్తరించింది. 1990 ల్లో స్టీల్, టెలికమ్యూనికేషన్స్ విభాగంలోకి అడుగుపెట్టింది.

## బయోసిమిలర్స్ ఉత్పత్తిలో ప్రపంచ గమ్యస్థానంగా తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)

లైఫ్ సైన్సెస్ సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా 33శాతం వ్యాక్సిన్లు, జనరిక్ ఔషధాలు తెలంగాణ నుంచే సరఫరా అవుతాయని గుర్తు చేశారు. కొత్త అవకాశాలు, అనుకూల వాతావరణంతో బెల్జియం లైఫ్ సైన్సెస్ కంపెనీలకు ఆహ్వానం పలుకుతున్నామన్నారు. ఇక్కడ నైపుణ్యం కలిగిన మానవ వనరులు, మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. యూరోపియన్ యూనియన్‌లో రెండో అతిపెద్ద ఔషధ ఎగుమతిదారుగా ఉన్న బెల్జియం.. ఆరోగ్య రంగంలో విప్లవాత్మకమైన ఆవిష్కరణలతో ముందంజలో ఉందని శ్రీధర్ బాబు వెల్లడించారు. బలమైన భాగస్వామ్యం ద్వారా రెండు దేశాలు పరస్పర ప్రయోజనం పొందగలవన్న విశ్వాసం తనకుందని పేర్కొన్నారు.

## ప్రభుత్వ విచక్షణ అధికారాన్ని ఉపయోగించి జర్నలిస్టులను ఆదుకోవాలి

**కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్**

**విశ్వంభర, హైదరాబాద్:** జేఎన్‌జే జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీకి కేటాయించిన ఇండ్ల స్థలాలను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు తీర్పును వెలువరించడం అత్యంత బాధాకరమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. అత్యున్నత న్యాయస్థానం వెలువరించిన తీర్పును గౌరవించాల్సిందేనని,అయితే జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు దక్కకపోవడానికి పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీతోపాటు ప్రస్తుత కాంగ్రెస్ పాలకులే ప్రధాన కారణమన్నారు . 17 ఏళ్ల క్రితం పుస్తెలు తాకట్టు పెట్టి, అప్పు చేసి ఒక్కో జర్నలిస్టు రూ.2 లక్షల చొప్పున రూ.12 కోట్లు పోగు చేసి ప్రభుత్వానికి చెల్లించి జేఎన్జే హౌజింగ్ సొసైటీ పేరుతో స్థలాలు దక్కించుకున్నారు. నాటి నుండి నేటి వరకు అధికారంలో ఉన్న బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఏదో ఒకసాకు చూపుతూ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు చేతికి అందించకుండా తీవ్రమైన అన్యాయం చేశాయని పేర్కొన్నారు . కేసీఆర్ పాలనలో జర్నలిస్టుల బతుకులు మరీ దుర్భరం. ఇండ్ల స్థలాలడిగితే లాఠీలతో కొట్టించారు. ప్రశ్నించే జర్నలిస్టులను వృత్తిలో కొనసాగకుండా అడుగడుగునా అవమానించిన ఘటనలు కోకొల్లలు అని బండి సంజయ్ తెలిపారు. నేటి సుప్రీంకోర్టు తీర్పు బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలకుల నిర్వాక, నిర్లక్ష్య ఫలితమే. ఈ రెండు పార్టీలు జర్నలిస్టులను రోడ్డు పాల్జేయడమే కాకుండా చేతికొస్తుందని వేయికళ్లతో ఎదురు చూసిన ఇండ్ల స్థలాలను చేతికి అందకుండా చేసి,జర్నలిస్టుల నోటికాడ ముద్దను లాగేసుకున్నాయని పేర్కొన్నారు . సుప్రీంకోర్టు తీర్పుతో జర్నలిస్టు కుటుంబాల బాధ వర్ణణాతీతం. అసలు జర్నలిస్టుల చేసిన తప్పేమిటి? ఈ రెండు పార్టీలకు జర్నలిస్టులపై ఎందుకంత కక్ష? పైసాపైసా కూడబెట్టి డబ్బులు చెల్లించినా ఇండ్ల స్థలాలు ఇవ్వకుండా 17 ఏళ్లు జాప్యం చేస్తారా? అని ప్రశ్నించారు. నేటి సమాజంలో జర్నలిస్టుల సేవలు వెలకట్టలేనివి. చాలీచాలని జీతాలతో బతుకీడుస్తున్నారు. అయినా తమ వార్తలతో నిరంతరం సమాజాన్ని చైతన్యవంతం చేసేందుకు అహర్నిశలు తపన పడతున్నారు. ప్రభుత్వం వాళ్లకు కనీస సౌకర్యాలు కూడా కల్పించకుండా అన్యాయం చేస్తోంది. వాళ్లకు హెల్త్ కార్డులు కూడా పనిచేయడం లేదు. ఉండటానికి ఇండ్లు లేక అద్దె కట్టలేక, పిల్లలు ఫీజులు కూడా చెల్లించే స్థోమత లేక తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారన్నారు . ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా కుటుంబం కంటే సమాజాన్ని చైతన్యవంతం చేయడమే ప్రధానమని నమ్మి జర్నలిజం వృత్తిలో కొనసాగుతున్నారు. ఇండ్ల స్థలాల కోసం ఎదురుచూసి ఎంతోమంది జర్నలిస్టులు అసువులు బాశారు. జర్నలిస్టులను ఆదుకోవడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తీవ్రంగా విఫలమయ్యాయని ఆయన పేర్కొన్నారు. ఇకనైనా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇచ్చే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో క్రుషి చేయాలన్నారు . సుప్రీంకోర్టు తీర్పు బాధాకరమే అయినప్పటికీ ప్రభుత్వం తనకున్న విచక్షణ అధికారాలను ఉపయోగించి జర్నలిస్టులకు ఇండ్లను కేటాయించాలని చెప్పారు . అట్లాగే గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో ఇండ్లులేని అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలను వెంటనే మంజూరు చేయాలని . ఈ విషయంలో ప్రభుత్వానికి భారతీయ జనతా పార్టీ పక్షాన పూర్తిగా సహకరించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. అట్లాకాకుండా ఇండ్ల స్థలాలివ్వకుండా జర్నలిస్టులకు అన్యాయం చేస్తే బీజేపీ చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

## జీడిమెట్లలో భారీ అగ్ని ప్రమాదం

**విశ్వంభర, హైదరాబాద్:** జీడిమెట్ల పారిశ్రామికవాడలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. దూలపల్లి రోడ్డులోని ఎస్ఎస్వీ పాలిమర్స్ అనే ప్లాస్టిక్ కంపెనీలో మంటలు చెలరేగి.. భవనం రెండో అంతస్తుకు విస్తరించాయి. మంటలు భారీగా ఎగిసి పడుతుండటంతో ఆ పరిసర ప్రాంతంలో దట్టంగా పొగలు కమ్ముకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది, డీఆర్ఎఫ్, జీహెచ్ఎంసీ, నాలుగు పోలీసు స్టేషన్లకు చెందిన సిబ్బంది మంటలు ఆర్పేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. మంటలు అంతకంతకూ పెరుగుతున్నాయి. 7 ఫైర్‌ఇంజిన్లు, 40 వాటర్ ట్యాంకర్ల సాయంతో మంటలు అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ ఎంతకీ అదుపులోకి రావడం లేదు. పరిశ్రమలోని మూడో అంతస్తులో చెలరేగిన మంటలు...కింద వరకూ వ్యాపించాయి. దట్టమైన పొగ ఆ ప్రాంతమంతా వ్యాపించింది. పరిశ్రమలోని మొదటి అంతస్తులో అధిక మొత్తంలో పాలిథిన్ సంచుల తయారీకి వినియోగించే ముడి సరకు ఉండడంతో మంటలు అదుపుచేయడం కష్టంగా మారింది. రాత్రి కావడంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడింది.

**కూలిపోయే పరిస్థితిలో భవనం..**

పరిశ్రమ భవనం కూలిపోయే స్థితికి వచ్చిందని అధికారులు చెబుతున్నారు. మంటలు అదుపులోకి రావకపోవడంతో దూలపల్లి రోడ్డులో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించారు.

## ఇథనాల్ పరిశ్రమను రద్దు చేయాలి

- జాతీయ రహదారిపై ఆందోళన..
- 6 గంటలుగా ఆర్డీవోను నిర్బంధించిన రైతులు

**విశ్వంభర, నిర్మల్:** ఇథనాల్ పరిశ్రమను రద్దు చేయాలంటూ నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండల ప్రజలు మంగళవారం ఆందోళన కొనసాగించారు.. నచ్చజెప్పేందుకు వెళ్లిన ఆర్డీవోను చుట్టుముట్టారు. ఆర్డీవో రత్న కల్యాణి 6 గంటలుగా ఘటనాస్థలిలోనే ఉండిపోయారు.



ఇథనాల్ పరిశ్రమ వల్ల తమ పంటపొలాలు ధ్వంసమవడంతో పాటు, ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయని జాతీయ రహదారిపై బైఠాయించారు.దిలావర్‌పూర్ శివారులో నిర్వహిస్తున్న పరిశ్రమకు వ్యతిరేకంగా కొన్ని నెలలుగా నిరసన తెలుపుతున్నా పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, శ్రీహరిరావులు కనిపించడం లేదంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. పిల్లా పెద్దలు భారీ సంఖ్యలో హాజరై ప్రభుత్వ వ్యతిరేక నినాదాలిచ్చారు. ఆందోళనతో జాతీయ రహదారికి ఇరువైపులా వాహనాలు నిలిచిపోగా.. ఉద్రిక్తతలు చెలరేగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటు విరమించుకోకుంటే ఉద్యమం మరింత ఉద్ధృతం చేస్తామని స్థానికులు హెచ్చరించారు. రైతు నిర్బంధించడంతో 6 గంటలకు పైగా ఆర్డీవో కారులోనే ఉండటంతో స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు బీపీ తగ్గుతున్నట్టు వెల్లడించారు. దీంతో ఆర్డీవోను పోలీసు బందోబస్తు మధ్య నిర్మల్ ఆసుపత్రికి తరలించారు. మరో వైపు.. కలెక్టర్ వచ్చి హామీ ఇస్తేనే ఆందోళన విరమిస్తామని రైతులు చెబుతున్నారు.

## సమాజానికి రాజ్యాంగం మూలస్తంభం

(మొదటి పేజీ తరువాయి)

''దేశ ప్రజలందరికీ రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు. 75 ఏళ్ల క్రితం ఇదేరోజున రాజ్యాంగం ఆమోదం పొందింది. ఇది మన పవిత్ర గ్రంథం. ప్రజాస్వామ్య, గణతంత్ర సూత్రాల ఆధారంగా రాజ్యాంగ రూపకల్పన జరిగింది. రాజ్యాంగానికి రాజేంద్రప్రసాద్, అంబేద్కర్ మార్గనిర్దేశం చేశారు. ప్రగతిశీల సూత్రాల గురించి రాజ్యాంగంలో పొందుపర్చారు. రాజ్యాంగ రచనలో భాగస్వాములను స్మరించుకోవాలి. మన రాజ్యాంగం సజీవ, ప్రగతిశీల పత్రం. దీన్ని ఆధారంగా చేసుకొని సామాజిక న్యాయం, సమ్మిళిత అభివృద్ధి లక్ష్యాలను సాధించగలిగాం'' అని ముర్ము ప్రసంగించారు. ఈ సందర్భంగా మహిళా రిజర్వేషన్లపై చట్టం గురించి రాష్ట్రపతి ప్రత్యేకంగా ప్రస్తావించారు. దీంతో ప్రజాస్వామ్యంలో మహిళా సాధికారిత నవ శకాన్ని ప్రారంభించుకున్నామని అన్నారు. రాజ్యాంగ నిర్మాణంలో ముఖ్య పాత్ర పోషించి 15 మంది నారీమణుల సేవలను గుర్తుచేసుకున్నారు. ప్రసంగం అనంతరం సభ్యులందరితో కలిసి రాజ్యాంగ పీఠిక సామూహిక పఠనం చేశారు. అంతకుముందు రాజ్యాంగానికి సంబంధించిన రెండు పుస్తకాలు, 75 వసంతాలకు గుర్తుగా స్మారక పోస్టల్ స్టాంప్‌ను విడుదల చేశారు.

**అలా చేస్తే ప్రజాస్వామ్యానికి ముప్పు: ఉపరాష్ట్రపతి**

ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ప్రసంగిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. దేశం కంటే వ్యక్తిగత విశ్వాసాలకు ప్రాధాన్యం ఇస్తే.. మనం సాధించుకున్న స్వాతంత్ర్యం ప్రమాదంలో పడుతుందని వ్యాఖ్యానించారు. గందరగోళం సృష్టించడాన్ని ఒక వ్యూహంగా అమలు చేస్తే.. ప్రజాస్వామ్యానికి ముప్పు వాటిల్లుతుందన్నారు. నిర్మాణాత్మక చర్చలు ప్రజాస్వామ్య దేవాలయాల



పవిత్రతను పెంపొందిస్తాయని అభిప్రాయపడ్డారు. అంతకుముందు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ప్రారంభోపన్యాసం చేశారు. నాడు రాజ్యాంగ సభలో సభ్యులు గౌరవంగా అభిప్రాయాలు పంచుకున్నారని, అదే సంప్రదాయాన్ని మనమంతా కొనసాగించాలని బిర్లా సూచించారు.

## మాగనూరు ప్రభుత్వ పాఠశాలలో మళ్లీ ఫుడ్‌పాయిజన్

**విశ్వంభర, నారాయణపేట:** నారాయణపేట జిల్లా మాగనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మరోసారి ఫుడ్‌పాయిజన్ జరిగింది. మంగళవారం నాడు మధ్యాహ్న భోజనం తిని 40 మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. మధ్యాహ్నం 3.30 గంటల తర్వాత పలువురు విద్యార్థులు తీవ్రమైన కడుపు నొప్పితో విలవిలలాడిపోయారు. వాంతులు, విరేచనాలతో ఇబ్బంది పడ్డారు. ఇది గమనించిన పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు విద్యార్థులను ఆస్పత్రికి తరలించారు.మాగనూరు పీహెచ్‌సీలో విద్యార్థులకు చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉన్న పలువురిని మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మాగనూరులో ఫుడ్ పాయిజన్ జరగడం ఈ వారంలో ఇది మూడోసారి. దీనిపై స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.మరోవైపు, మహబూబ్‌నగర్ కలెక్టర్ బంగ్లా దగ్గర ఉన్న ఎస్సీ బాలిక కాలేజీ హాస్టల్‌లో విద్యార్థులకు పెడుతున్న అన్నంలో పురుగులు వచ్చాయి. దీనిపై విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ నాయకులు హాస్టల్‌కు చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు. ప్రతిరోజు ఇలానే భోజనంలో పురుగులు వస్తున్నాయని విద్యార్థులు చెప్పారు.

**కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఇంకెందరు బలవ్వాలి: హరీశ్‌రావు సీరియస్**

ఫుడ్‌పాయిజన్ జరగడంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకులు హరీశ్‌రావు తీవ్రంగా మండిపడ్డారు. ఫుడ్‌పాయిజన్ జరిగి 100 మంది విద్యార్థులు అస్వస్థతకు గురై పది రోజులు కూడా గడవకముందే మళ్లీ ఫుడ్‌పాయిజన్ జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాంతులు, కడుపునొప్పితో 30 మంది విద్యార్థులు జిల్లా దవాఖానాలో చేరిన దుస్థితి నెలకొందని అన్నారు.రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో వరుస ఫుడ్ పాయిజన్ కేసులు నమోదవుతున్నా, ప్రాణాలు కోల్పోతున్నా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడటం లేదని హరీశ్‌రావు మండిపడ్డారు. తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నా కనీస చర్యలకు ఉపక్రమించడం లేదని విమర్శించారు. విద్యార్థులకు కల్తీ ఆహారం పెడితే జైలుకు పంపిస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి మాటలు నీటి మూటలే అయ్యాయని అన్నారు. మాటలే తప్ప చేతలు లేని కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య తీరు వల్ల ఇంకెంత మంది విద్యార్థులు ఆస్పత్రి పాలవ్వాలని.. ఇంకెందరు ప్రాణాలు కోల్పోవాలని ప్రశ్నించారు.రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో వరుస ఫుడ్ పాయిజన్ కేసులు నమోదవుతున్నా, ప్రాణాలు కోల్పోతున్నా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడటం లేదని హరీశ్‌రావు మండిపడ్డారు. తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నా కనీస చర్యలకు ఉపక్రమించడం లేదని విమర్శించారు. విద్యార్థులకు కల్తీ ఆహారం పెడితే జైలుకు పంపిస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి మాటలు నీటి మూటలే అయ్యాయని అన్నారు. మాటలే తప్ప చేతలు లేని కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య తీరు వల్ల ఇంకెంత మంది విద్యార్థులు ఆస్పత్రి పాలవ్వాలని.. ఇంకెందరు ప్రాణాలు కోల్పోవాలని ప్రశ్నించారు.

**ప్రజాపాలన అంటే ఇదేనా: ఎమ్మెల్సీ కవిత ఆగ్రహం**

మాగనూరు ప్రభుత్వ పాఠశాలలో మరో ఫుడ్ పాయిజన్ ఘటన దిగ్భ్రాంతికి గురిచేసిందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. బంగారు భవిష్యత్తుకై పుస్తకాల బ్యాగులు పట్టుకుని పాఠశాలకు వెళ్లిన పిల్లలు.. పురుగులు పట్టిన అన్నం తిని , బాధ భరించలేక కడుపు పట్టుకుని రోదిస్తుండటం చూసి ఓ తల్లిగా నా మనసు కలచి వేసిందని పేర్కొన్నారు.ఇదే పాఠశాలలో కలుషితమైన ఆహారం తిని 30 మంది ఆసుపత్రిలో చేరిన వారం లోపే.. మరోసారి ఫుడ్ పాయిజన్ ఘటన జరగడం కాంగ్రెస్ ప్రభుత్వ ఘోర వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. ప్రతి పదిరోజులకు ఒక పసి ప్రాణం పోతున్నా కూడా సర్కారులో చలనం లేదని మండిపడ్డారు. ఇదేనా ప్రజా పాలన అంటే అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు.

# బాపూఘాట్ అభివృద్ధికి భూమిని బదిలీ చేయాలి



**ఢిల్లీ:** హైదరాబాద్‌లో ఈసా, మూసీ నదుల సంగమ స్థలంలోని బాపూఘాట్ అభివృద్ధికి రక్షణ శాఖ పరిధిలోని 222.27 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేయాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మహాత్మా గాంధీ చితాభస్మాన్ని కలిపిన చోట ఏర్పాటు చేసిన బాపూ ఘాట్ ను ప్రపంచ స్థాయిలో గాంధీ తాత్వికతను చాటే కేంద్రంగా తీర్చిదిద్దాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని కేంద్ర మంత్రికి సీఎం తెలిపారు. ఢిల్లీలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం సాయంత్రం కలిశారు. బాపూ ఘాట్ వద్ద గాంధీ సిద్ధాంతాలను ప్రచారం చేసే నాలెడ్జ్ హబ్, ధ్యాన గ్రామం (మెడిటేషన్ విలేజ్), చేనేత ప్రచార కేంద్రం, ప్రజా వినోద స్థలాలు, ల్యాండ్ స్కేప్ ఘాట్లు, శాంతి విగ్రహం (స్టాట్యూ ఆఫ్ పీస్), మ్యూజియంలతో గాంధీ సరోవర్ ప్రాజెక్టును చేపట్టనున్నామని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. ఇందుకోసం రక్షణ శాఖ భూమిని బదిలీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

**మామునూరు విమానాశ్రయ పనులకు అనుమతి ఇవ్వండి**

తెలంగాణలో పారిశ్రామికాభివృద్ధి.. ప్రజలకు రవాణా వసతుల మెరుగుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఢిల్లీలో కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి మంగళవారం సాయంత్రం కలిశారు. తెలంగాణలో రెండో పెద్ద నగరమైన వరంగల్‌లో విమానాశ్రయ ఏర్పాటుకు అవసరమైన నిరభ్యంతర పత్రాన్ని (ఎన్‌వోసీ) రాష్ట్ర ప్రభుత్వం జీఎంఆర్ నుంచి (ఒక విమానాశ్రయం నుంచి మరో విమానాశ్రయానికి 150 కి.మీ.దూరం ఉండాలనే నిబంధన) పొందిందని ముఖ్యమంత్రి తెలిపారు. 253 ఎకరాల భూ సేకరణకు అవసరమైన రూ.205 కోట్లను భారత విమానయాన సంస్థ (ఏఏఐ) కి అందజేసిందని వివరించారు. విమానాశ్రయ పనులకు అవసరమైన అనుమతులు, అక్కడి నుంచి విమానాలు నడిపేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విమానాశ్రయ ఏర్పాటుకు గతంలో గుర్తించిన స్థలం అనువుగా లేనందున ప్రత్యామ్నాయంగా పాల్వంచలో 950 ఎకరాలు గుర్తించామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఆ భూమి వివరాలు ఏఏఐ అందజేశామని, వెంటనే విమానాశ్రయ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. పెద్దపల్లి జిల్లాలో గతంలో గుర్తించిన భూమి విమానాశ్రయ నిర్మాణానికి అనువుగా లేదని ఏఏఐ ప్రీ-ఫీజుబిలిటీ సర్వేలో తేలిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు తెలిపారు. దానికి ప్రత్యామ్నాయంగా రాష్ట్ర ప్రభుత్వం అంతర్గాంలో 591.24 ఎకరాలు గుర్తించిందని... అక్కడి విమానాశ్రయ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. ఆదిలాబాద్‌లో భారత వైమానిక దళం (ఐఏఎఫ్) ఆధ్వర్యంలో ఇప్పటికే 369.50 ఎకరాల భూమి ఉందని, పూర్తి స్థాయి కార్యకలాపాలకు అదనంగా 249.82 ఎకరాలు అవసరమని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు సీఎం రేవంత్ రెడ్డి తెలియజేశారు. అదనంగా అవసరమైన భూమి సేకరించి అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. గిరిజనులు ఎక్కువగా ఉన్న ఆదిలాబాద్ కు వెంటనే విమానాశ్రయం మంజూరు చేయాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. సీఎం కేంద్ర మంత్రులను కలిసిన కార్యక్రమాల్లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఎంపీలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, కె.రఘువీర్ రెడ్డి, ఎం.అనిల్ కుమార్ యాదవ్, ఆర్.రఘురామిరెడ్డి, డాక్టర్ కడియం కావ్య తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లపై రోజూ నివేదిక ఇవ్వాలి

**విశ్వంభర,హైదరాబాద్:** రాష్ట్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కొనుగోళ్లు త్వరితగతిన పూర్తి చేయాలని, రైతులకు ఇలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను, అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, అన్ని అంశాల్లో తెలంగాణ నంబర్ వన్ గా ఉంది. గతంలో ఎప్పుడు లేని విధంగా ధాన్యం కొనుగోలు, చెల్లింపులు సక్రమంగా జరుగుతున్నాయన్నారు. సన్న, దొడ్డు రకాలను వేరువేరుగా సేకరించాలని, ధాన్యం విక్రయించిన రైతుకు చెల్లింపులు వెంటనే పూర్తి చేయాలని, సన్న రకాలకు బోనస్ ఇవ్వాలని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని, వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సిఎం ఆదేశించారు. ఉమ్మడి జిల్లాలకు కేటాయించిన ఇన్చార్జి మంత్రులు, ఇన్చార్జి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, ధాన్యం కొనుగోళ్ల తీరును పర్యవేక్షించాలని అన్నారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన నివేదికను ప్రతిరోజు సమర్పించాలని ఆదేశించారు. అదేవిధంగా, మిల్లులకు ధాన్యం కోసం లారీల ఇబ్బంది లేకుండా చూడాలి. సన్నరకం పండించిన రైతులకు బోనస్ గా 500 రూపాయలు ఇవ్వడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసే విధంగా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని, గిట్టుబాటుధర కంటే మార్కెట్ ధర తక్కువగా ఉన్న ప్రతి సందర్భంలో ఈ ప్రజా ప్రభుత్వం అన్ని పంటలను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసేలా భరోసా కల్పించాలని స్పష్టం చేశారు.రాష్ట్రంలో 66లక్షల ఎకరాల్లో ధాన్యం పండించారు. ఇంకా 20 లక్షల ఎకరాల్లో పంట కోయాల్సి ఉంది. సరిహద్దు జిల్లాల్లో నుంచి బోనస్ కోసం ధాన్యం రాష్ట్రంలోకి వస్తుంది. ఆ ధాన్యం పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలి' అని హెచ్చరించారు. ఈనెల 30వ తేదీన మహబూబ్ నగర్ లో రైతు పండగను జరుపబోతున్నాం. దానిని పురస్కరించుకొని 28, 29, 30 తేదీల్లో మహబూబ్ నగర్ లో వ్యవసాయ అనుబంధ రంగాల ఎగ్జిబిషన్ ఏర్పాటు, వ్యవసాయ రంగంలో ఆధునిక పద్ధతులు, యాంత్రీకరణ, ఆదర్శ రైతులతో రైతు అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈనెల 30న జరిగే రైతు పండుగను కలెక్టర్లు అందరు సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. అక్రమాలకు పాల్పడే మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు, పథకాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై రైతులకు అందిస్తున్న సౌకర్యాల గురించి ప్రజలకు చేరే విధంగా విస్తృత ప్రచారం చేయాలని సీఎం అన్నారు.హైదరాబాద్ నుండి రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, కోమటి రెడ్డి వెంకట రెడ్డి, కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తదితరులు పాల్గొన్నారు.






# ప్రతిపక్షాలు అభివృద్ధికి సహకరించాలి

## మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రంలో ప్రతిపక్షాలు వికృతంగా ప్రవర్తిస్తున్నాయని మండిపడ్డారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. రైతులకు లాభదాయకమైన నష్టపరిహారం ఇచ్చి భూసేకరణ చేయాలని ప్రయత్నిస్తుంటే ప్రతిపక్షాలు బ్యూరోక్రట్లపై కూడా దాడులు చేసి చంపించేందుకు సైతం తెగబడుతున్నాయని ఆయన మండిపడ్డారు. డా.బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో మంగళవారం జాతీయ రహదారుల పురోగతిపై సమీక్షించిన మంత్రి పై వ్యాఖ్యలు చేశారు. మాది ప్రోగ్రసివ్, ప్రోయాక్టివ్ ప్రభుత్వమని చెప్పిన పదేండ్లుగా నత్తన నడకన సాగుతున్న జాతీయ రహదారులను వేగంగా పూర్తి చేసేందుకు శ్రమిస్తున్నట్లు తెలిపారు. కేసిఆర్ వ్యక్తిగత రాజకీయ కక్ష కోసం రాష్ట్రాన్ని బలిపశువును చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అప్పుడే భూసేకరణ చేసి ఉంటే.. ఇప్పుడు ఇన్ని కోట్ల రూపాయలు భూసేకరణకు వెచ్చించాల్సిన అవసరం వచ్చేదికాదని ఆయన మండిపడ్డారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసి రాగద్వేషాలు లేకుండా పనిచేస్తానని చెప్పి రాజ్యాంగాన్ని కేసిఆర్ కూనీ చేశారని ఆయన ఆగ్రహంవ్యక్తం చేశారు. ఆర్ & బీ శాఖ పరిధిలో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ చేపట్టి వివిధ జాతీయ రహదారులపై సమీక్షించిన మంత్రి పనులను వేగవంతంగా చేయాలని సూచించారు. ఎక్కడా అలసత్వానికి తావులేకుండా ప్రతీ పనిని చెప్పిన సమయానికి పూర్తి చేసినప్పుడే పనులు పూర్తవుతాయని అధికారులకు దిశానిర్దేశం చేశారు. జాతీయ రహదారుల అలైన్ మెంట్ రూపొందించేటప్పుడు.. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, అటవీ భూములు లేకుండా అలైన్ మెంట్లను రూపొందించాలని సూచించారు.. అప్పుడే పనులు వేగంగా ముందుకు సాగుతాయని అధికారులకు తెలిపారు. ఎన్.హెచ్. ప్రాజెక్టు డైరెక్టర్లు భూసేకరణను వేగవంతం చేసేందుకు జిల్లాలోని కలెక్టర్, ఆర్డీఓలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. మొక్కుబడిగా కాకుండా చిత్తశుద్ధితో పనిచేస్తేనే భూసేకరణ విజయవంతం అవుతుందని ఆయన అధికారులకు చురకలంటించారు. వచ్చే వారం నుంచి పనులు జరుగుతున్న రోడ్లను పరిశీలిస్తానని.. నిర్మాణ నాణ్యత, స్థితిగతులను స్వయంగా చూస్తానని తెలిపారు.

# బీజేపీ ప్రజాస్వామ్య విలువలను పూర్తిగా కాల రాసింది

## టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

**విశ్వంభర, హైదరాబాద్:** బీజేపీ ప్రజాస్వామ్య విలువలను పూర్తిగా కాల రాసిందని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గాంధీ భవన్ సంవిధాన్ దివాస్ సభలో ఆయన మాట్లాడుతూ.. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని బీజేపీ మార్చాలని ప్రయత్నాలు చేసిందన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ వాళ్లు వాళ్ళకి అనుగుణంగా రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ అదరకుండా బేధరకుండా...రాజ్యాంగాన్ని కాపాడాడానికి ముందుకొచ్చాడని వ్యాఖ్యానించారు దేశంలోనే మొదటి సారిగా తెలంగాణలోనే కులగణన చేస్తున్నట్లు తెలిపారు. రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో మేధావుల సూచనలు, సలహాల ద్వారా కులగణన చేస్తున్నామని తెలిపారు. బీజేపీ తిరోగమనం చేపట్టక తప్పదని కామెంట్స్ చేశారు. రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేసే వరకు ఎన్ఎస్ యూ కార్యకర్తలు పని చేయాలని ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. పాఠ్య పుస్తకాలలో ప్రియంబుల్ ఉండే విదంగా చూడాలని సీఎంని కోరుతున్నట్లు తెలిపారు. 8వ తరగతి నుండి విద్యార్థులకు రాజ్యాంగం తెలిసే విదంగా పుస్తకాలలో ప్రియంబుల్‌ను పొందుపర్చాలని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.

# కాంగ్రెస్ పార్టీ కల్పవృక్షం.. మర్రిచెట్టు లాంటిది

**సోనియా..రాహుల్ గాంధీలది త్యాగాల కుటుంబం**

**వాళ్ళ త్యాగాల ముందు.. మీరేంత..?**

**కాంగ్రెస్ కల్పవృక్షం నుండే కేసీఆర్ లీడర్ అయ్యాడు**

**కేటీఆర్ హరీష్ రావులు కోతల రాయుళ్ళు**

**కాంగ్రెస్ వేళ్ళు కాదు.. ఈక కూడా పీక లేవు**

**బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై జగ్గారెడ్డి ఫైర్**


**విశ్వంభర, హైదరాబాద్ :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ పార్టీని విమర్శించే హక్కు కేటీఆర్ కు లేదని మండిపడ్డారు. గాంధీ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో ఆయన మాట్లాడుతూ 140 ఏళ్ల చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ గురించి మాట్లాడే నైతికత బీఆర్ఎస్ నాయకులకు లేదని విమర్శించారు. అసలు సోనియా గాంధీ తెలంగాణ ఇవ్వకపోతే కేసీఆర్ సీఎం అయ్యేవాడా అని జగ్గారెడ్డి ప్రశ్నించారు.కాంగ్రెస్ పార్టీని కూకటి వేళ్ళతో కూల్చివేస్తానని కేటీఆర్ అంటున్నాడు.. నీ వయసు ఎంత? నీ శక్తి ఎంత? వయసుకు మించి మాటలు మాట్లాడుతున్నావు. నీ తండ్రి కేసీఆర్ కూడా కాంగ్రెస్ అనే మర్రి వృక్షం నుంచి వచ్చినవాడే అని మరచిపోయావా కేటీఆర్ అని నిప్పులు చెరిగారు. సీఎం రేవంత్ రెడ్డి ని గెలకడం ఎందుకు తన్నించుకోవడం ఎందుకు అంటూ కేటీఆర్ ను ప్రశ్నించారు. కేటీఆర్ హరీష్ రావులు కోతల రాయలుగా మారారని అన్నారు. బిఆర్ఎస్ నాయకులు కావాలనే మా పార్టీ పై దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. అధికారంలో ఉన్నా లేకున్నా కాంగ్రెస్ నేతలు గంభీరంగానే ఉంటారన్నారు. కాంగ్రెస్ పార్టీ వ్యూహాలు ఎవరికి అంతుచిక్కవని, ఎవరికి అర్థం కావు అని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ వచ్చాక బ్యూరోక్రాట్స్ సంతోషంగా నిద్రపోయే రోజులు వచ్చాయని తెలిపారు. అధికారులను మానసికంగా కుంగదీసి కలెక్టర్లను మోకాళ్ళపై కూర్చో పెట్టిన ఘనత బిఆర్ఎస్ పార్టీది అన్నారు. ఈ భూమి మీద మనుషులు ఉన్నన్ని రోజులు కాంగ్రెస్ పార్టీ సంజీవనిలా ఉంటుందని జగ్గారెడ్డి తెలిపారు. దేశంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీలు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని రాహుల్ గాంధీని ప్రధాని కావాలని కోరుకుంటున్నాయని జగ్గారెడ్డి పేర్కొన్నారు.



# ముమ్మరంగా సమగ్ర సర్వే డాటా కంప్యూటరీకరణ

- 16 జిల్లాల్లో 100 శాతం సర్వే పూర్తి .
- 13 జిల్లాలలో 99 శాతంపైగా పూర్తైన సర్వే
- మంగళవారం నాటికి 1,10,18,102 నివాసాలలో సర్వే పూర్తి.
- ఇప్పటికే 20,86,707 నివాసాల సర్వే సమాచారం కంప్యూటరీకరణ పూర్తి

**విశ్వంభర,హైదరాబాద్:** రాష్ట్రంలో సామాజిక, ఆర్థిక, విద్యా, ఉద్యోగ, రాజకీయ, కుల గణన సర్వే తో పాటు కంప్యూటరీకరణ కూడా ముమ్మరంగా కొనసాగుతుంది. మొత్తం ఇప్పటి వరకు సేకరించిన సర్వే సమాచారంలో 20,86,707 నివాసాల సర్వే సమాచారాన్ని కంప్యూటరీకరించారు. ఈ సమగ్ర ఇంటింటి సర్వే లో మొత్తం 1,17,89,076 నివాసాలు గుర్తించగా, నేటివరకు 1,10,18,102 నివాసాలలో సర్వే పూర్తి చేసి 93.5 శాతానికి చేరుకుంది. రాష్ట్రంలో 16 జిల్లాలో 100 శాతం సర్వే పూర్తయింది. మరో 13 జిల్లాలో 99 శాతంపైగా సర్వే పూర్తి చేసుకొని 100 శాతం లక్ష్యానికి చేరువలో ఉన్నాయి. జి.హెచ్. ఎంసీ పరిధి లో కూడా సర్వే ముమ్మరంగా కొనసాగుతుంది. జిహెచ్ ఎంసీ పరిధి లో 25,05,517 నివాసాలు సర్వే చేయాల్సి ఉండగా నేటి వరకు 19,62,950 నివాసాలలో సర్వే పూర్తి చేసి 78.3 శాతానికి చేరుకుంది. డేటా ఎంట్రీ ఆపరేటర్, ఎన్యుమరేటర్ కలిసి సర్వే వివరాలను ఎలాంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్తగా నమోదు చేయాలని జిల్లా ఇన్ చార్జ్ అధికారులు ఆదేశాలు జారీ చేశారు, సర్వే పత్రాలను భద్రంగా ఉంచాలని అధికారులు స్పష్టమైనా ఆదేశాలు జారీ చేశారు .కుటుంబ సర్వే వివరాలను తప్పులు లేకుండా ఆన్ లైన్ లో నమోదుకు చర్యలు చేపట్టారు.

# శుక్రగ్రహంపై ఇస్రో దృష్టి..

## మిషన్ శుక్రయాన్‌కు భారత్ సిద్ధం..

**అంతరిక్ష ప్రయోగాలలో అమెరికా, రష్యాలతో పోలిస్తే చాలా ఆలస్యంగా భారత్ అడుగుపెట్టింది.కానీ అంతరిక్ష ప్రయోగ సంస్థ ఇస్రో తక్కువ కాలంలోనే ప్రపంచ దేశాలు అబ్బురపోయే అద్భుతాలను సాధించి సత్తా చాటింది. ఇప్పటికే చంద్రుడిపై వరుస ప్రయోగాలు చేపట్టిన ఇస్రో నాసా లాంటి సంస్థకు కూడా సాధ్యం కానీ విషయాలను ప్రపంచానికి తెలియజేసింది.ఇస్రో చేపట్టిన చంద్రయాన్-3 ప్రాజెక్ట్ విజయవంతం అయ్యింది. సూర్యుని అధ్యయనం కోసం ఆదిత్య-ఎల్1 సోలార్ మిషన్‌ని సైతం ప్రారంభించింది. ఈ ఉత్సాహంలోనే ఇస్రో ఇప్పుడు మన సౌర కుటుంబంలోనే అత్యంత ప్రకాశవంతమైన 'శుక్రుడు' (వీనస్) గ్రహంపై దృష్టి సారించింది. ఇస్రో శుక్రయాన్ ప్రయోగానికి సన్నద్ధమవుతోంది. అందుకు తగ్గ ఏర్పాట్లను కూడా మొదలు పెట్టింది.**



ఈ మిషన్‌కి అధికారికంగా ఇంకా పేరు ఖరారు చేయలేదు. కానీ.. అనధికారికంగా 'శుక్రయాన్-1' అని పిలుస్తున్నారు. ఇది సంస్కృత పదాలైన శుక్ర (వీనస్ గ్రహం), యానా (క్రాఫ్ట్)ల సమ్మేళనం.

ఈ శుక్రయాన్-1 మిషన్ ఆలోచన 2012లో పుట్టింది. 2017లో అంతరిక్ష శాఖ కోసం 2017-2018 బడ్జెట్‌లో 23% పెంచిన తర్వాత ఈ మిషన్‌కి సంబంధించిన ప్రాథమిక అధ్యయనాలను ఇస్రో ప్రారంభించింది. అదే ఏడాదిలో పరిశోధన సంస్థల నుండి పేలోడ్ ప్రతిపాదనలను కోరింది. శుక్రుడి ఉపరితలం, అక్కడి వాతావరణాన్ని అంచనా వేయడం, భౌగోళిక కూర్పును విశ్లేషించడమే ఈ మిషన్ ముఖ్య ఉద్దేశం. నాసా రిపోర్ట్ ప్రకారం.. శుక్రుడి ఉపరితలం మందంగా ఉంటుందని, ఇది విషపూరిత మేఘాలతో నిండి ఉందని తేలింది. ఈ శుక్రయాన్-1 మిషన్ సౌర వికిరణం, శుక్రుడిపై ఉపరితల కణాల మధ్య సంబంధాన్ని అర్థం చేసుకోవడంలో సహాయపడొచ్చు.బిలియన్ల సంవత్సరాల క్రితం భూ గ్రహం నివాసయోగ్యంగా ఉండేది కాదు. ఇప్పుడు శుక్రుడు ఎలా ఉన్నాడో, భూమి కూడా అలాగే ఉండేది. కాబట్టి.. శుక్రుడు గ్రహం భవిష్యత్తు ఏంటి? అనేది లోతుగా పరిశీలించడం కోసం ఈ వీనస్ మిషన్ శాస్త్రవేత్తలకు, స్పేస్ కమ్యూనిటీకి సహాయపడుతుంది.నాసా రిపోర్ట్ ప్రకారం.. శుక్రుడిపై ప్రస్తుతానికైతే జీవం లేదు. అయినప్పటికీ.. భూమి ఉపరితలం తరహాలోనే అక్కడ పీడనం ఉండటం, మేఘాలు చల్లగా ఉన్న నేపథ్యంలో అక్కడ సూక్ష్మజీవులు ఉండే అవకాశం లేకపోలేదని కొందరు శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. అంతేకాదు.. మేఘాల్లో సంభావ్య సూక్ష్మజీవుల జీవితానికి సూచిక అయిన ఫాస్ఫైన్‌ని సైతం గమనించారు. ఇప్పుడు చేపట్టబోయే వీనస్ మిషన్‌తో అక్కడ జీవం ఉందా? లేదా? అనే విషయాన్ని తేల్చే ఛాన్స్ ఉండొచ్చు.

చంద్రయాన్ సిరీస్‌లో మూడు ప్రయోగాలను పూర్తి చేసుకున్న అంతరిక్షంలోకి వ్యోమగాములను పంపేందుకు తొలి మాన్ మిషన్ కోసం ఏర్పాట్లు దాదాపు పూర్తి చేసుకుంది. చంద్రయన తర్వాత సూర్యుడిపై ప్రయోగం కోసం ఆదిత్యాయాన్ ను ఇప్పటికే ప్రయోగించింది.. అంగారక గ్రహంపై కూడా ప్రయోగం చేపట్టి కీలక విషయాలను ప్రపంచానికి తెలియజేసిన ఈశ్వరులు ఇప్పుడు శుక్ర గ్రహంపై పరిశోధనల కోసం శ్రీకారం చుట్టింది. శుక్రుడిపై ప్రయోగం కోసం శుక్ర మిషన్ ప్రాజెక్టు విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లగా అందుకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఇటీవలే పార్లమెంట్లో కేంద్ర ప్రభుత్వం ఇస్రో చేపట్టనున్న శుక్రయాన్ ప్రయోగం కోసం అవసరమైన బడ్జెట్‌ను ఆమోదించినట్లు తెలిపింది. బడ్జెట్ తో పాటు మిగిలిన అన్ని అనుమతులకు సంబంధించి గ్రీన్ సిగ్నల్ రావడంతో ప్రయోగానికి లైన్ క్లియర్ అయింది. ఇస్రో డైరెక్టర్ నీలేష్ దేశాయ్ ఇస్రో చేపట్టనున్న శుక్రయాన్ ప్రయోగానికి సంబంధించిన వివరాలను ప్రకటించారు. 2028లో ప్రయోగం జరగనున్నట్లు తెలిపారు. చంద్రుడిపై ప్రయోగాల కోసం సిరీస్ ప్రయోగాలు జరిగినట్టే సెక్యూరిటీ పై ప్రయోగాల కోసం కూడా దశలవారిగా ప్రయోగాలు చేపట్టే దిశగా ఇస్రో ముందుకు వెళుతోంది. 2028లో శుక్రయాన్ మిషన్ చేపట్టనున్న ఇస్రో ఆ తర్వాత కూడా వరుస ప్రయోగాలు చేపట్టే అవకాశం ఉంది.

### శుక్రయాన్ అంటే..

శుక్రయాన్ అనేది సంస్కృత పదం నుంచి ప్రేరణతో నామకరణం చేసినట్లు ఇస్రో తెలిపింది. శుక్ర అనే పదం శుక్ర గ్రహానికి సంబంధించింది. కాగా యాన అంటే సంస్కృతంలో క్రాఫ్ట్ లేదా వాహకనౌక అని అర్థం వస్తుంది. అందుకనే శుక్ర యాన్ అనే నామకరణం చేశారు. సెక్యూరిటీపై ప్రయోగం కోసం ఇస్రో చేపట్టనున్న తొలి ప్రయోగం ఇది. శుక్ర గ్రహం ఉపరితలం పై ఉండే వాతావరణంలో దట్టమైన కార్బన్ డయాక్సైడ్, అగ్నిపర్వతాల్లో నిత్యం ఉండే రసాయనక చర్యలు ఇక్కడ అధికంగా ఉంటాయి.. భూమిని పోలిన ఉపగ్రహంగా చెప్పబడే శుక్రుడు పై ఉపరితల అన్వేషణ అక్కడి లక్షణాలను గుర్తించడం అలాగే భౌగోళిక ప్రక్రియలను పరిశీలించడం కోసం ఇస్రో ఈ ప్రయోగం చేపడుతోంది. శుక్రుడి ఉపరితలంపై ఉన్న వాతావరణ పరిస్థితులను అధ్యయనం చేసేందుకు ప్రత్యేకమైన పరికరాన్ని ఇస్రో తయారు చేస్తుంది. అధునాతన పరికరాలను ఒక ద్వారా ఇస్రో అక్కడికి పంపి శుక్రుడు పై ఉన్న వాతావరణ పరిస్థితులను తెలుసుకునేందుకు సన్నాహాలు మొదలు పెట్టనుంది. శుక్రుడిపై ప్రయోగం కోసం ఇస్రో అంతర్జాతీయ సహకారం కూడా తీసుకోనుంది. యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ తోపాటు గ్లోబల్ స్పేస్ ఏజెన్సీల భాగస్వామ్యంతో మిషన్ డెవలప్మెంట్ చేసేందుకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ ప్రయోగం పూర్తయితే భారత దేశ అంతరిక్ష ప్రయోగాల్లో ఇది ఒక మైలు రాయిగా నిలవడం ఖాయం.

-పోతుగంటి వెంకటరమణ,
న్యూస్ నెట్‌వర్క్ ఇన్‌ఛార్జి
(వీ3 న్యూస్, విశ్వంభర)
సెల్: 6304475133


# రాబోయే తరాలకు సమగ్ర దిక్సూచి

**చరిత్ర అనేది భవిష్యత్తు తరాలకు బాట చూపుతుంది. అందుకే మన చరిత్రను మనమే రాసుకోవాలి. మన చరిత్రను మనమే తెలుసుకోవాలి. మూలాల లోకి వెళ్లి నిజమైన, లోతైన విషయాలను బయటకు తవ్వి తీయాలి. అప్పుడే ఆ ప్రాంతం గురించి గానీ, ఆ వ్యక్తుల గురించి గానీ మరుగున పడ్డ విషయాలు తెలుస్తాయి. ఇట్లా చరిత్రను వెలికి తీసే విషయాలలో వ్యక్తులు గానీ, సంస్థలు గానీ అనేక విధాలుగా కృషి చేయడం జరుగుతుంది . మరి ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించినంక మన చరిత్రను పునర్నిర్మాణం చేసుకోవల్సిన అవసరం ఏర్పడింది. సమైక్య రాష్ట్రంలో వలసవాదులు కప్పిపుచ్చిన , తెరమరుగైన మన వైభవాన్ని ముందు తరాలకు అందించే ప్రయత్నం చేయవలసిన అవసరం ఏర్పడింది. అందుకోసం గాను కృషి చేస్తున్న సంస్థలలో తెలంగాణ సారస్వత పరిషత్తు ముందు వరుసలో ఉంటుంది. సుదీర్ఘకాలంగాఇటువంటి పనిలో నిమగ్నమైంది. ఇదే కోవలో కొత్తగా తలపెట్టిన మరో విశిష్ట యజ్ఞమే జిల్లా సమగ్ర స్వరూప గ్రంథాల ప్రచురణ.**

తెలంగాణలో ఇప్పటివరకు ఏ విషయం ప్రస్తావనకు వచ్చినా పాత పది జిల్లాలే ప్రధాన ఆధారాలుగా ఉండేవి. అవన్నీ ఎప్పుడో రాసినవి. కానీ నేడు భౌగోళిక, నైసర్గిక స్వరూపాలు మారినవి. ప్రభుత్వం విశాల ప్రజల ప్రయోజనాల కాంక్షతో 33 జిల్లాలుగా విభజించిన నేపథ్యంలో సారస్వత పరిషత్తు కనుమరుగైన విషయాలను మరిన్ని వెలికితీయాలనే ఉద్దేశంతో ఈ గ్రంథాల రూపకల్పనకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే 19 జిల్లాల సమగ్ర స్వరూప గ్రంథాలు ఆవిష్కరణ గావించబడినవి. ప్రతి జిల్లా భూభాగాన్ని పరిధిగా నిర్ణయించుకొని ఆ పరిధిలో చరిత్రను ,సంస్కృతిని సాహిత్యంలోని విభిన్న ప్రక్రియలో కొనసాగుతున్న కృషిని, జానపదులు, సాహిత్యం,కలలు, శాస్త్రీయ కళారూపాలు, పర్యాటకప్రదేశాలు, జాతరలు, ఉద్యమాలు, త్యాగమూర్తులు, బాలసాహిత్యం, మహిళాభ్యుదయం, విద్య, పారిశ్రామిక, వ్యవసాయక, నీటిపారుదల మొదలైన రంగాలలో విభిన్న అంశాలపై క్షేత్రస్థాయిలో స్థానికంగా పట్టు ఉన్న రచయితలను గుర్తించి వారిచే అనేక ప్రామాణిక వ్యాసాలు రాయించి ఆయా జిల్లాల 'జిల్లా సమగ్ర స్వరూపం' పేరుతో సారస్వత పరిషత్తు పుస్తకాలుగా ముద్రించే ప్రక్రియను 90 శాతం పూర్తి చేసింది. ఇటువంటి ప్రక్రియ చేపట్టడం అంటే అంతా సులువైన పని కాదు. ఎన్నో వనరులు కలిగిన యూనివర్సిటీల వంటి సంస్థలకు మాత్రమే సాధ్యం. కానీ అత్యల్ప ఆదాయ వనరులు కలిగిన తెలంగాణ సారస్వత పరిషత్తు ఈ యజ్ఞానికి పూనుకోవడమే నిజంగా ధైర్య సాహసమే. అందుకు ముందుగా పరిషత్తు రథసారథులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, జుర్రు చెన్నయ్య నిర్విరామ కృషి కొనియాడదగింది. ముద్రించిన పుస్తకాలను ఆయా జిల్లా కేంద్రాల్లో ఆవిష్కరించడం జరుగుతుంది. 33 జిల్లాల ఆవిష్కరణలు పూర్తయితే సమగ్ర తెలంగాణ స్వరూపమే మారబోతుంది . ఎన్నో తెలియని విషయాలు తెలుస్తాయి. మన చరిత్ర వైభవాన్ని మనమే చూసి మురిసిపోతాం. అంతే కాదు ఇటువంటి గ్రంథాలు రేపటి భవిష్యత్తులో పరిశోధనలకు దిక్సూచిగా మారుతాయనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఈ పరంపరలో ఇటీవలనే నల్లగొండ జిల్లా కేంద్రంలోని నాగార్జున కళాశాలలో 'నల్లగొండ జిల్లా సమగ్ర స్వరూపం ' గ్రంథం తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించబడింది.

నల్లగొండ జిల్లా సమగ్ర స్వరూపం గ్రంథం విషయానికి వస్తే కాకతీయు సామ్రాజ్యాన్ని పరిపాలించిన మహారాణి రుద్రమదేవి మరణించిన చందుపట్ల శాసనం ఈ పుస్తకానికి ముఖచిత్రంగా తీసుకోవడం ఎంతో ఆకర్షణీయంగా ఉంది. ముఖచిత్రం చూడగానే ఆ పుస్తకం విశిష్టత ఏమిటో తెలిసేలా ఉంది. పుస్తకం చివరి కవర్ పేజీ బుద్ధవనం చిత్రం బంగారు వన్నెలో తల తలలాడుతుంది. ఇన్నర్ కవర్ పేజీల లో ఒకపక్క దేవరకొండ దుర్గం, మరోపక్క పానగల్లు ఛాయా సోమేశ్వరాలయం ఆకట్టుకునే చిత్రాలతో ఉంది. 434 పేజీలతో 43 వ్యాసకర్తల ప్రామాణిక వ్యాసాలతో ఈ పుస్తకం రూపొందించబడింది. నల్లగొండ జిల్లాకు సంబంధించి ఈ పుస్తకాన్ని ఎన్సైక్లోపీడియా (విజ్ఞాన సరస్వం ) గా అభివర్ణించవచ్చు.


ఇందులో మొదటగా జిల్లా నైసర్గిక స్వరూపం పేరుతో కనకటి రామకృష్ణ అనే రచయిత జిల్లా వైశాల్యం, ఎల్లలు, మండలాలు గ్రామాల వివరాలు మొదలైన అంశాలతో ఎన్నో విజ్ఞానదాయకమైన విషయాలను అందించడం జరిగింది. అట్లాగే నర్రా లవేందర్ రెడ్డి రాసిన నల్లగొండ జిల్లా ప్రజా ప్రతినిధులు అనే వ్యాసంలో పార్లమెంటు నియోజకవర్గ వివరాలు, మొదటి నుండి ఇప్పటివరకు శాసనసభ నియోజకవర్గాలలో పోటీ చేసి గెలిచిన అభ్యర్థులు, జిల్లా పరిషత్తు చైర్మన్ ల వివరాలు శాసన మండలి సభ్యుల వివరాలు మొదలైన ఎన్నో అంశాలు అందించడం జరిగింది. నల్లగొండ అంటేనే తెలంగాణ సాయుధ పోరాటంలో అగ్ని కణంగా నిలిచి నాటి నిజాం నిరంకుశ ప్రభుత్వాన్ని కూకటి వేళ్ళతో పెకిలించిన విప్లవ అభ్యుదయ జిల్లాగా కీర్తికెక్కింది. ఈ వ్యాసంలో వ్యక్తుల గురించి చదువుతుంటే ఎన్నో తెలియని విషయాలు, వారి గొప్పతనం తెలుస్తుంది. అలాగే జిల్లా రాజకీయ చరిత్ర అనే వ్యాసంలో డాక్టర్ దామరాజు సూర్య కుమార్ నవీన శిలాయుగం, బృహాత్ శిలా యుగం నాటి ఇక్ష్వాకుల, విష్ణుకుండినుల, రాష్ట్ర కూటుల కళ్యాణి చాళుక్యుల, రెడ్డి రాజుల, కాకతీయుల, పద్మనాయకుల,కుతుబ్ షాహిల వంటి అనేక విషయాలను వెల్లడించారు. కన్నె కంటి వెంకటరమణ నల్లగొండకు ఆ పేరు ఎలా వచ్చింది? అనే వ్యాసంలో నల్లగొండ ఏర్పడిన రీతి, పెద్ద గడియారం ప్రాముఖ్యత మొదలైన అంశాలను వివరించారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో శాసనాలు అనగానే గుర్తు వచ్చే పేరు డాక్టర్ బి.ఎన్.శాస్త్రి. తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తూ భిన్నూరి మనోహరి నల్లగొండ జిల్లా శాసనాలపై సాధికారమైన వ్యాసం రాశారు. అలాగే పానగల్లు పచ్చల, ఛాయా సోమేశ్వర ఆలయాల విశిష్టత గురించి కన్నెగంటి వెంకటరమణ పానగల్లు విశేషాలు అనే మరో వ్యాసంలో సమగ్రంగా వివరించారు. నల్లగొండ జిల్లా కనగల్ ప్రాంతానికి చెందిన మరింగంటి కవుల గురించి పరిశోధన చేసిన ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ శ్రీ రంగాచార్య వివరించిన అంశాలు నేటి తరానికి ఎంతో ఉపయోగపడనున్నవి. అలాగే జిల్లా ఆధునిక పద్య కవిత్వం గురించి టంగుటూరి సైదులు అన్ని అంశాలు అందించారు. జిల్లా శతక సాహిత్యం అనే వ్యాసంలో డాక్టర్ సాగర్ల సత్తయ్య శతక సాహిత్యం గురించి ఎన్నో వివరాలు అందించారు.




యక్షగానం పై పరిశోధన చేసిన డాక్టర్ కృష్ణ కౌండిన్య నల్లగొండ జిల్లా యక్షగానం సాహిత్యం అనే వ్యాసం అద్భుతంగా రాశారు. అలుగెల్లిన పాట పేరుతో ప్రముఖ గాయకుడు అంబటి వెంకన్న జిల్లాలో పాటలు పుట్టిన విధానం పైన సమగ్రంగా తెలియజేశారు. జిల్లా అభ్యుదయం కవిత్వం పేరుతో డాక్టర్ బకరం నరసింహా, జిల్లాలో దళిత బహుజన కవిత్వం గురించి భూతం ముత్యాలు లోతైన విషయాలను రాశారు. ఇవన్నీ పరిశోధన విద్యార్థులకు ఎంతో ఉపయోగం కాగలవు. జిల్లా ముస్లిం వాద సాహిత్యం గురించి స్కైబాబా లోతైన వివరాలు అందించారు. తెలంగాణ మలి పోరులో జిల్లా కవిత్వం సాగిన విధానం గురించి కస్తూరి ప్రభాకర్ కులంకషమైన వివరాల అందించారు. జిల్లా విప్లవ కవిత్వం గురించి పెరుమాళ్ల ఆనంద్, జిల్లా కథా సాహిత్యం గురించి మే రెడ్డి యాదగిరి రెడ్డి లోతైన వివరాలను అందించారు. డాక్టర్ మద్దిరాల సత్యనారాయణ రెడ్డి నవలా సాహిత్యంలో చోటు చేసుకున్న విషయాలు సవివరంగా తెలిపారు. జిల్లాలో జానపద కళారూపాల గురించి డాక్టర్ పలస వెంకటేశ్వర్లు వ్యాస రూపంలో అందించారు. చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ గా ఉన్న ఆచార్య సూర్య ధనుంజయ్ జిల్లా గిరిజన సాహిత్యం పేరుతో ఎన్నో అద్భుతమైన విశేషాలు అందించారు. జిల్లా ఆశ్రిత కులాల సాహిత్యం గురించి డాక్టర్ పి. హంసమ్మ వ్యాస రూపంలో వివరాలు చేర్చారు. నల్లగొండ జిల్లా స్త్రీల సాహిత్యం గురించి డాక్టర్ ఎన్. దీపిక చక్కగా రాశారు.

ప్రముఖ బాలసాహితీవేత్త,రచయిత, ఉపాధ్యాయుడు కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి నల్లగొండ జిల్లా బాల సాహిత్యం అనే వ్యాసంలో బాల సాహిత్యం కొనసాగిన మరియు కొనసాగుతున్న తీరుతెన్నుల గురించి తెలియజేయడమే కాకుండా అనేక మంది పేరు పొందిన బాలసాహితీవేత్తల వివరాలను సమగ్రంగా అందించడం జరిగింది. ఇవన్నీ నేటి తరానికి ఎంతో ఉపయోగం అవుతాయి. అదేవిధంగా నల్గొండ పట్టణానికి చెందిన పున్న అంజయ్య, డాక్టర్ మునగపాటి అరవింద జిల్లా పత్రికా రంగం గురించి అనేక వివరాలు పరిశోధించారు. జిల్లా పర్యాటక ప్రదేశాల గురించి డాక్టర్ ఉప్పల పద్మ రాసిన వ్యాసంలో నల్లగొండ,ఉదయ సముద్రం, కన్నెకల్లు, రాచకొండ, దేవరకొండ, చండూరు, కొండమల్లేపల్లి, మూసి ప్రాజెక్టు తదితర ప్రదేశాల ప్రస్తావన ఉంది. నల్లగొండ జిల్లా దేవాలయాల గురించి డాక్టర్ సాగి కమలాకర్ శర్మ అనేక దేవాలయాల చరిత్రను విశదపరిచారు. రామగిరి రామాలయం రెండో భద్రాద్రి అనే వ్యాసంలో కన్నెకంటి వెంకటరమణ తెలియని ఎన్నో వివరాలు సేకరించారు. సాహిత్య సంస్థల గురించి సాగర్ల పద్మ, పున్నమి వ్యాస రూపంలో అంశాలను ఎరుక చేశారు. జిల్లాలో బతుకమ్మ పాటలు విశిష్టత గురించి డాక్టర్ బండారు సుజాత శేఖర్ సమగ్రమైన వివరాలు తెలియజేశారు. నల్లగొండ జిల్లాలో సంగీత నృత్య కళా వికాసం గురించి డాక్టర్ ఎం పురుషోత్తమాచార్య ఎన్నో విశేషాలు అందించడం జరిగింది. ఇటీవలనే అకాల మరణం చెందిన డాక్టర్ మండల స్వామి జిల్లా గ్రామ నామాలు, శాసన ఆధారాలు లోకోక్తులు అనే వ్యాసంలో ఎన్నో ఆసక్తికరమైన అంశాలను అందించడం జరిగింది. ఈ అన్ని అంశాలు కూడా ఎంతో ఉపయోగం. జిల్లాలో సినిమా రంగం గురించి పున్న అంజయ్య సమగ్రమైన వివరాలు అందించారు. నల్లగొండ తొలి వీడియో సినిమా తపస్విని, విద్యా వికాసం అనే వ్యాసంలో ప్రమోద్ అవంచ ఎన్నో వివరాలు తెలిపారు. నాగార్జునసాగర్ విజయపురి శీర్షికన వెంకట కృష్ణమాచార్యులు, ప్రతిజ్ఞ రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు వ్యాసంలో మధు వాకిటి, జిల్లా క్రీడా రంగం గురించి కదారి మల్లేశం, వ్యాస రూపంలో అనేక అంశాలు అందించారు. అలాగే నల్లగొండకు పేరు తెచ్చిన పెద్దలు అనే వ్యాసంలో అనేకమంది ప్రముఖ వ్యక్తుల గురించి తెలియని ఎన్నో సమగ్రమైన వివరాలు వ్యాస రూపంలో వివిధ రచయితలు అందించడం జరిగింది. ఇక పుస్తకం చివరలో నల్లగొండతో నా జ్ఞాపకాలు అనే వ్యాసంలో డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి తనకు నల్లగొండతో గల సంబంధాలను సవివరంగా తెలంగాణ యాసలో రాయడం జరిగింది. ఇతిహ్యాలు కల్పనలా? వాస్తవాలా? అనే వ్యాసంలో డాక్టర్ రాపోలు శ్రీనివాస్ మరికొన్ని అంశాలను కూడా వివరించడం జరిగింది.

ఇట్లా 'నల్లగొండ జిల్లా సమగ్ర స్వరూపం" గ్రంథంలో ఎన్నో అంశాలను రచయితలు అందించడం జరిగినప్పటికీ, ఇంకా కొన్ని కొన్ని అంశాల పరిధిలో మరి కొందరి సమాచారం సేకరించి రాస్తే బాగుండేది. ఇది ఒక మంచి ప్రయత్నం. పరిపూర్ణం కానప్పటికీ జిల్లా సమగ్ర స్వరూపాన్ని తెలియజేసే అంశం. ఈ గ్రంథంలోని అంశాలన్ని పరిశోధన చేసే విద్యార్థులకు ఎంతో ఉపయోగపడగలవు. నేటి తరానికే కాకుండా రాబోయే తరానికి కూడా ఈ గ్రంథం సమగ్రమైన దిక్సూచి అవుతుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఎంతో వ్యయ ప్రయాసాలకోర్చి ఎంతో సమయాన్ని వెచ్చించి వ్యాసకర్తలు తమ తమ పరిధిలోని అంశాలను సవివరంగా అందించే ప్రయత్నం చేయడం సాధారణమైన పని కాదు. అట్లాగే కోర్ కమిటీ కన్వీనర్, సభ్యులు, సారస్వత పరిషత్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎల్లురి శివారెడ్డి, జుర్రు చెన్నయ్య మొదలైన వారి కృషి ఫలితమే ఈ పుస్తకం. నల్లగొండ జిల్లా సమగ్ర స్వరూపం గ్రంథాన్ని అన్ని జిల్లాల గ్రంథాలయాలలో, ప్రతి ఉన్నత పాఠశాల గ్రంథాలయాలలో అందుబాటులో ఉంచవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.



- కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి
9441561656

# క్రమశిక్షణతో దేనినైనా సాధించగలం

**76వ ఎన్.సి.సి దినోత్సవంలో గీతం ప్రోవీసీ ప్రొఫెసర్ డీఎస్ రావు**

**విశ్వంభర, సంగారెడ్డి:** దేశంలో మనం ఏ మైలురాయిని సాధించాలన్నా క్రమశిక్షణతో అధిగమించగలమని గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీఎస్ రావు ఉద్ఘోటించారు. జాతీయ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) 76వ వ్యవస్థాపక దినోత్సవాన్ని మంగళవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఎస్ రావు మాట్లాడుతూ, ఎన్.సి.సి నినాదమైన ఐక్యత, క్రమశిక్షణతో క్యాడెట్లు ప్రతి అంశంలో రాణించగలుగుతారని, ఎందుకంటే వారు క్రమశిక్షణ, కష్టపడి పనిచేయడం వంటి లక్షణాలను కలిగి ఉంటారన్నారు. ఈ క్రమశిక్షణ వారి జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి బలం, ధైర్యం, ఓర్పును అందిస్తాయని చెప్పారు. మనదేశం మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించేందుకు కృషి చేస్తున్నందున, తక్కువ తలసరి ఆదాయం సవాలు పరిష్కరించే దిశగా ఎన్.సి.సి క్యాడెట్లు తాము సముపార్జించుకున్న జ్ఞానంతో కృషిచేయాలని, పౌరుల జీవన ప్రమాణాలను పెంపొందించాలని ప్రొఫెసర్ రావు పిలుపునిచ్చారు. ఎన్.సి.సి క్యాడెట్ గా తన అనుభవాలు, క్యాంపు, అక్కడి భోజన వసతి సౌకర్యాలను ఈ సందర్భంగా ఆయన గుర్తుచేసుకున్నారు. తొలుత, ఈ వేడుకలు ఎన్.సి.సి జెండా వందనంతో పాటు క్యాడెట్ల ఖచ్చితత్వం, క్రమశిక్షణ, అంకితభావాన్ని ప్రదర్శించే కవాతుతో ప్రారంభమయ్యాయి. దీని తర్వాత పర్యావరణ ప్రాముఖ్యతను చాటిచెప్పేలా కొన్ని మొక్కలను నాటారు. ఈ ఉత్సవాలలో ఆధునిక సృజనాత్మకతతో గొప్ప సంప్రదాయాలను మిళితం చేసి ప్రేక్షకులను కట్టిపడేసే ఉత్సాహభరితమైన సాంస్కృతిక ప్రదర్శనలు కూడా ఉన్నాయి. నేపాల్లో జరిగిన ఎన్.సి.సి యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్ (వైఈపీ)లో పాల్గొన్న గీతం విద్యార్థిని, క్యాడెట్ అండర్ ఆఫీసర్ మహిత కొండూరిని ప్రొఫెసర్ రావు సత్కరించారు. ఒక కోటు, మొక్కను అందజేశారు. ఆమె, తన ప్రతిస్పందనలో నేపాల్ కు తన ప్రయాణం, అక్కడ రోజువారీ నిర్వహించిన సాహసోపేతమైన కార్యక్రమాలను వివరించడంతో పాటు, ఈ అవకాశం కల్పించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్.సి.సి క్యాడెట్ ప్రధాన లక్షణాలను జూనియర్ అండర్ ఆఫీసర్ అబ్దుల్ హాదీ షరీఫ్ వివరించగా, క్యాడెట్ సంహిత వందన సమర్పణ చేశారు. ఈ వేడుకలలో గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్పోర్ట్స్ డిప్యూటీ డైరెక్టర్ ఎం.నారాయణ రావు చౌదరి, ఎన్.సి.సి కేర్ టేకర్ ఆఫీసర్ ఎస్.అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## కూడా చైర్మన్ ఇంగాల వెంకటరామిరెడ్డికి
## ఆహ్వాన పత్రిక అందించిన ఆలయ పూజారి



**విశ్వంభర, హనుమకొండ:** శ్రీ హనుమద్గిరి పద్మాక్షి దేవస్థానము కార్తీక దిపోత్సవానికి కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి కి ఆహ్వాన పత్రికను ఆలయ పూజారి అందించారు. శ్రీ హనుమద్గిరి పద్మాక్షి దేవస్థానము హనుమకొండ వారి ఆధ్వర్యంలో ఈ నెల 30 శనివారం సాయంత్రం 5గంటలకు శ్రీ హనుమద్గిరి పద్మాక్షి దేవాలయ ప్రాంగణం (గుట్ట క్రింద) శ్రీ శివపార్వతుల కళ్యాణం పవిత్ర కార్తీక దీపోత్సవం ఏర్పాటు చేస్తున్న సందర్భంగా ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ నాగిళ్ళ షణ్ముఖపద్మనాభ అవధాని వరంగల్ కుడా చైర్మన్ ని సాదరంగా ఆహ్వానించారు.

## గుగులోతు రాజుని పరామర్శించి ఎమ్మెల్యే మురళీ



**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాద్ మండలం పర్వతగిరి గ్రామపంచాయతీ సోమ్లు తండాకు చెందిన గుగులోతు రాజు మహబూబాద్ ఏరియా హాస్పిటల్ లో చికిత్స పొందు తున్నాడని విషయం తెలుసుకున్న మహబూబాబాద్ ఎమ్మెల్యే డా. భూక్యా మురళీ నాయక్ హాస్పిటల్ కి వెళ్లి రాజు పరిస్థితినిఎలా ఉంది అని వైద్యులను అడిగి తెలుసుకున్నాడు. రాజు ఎమ్మెల్యే మురళీ నాయక్ స్వంత తండా వాసి, అతనికి మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే వైద్యులకు సూచనలు ఇచ్చారు.

## గ్రామాల్లో పనుల జాతర ప్రారంభం




**విశ్వంభర, చారకొండ:** రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్న నేపథ్యంలో పల్లెల్లో పనుల జాతరకు రంగం సిద్ధమైంది. అచ్చంపేట నియోజకవర్గంలో చారకొండ మండల కేంద్రం, తుర్కల పల్లి గ్రామాలలో నూతన అంగన్వాడీ భవన నిర్మాణం కొరకు ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ శంకుస్థాపన చేశారు. అచ్చంపేట నియోజకవర్గంలో మండలాలు, గ్రామాల్లో కూడా పనుల జాతర కొనసాగనుంది. గ్రామాల, పట్టణాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా బుధవారం పనులు ప్రారంభించింది. పనుల జాతరలో ఉపాధి హామీ పథకం, గ్రామీణ రహదారుల నిర్మాణం, గ్రామపంచాయతీ, అంగన్వాడి కేంద్రాల ఏర్పాటు, వివిధ సంక్షేమ పథకాలకు భవన నిర్మాణాల పనులను ఈ కార్యక్రమంలో చేపాడటం జరుగింది. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, మండల అధ్యక్షులు బలరాం గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుండె వెంకట్ గౌడ్, సింగిల్ విండో ఛైర్మన్ జిల్లా గురువయ్య గౌడ్, కట్ట సహదేవా, జిల్లా జనరల్ సెక్రెటరీ గ్యార మహేందర్, రవికుమార్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ హాస్టల్‌లో విద్యార్థినితో నగ్న పూజ?



**విశ్వంభర, భూపాలపల్లి:** మూఢనమ్మకాల ముసుగులో బాలికల వసతి గృహంలో దారుణానికి ఒడిగట్టారు. హాస్టల్‌లో వంట పని చేసే వంట మనిషి ఈ దారుణా నికి పాల్పడటం విడ్డూరం. ఈ దారుణ ఘటన పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని బాలికల వసతి గృహంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకెళ్తే.. పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని ప్రభుత్వ బాలికల వసతి గృహంలోపొరుగు జిల్లాకు చెందిన ఓ విద్యార్థిని, తన సోదరితో కలిసి ఉంటుంది. బాలిక తల్లిదండ్రులు పేదవారు కావడంతో ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటూ అక్క చెల్లెల్లు చదువుకుంటున్నారు. వారి పేదరికాన్ని ఆసరాగా చేసుకున్న హాస్టల్‌లో పనిచేసే ఓ వంట మనిషి దారుణానికి ఒడిగట్టింది. ఆ ఇద్దరు బాలికలను చేరదీసినట్టుగా నటిస్తూ పెద్ద కుట్రకు తెరదించింది. వారిలో పెద్దమ్మాయికి మాయ మాటలు చెప్పి.. నగ్న పూజలు చేస్తే కనకవర్షం కురుస్తుందని నమ్మించింది. ఆ డబ్బుతో మీ కుటుంబం అంతా సంతోషంగా ఉండవచ్చని నమ్మబలికింది. వంట మనిషి మాయ మాటలు నమ్మిన బాలిక ఆమె చెప్పినట్లు చేయడానికి అంగీకరించింది. ఈ క్రమంలో వారం క్రితం వంట మనిషి ఉండే గదికి ఓ వ్యక్తిని తీసుకువచ్చింది. అక్కడకి బాలికను పిలిపించి అతని ముందర నగ్నంగా ఉండాలని చెప్పింది. అప్పుడు అతడు ప్రత్యేక పూజలు చేస్తాడని, అప్పుడు డబ్బు బంగారం రాశులు కురుస్తాయని చెప్పింది.దీంతో ఒక్కసారిగా షాక్‌కు గురైన ఆ విద్యార్థిని భయంతో అక్కడి నుంచి పారిపోయింది. మంథని పట్టణంలో ఉన్న తమ బంధువుల ఇంటికి వెళ్లి 4 రోజులుగా అక్కడే తలదాచుకుంది. అనంతరం అసలు విషయం బాలిక తల్లిదండ్రులకు తెలియడంతో స్థానికంగా కలకలం రేగింది. బాలిక తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు, బంధువులు హాస్టల్ వద్దకు చేరుకుని సదరు వంట మనిషిని నిలదీశారు. సమాచారం అందుకున్న సీఐ రాజు, ఎస్ఐ రమేశ్ ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సర్దుమనిగేలా చర్యలు చేపట్టారు. బాలికను ప్రలోభ పెట్టిన మహిళను అదుపులోకి తీసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు. విద్యార్థిని తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో.. పోలీసులు పోక్సో కేసు నమోదు చేసినట్టు మంథని ఎస్ఐ తెలిపారు.

## విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించిన డీఈఓ



**విశ్వంభర, మహబూబాబాద్:** శిరోల్ మండలం జడ్పీహెచ్ఎస్ మన్నెగూడెం పాఠశాలను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ రెడ్డి పరిశీలించారు. అనంతరం బుధవారం భారత రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిరోల్ మండల విద్యాశాఖ అధికారి ఇస్లావత్ లచ్చిరాం నాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్, ఎఫ్ ఏ ఓ బుచ్చయ్య, కోఆర్డినేటర్ చంద్రశేఖర్ ఆజాద్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## అంగన్వాడి, పంచాయతీ
## భవన నిర్మాణాలకు నిధులు మంజూరు



**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లా మంథని నియోజకవర్గ పరిధిలోని కాటారం రెవెన్యూ డివిజన్లో ఐదు మండలాల్లో 12 అంగన్వాడీ కేంద్రాలు, ఎనిమిది గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలకు 3 కోట్ల 10 లక్షల రూపాయలు మంజూరు చేయించినట్లు మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు క్యాంపు కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. కాటారం, మహ ముత్తారం, మల్హర్ రావు, మహాదేవపూర్, పలిమెల మండలాల్లో నూతన భవన నిర్మాణాలకు మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు కలెక్టర్ నిధులు మంజూరు చేసినట్లు క్యాంప్ కార్యాలయం తెలిపింది. మండలాలలో పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయడంతో ఆయా ప్రాంతాల ప్రజలు, కాంగ్రెస్ నాయకులు మంత్రికి, కలెక్టర్ కు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి

**ఎమ్మెల్యే డా. సి వంశీకృష్ణ**



**విశ్వంభర, చారకొండ:** ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభు త్వ పాఠశాలలను తెలంగాణ ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా చారకొండ మండలం తుర్కలపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలను ఎమ్మెల్యే అకస్మికంగా తనిఖీ చేసి పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులతో మాట్లాడి వారికి కావలసిన వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం తరగతి గదిని సందర్శించి విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థులకు కందుతున్నటువంటి పాఠ్యపుస్తకాలు దుస్తులు మొదలైన సౌకర్యాల గురించి విద్యార్థులు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం పాఠశాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పాఠశాలలో మూలిక వసతుల కల్పనకు సీఎస్ఆర్ నిధుల నుండి మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను మరింత పెంచాల్సి పెంచాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో మండల నాయకులు, గ్రామ సీనియర్ నాయకులు కట్ట సహదేవ్, జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ గ్యార మహేందర్, బొడ్డు దశరథం, గ్రామ కమిటీ అధ్యక్షుడు బొమ్మ కంటి కృష్ణయ్య, ఎస్.కె బాబా, కారింగు కృష్ణయ్య, కట్ట రవికుమార్, జోగు గణేష్, ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర స్థాయి డ్రాప్ రో బాల్ ఛాంపియన్ షిప్ పోటీలు



**విశ్వంభర, రంగారెడ్డి:** ఇబ్రహీంపట్నం లోని స్థానిక గురుకుల విద్యాపీట్ పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర స్థాయి మూడవ సబ్ జూనియర్ , రెండవ జూనియర్ బాల బాలికల డ్రాప్ రోబాల్ ఎంపిక, టోర్నమెంట్ను ఛాంపియన్షిప్ ను స్థానిక ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్ పర్సన్ కప్పరి స్రవంతి చందు, గురుకుల విద్యాపీఠ్ పాఠశాలల కరస్పాండెంట్ శ్రీనివాస రావు, అలాగే తెలంగాణ డ్రాప్ రోబాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.డి. రహమత్ లు కొబ్బరికాయ కొట్టి , రిబ్బన్ కట్ చేసి క్రీడా పోటీలను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా విచ్చేసినటువంటి మున్సిపల్ చైర్ పర్సన్ క్రీడాకారులకు ముందుగా శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే క్రీడలు మానసిక , ఉల్లాసానికి, మరియు ఉద్యోగ అవకాశలు, పొందడానికి స్పోర్ట్స్ కోటా అనేది ఎంతో తోడ్పడతాయని తెలియజేశారు. గురుకుల పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస రావు మాట్లాడుతూ చదువుతోపాటు, క్రీడలు, కూడా ఎంతో ప్రాముఖ్యం అని తెలియజేశారు. ఈ పోటీలకు తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి సుమారుగా 100 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ క్రీడ పోటీలో గెలుపొందిన క్రీడాకారులు వచ్చే జనవరి నెలలో జరిగే జాతీయస్థాయి డ్రాప్ రో బాల్ ఛాంపియన్షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలంగాణ రాష్ట్ర డ్రాప్ రో బాల్ అసోసియేషన్, రాష్ట్ర కార్యదర్శి ఎం.డి. రహమత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర టెక్నికల్ అబ్జర్వ్ కమిటీ కార్యదర్శి, ఎం.డి. అక్బర్ బాబా, రంగారెడ్డి జిల్లా జాయింట్ సెక్రెటరీ సురేందర్, రంగారెడ్డి జిల్లా టెక్నికల్ అబ్సర్వ్ కమిటీ అనూష, నల్గొండ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, రాము, ఇతర పి.ఈ. టి లు లింగస్వామి, తెలంగాణ రాష్ట్ర కోచ్ గౌరీ శంకర్, సుధాకర్ శ్రీను, అభిలాష్ పాల్గొన్నారు.

## గ్రామాల సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**



**విశ్వంభర, పటాన్ చేరు:** సంగారెడ్డి జిల్లా పటాన్ చేరు నియోజకవర్గ పరిధిలోని ప్రతి గ్రామ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా నిధులు కేటాయిస్తున్నామని పటాన్ చేరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ప్రజాపాలన వారోత్సవాలలో భాగంగా సి ఆర్ ఆర్ పథకం ద్వారా నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాల పరిధిలో నూతన రోడ్ల నిర్మాణానికి 20 కోట్ల 86 లక్షల రూపాయల నిధులు మంజూరు అయ్యాయని ఆయన తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని నందిగామ నుండి బానూరు గ్రామం వరకు కోటి రూపాయలు అంచనా వేయడంతో నిర్మించ తలపెట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామాలు, పట్టణాల సమగ్ర అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నూతన అభివృద్ధి పనులకు రూపకల్పన చేస్తున్నామని తెలిపారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. అనంతరం నందిగామ గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 50వేల రూపాయలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకట్ రెడ్డి, దశరథ్ రెడ్డి, గోపాల్, శ్రీశైలం యాదవ్, ఎంపీడీవో యాదగిరి, పంచాయతీరాజ్ విభాగం డిఈ సురేష్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్



**విశ్వంభర, భూపాలపల్లి:** ధాన్యం కొనుగోలు వేగంగా, సమర్థంగా జరగాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మంగళవారం గణపురం మండలం అప్పయ్యపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రాల పనితీరును తనిఖీ చేస్తూ ట్యాబ్ ఎంట్రీలలో ఆలస్యం జరుగకుండా వేగంగా చేయాలని ఆదేశించారు. మిల్లింగ్ ఎంట్రీలు కూడా సకాలంలో చేయడం వల్ల రైతులకు డబ్బులు వేగంగా చెల్లించడానికి వీలుపడుతుందని తెలిపారు. సకాలంలో చెల్లింపు చేయడంతో రైతుల అవసరాలకు డబ్బు ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. కొనుగోలులో అధికారులు, సిబ్బంది మరింత జాగ్రత్తగా వ్యవహరించి, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. ఇటువంటి చర్యల ద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, సమయానుకూలంగా జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఎఫ్ఏక్యూ వచ్చిన ధాన్యం కొనుగోలులో జాప్యం చేయొద్దని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యం కేటాయించిన మిల్లులకు రవాణా చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉండటం వల్ల ఇతర రైతులు ధాన్యం ఆరబెట్టటానికి. ఇబ్బంది వస్తుందని అందువల్ల తక్షణమే రవాణా చేయాలని సూచించారు. వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయని ధాన్యం ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున మరింత సన్నద్ధతో ఉండాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాలు అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, తహసిల్దార్ సత్యనారాయణ స్వామి, పీఏసీఎస్ ఛైర్మన్ కుమార్ యాదవ్, సీఈఓ సురేష్ పాల్గొన్నారు.

**మహబూబాద్ పురపాలక సంఘం పరిధిలోని మున్సిపల్ వైస్ ఛైర్మన్ మార్నేని వెంకన్న ప్రత్యేక చొరవతో 23, 24, 25, 26 వార్డు పరిధిలోని మూడు కోట్ల సెంటర్ నుండి నరసింహ నగర్ వరకు డివైడర్ కు రెండువైపులా ఉన్న చెత్తను మట్టిని మున్సిపల్ సిబ్బంది తొలగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కరుణాకర్, జవాన్ చిరంజీవి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.**
**(విశ్వంభర, మహబూబాబాద్)**





## ముఖ్యమంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం

**విశ్వంభర, ఆమనగల్లు:** తలకొండపల్లి మండల కేంద్రంలో ప్రజలు ఆకాంక్షలకు అనుగుణంగా పేద, మధ్యతరగతి విద్యార్థులకు భవిష్యత్తు కై అధునాతనమైన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎంపీ మల్లు రవి, కల్వకుర్తి శాసనసభ్యులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 190 జివో విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినందున, మండలంలోని ఖానాపూర్ గ్రామ శివార్లలో స్కూలు నిర్మించనున్న సందర్భంగా తలకొండపల్లిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం, ఎంపీ, ఎమ్మెల్యేల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి, కిసాన్ సెల్ రాష్ట్ర నాయకులు మోహన్ రెడ్డి, డీసీసీ జిల్లా కార్యదర్శి రవీందర్ యాదవ్, మార్కెట్ డైరెక్టర్ ఎండి అజీమ్, బ్లాక్ కాంగ్రెస్ కార్యదర్శి డిగ్రీ కృష్ణ, చెన్నకేశవులు, ఎండి అరిఫ్, మాజీ ఎంపీపీ రఘు రాములు, కాంగ్రెస్ పార్టీ నాయకులు డేవిడ్, రేణు రెడ్డి, రాములు, తుమ్మ నరసింహ, దీప్తి శ్రీశైలం, రమేష్, హరిమోహన్ రెడ్డి, కాకి కృష్ణ, రమేష్ యాదవ్, వెంకటయ్య, శంకర్, మచ్చేందర్, అనీల్, ప్రదీప్ రెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**ఎమ్మెల్యే మందుల సామేలు**



**విశ్వంభర, తుంగతుర్తి:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తున్నారని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ అన్నారు. తుంగతుర్తి మండల పరిధిలోని పలు గ్రామాల లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను తిరుమలగిరి లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మొత్తం 21 మంది లబ్దిదారులకు రూ.9 లక్షల 11 వేల 500 ల రూపాయల విలువగల చెక్కులను ఎమ్మెల్యే సామెల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తోందని అన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చికిత్సకు తగిన ఆర్థిక సాయం అందిస్తోందని పేర్కొన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ రాష్ట్రవ్యాప్తంగా ఎందరో నిరుపేదల ప్రాణాలకు అండగా ఉంటుందని అన్నారు.


## అంగన్వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన



**విశ్వంభర, హనుమకొండ:** హనుమకొండ జిల్లా హాసన్ పర్తి మండల పరిధిలోని సుధాన్ పల్లి గ్రామంలో ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల సందర్భంగా పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి ఇందిరా మహిళా శక్తి ఉపాధి భరోసా ద్వారా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద సుమారు 12లక్షల రూపాయల నిధులు అంగన్వాడి భవన నిర్మాణానికి శంకుస్థాపన, గ్రామంలో 5 లక్షల రూపాయల నిధులతో సీసీ రోడ్డుకు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు శంకుస్థాపన చేశారు. అనంతరం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. అనంతరం అంగన్వాడి పిల్లలకు పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు వివిధ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## కనీస వేతనాలను అమలు చేయాల్సిందే

**ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎంగలి ప్రసాద్**



**విశ్వంభర, ఆమనగల్లు:** తెలంగాణ ప్రభుత్వ కనీస వేతనాల సలహా సంఘ ఛైర్మన్, ఐఎన్టీయూసీ సెక్రటరీ జనక్ ప్రసాద్ ని గాంధీభవన్లో ఆమనగల్లు పట్టణానికి చెందిన ఐఎన్టీయూసీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఎంగలి ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా పట్టణంలోని సూర్యలక్ష్మి కాటన్ మిల్ కార్మికుల కనీస వేతనాల సమస్యలను పరిష్కరించవలసిందిగా కోరారు. ఈ సందర్భంగా ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు.

## తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం తేవాలి



**విశ్వంభర, ఆమనగల్లు:** టీడీపీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు పార్టీ శ్రేణులంత సమాయత్తం కావాలని టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి, కల్వకుర్తి నియోజకవర్గ ఇంచార్జి అందేకార్ యాదిలాల్ అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని టీడీపీ కార్యాలయం వద్ద మంగళవారం టీడీపీ నాగర్ కర్నూల్ పార్లమెంట్ కోశాదికారి అర్థం నర్సింహ్మ, రాష్ట్ర వాణిజ్య సెల్ కార్యదర్శి కండె సత్యనారాయణ లతో కలిసి సభ్యత్వ నమోదును యాదిలాల్ ప్రారంభించారు. సభ్యత్వ నమోదులో దేశంలో ప్రాంతీయ పార్టీలకు టీడీపీ ఆదర్శంగా నిలుస్తుందన్నారు. టీడీపీ ఆవిర్భావంతో తెలుగు జాతికి ప్రపంచ వ్యాప్తంగా ఎన్టీఆర్ ఒక గుర్తింపు తీసుకువచ్చారని చెప్పారు. కార్యకర్తల సంక్షేమానికి కృషి చేస్తున్న ఏకైక పార్టీ టీడీపీ అనిఅన్నారు. గతంలో రూ. 2 లక్షలు ఉన్న ప్రమాద భీమాను రూ. 5 లక్షలకు పెంచడం జరిగిందన్నారు. సభ్యత్వం తీసుకున్న వారికి డిజిటల్ కార్డు అందజేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా మండల నాయకులు ఎన్.టి పంచాక్షరీ ఖాదర్, గాజుల పద్మనాభం, సురమల్ల సత్తయ్య, వెంకటేశ్, శీలం వెంకటయ్య, వజ్రలింగం, సింహ్మాయ్య, కాలే, శివ, జంగయ్యగౌడ్, పూనం వెంకటేశ్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ దీక్షా దివస్ ప్రజల బ్రహ్మాస్త్రం

- ప్రాణాలకు తెగించి తెలంగాణ సాధించిన నేత కేసీఆర్
- ఆయన పదేళ్ళ పాలన ఒక స్వర్ణ యుగం
- సీఎం రేవంత్ ది బూతులనోరు.. అబద్దాల కోరు
- దేవుళ్లపై ప్రమాణాలు చేసి మాట తప్పిండు
- పోవాలి కాంగ్రెస్...మళ్లీ రావాలి కేసీఆర్
- దీక్షాదివస్ సన్నాహక సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్ రెడ్డి




**విశ్వంభర, నిజామాబాద్:** నాడు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చేపట్టిన కేసీఆర్ దీక్షా దివస్ చారిత్రక ఘట్టం, ప్రజల చేతిలో తిరుగులేని బ్రహ్మాస్త్రమని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి అన్నారు. ఈనెల 29 తేదీన చేపట్టనున్న దీక్షా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో భాగంగా నిజామాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ముఖ్య నాయకుల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రాణాలకు తెగించి తెలంగాణ సాధించిన నేత కేసీఆర్ అని అభివర్ణించారు. నాడు తెలంగాణ ద్రోహులను తరిమికొట్టింది ఈ బ్రహ్మాస్త్రమే. నేడు మళ్లీ చిట్టినాయుడి ముసుగులో ఉన్న ద్రోహులను తరిమికొట్టేది ఈ బ్రహ్మాస్త్రమే అని ఆయన అన్నారు. నాడు తెలంగాణ సాధనలో కేసీఆర్ దీక్షా దివస్ చెరగని సంతకమయితే. నేడు అనుముల రేవంత్ రెడ్డిది అంతులేని అవినీతి సంతకమన్నారు. ఆరు దశాబ్దాల తెలంగాణ ప్రజల ఆకాంక్షను భుజానికెత్తుకొని ఏప్రిల్ 27, 2001 నాడు గులాబీ జెండాను ఎగరవేసిన కేసీఆర్ స్వరాష్ట్ర సాధనకు కర్మ, కర్త, క్రియ అని ఆయన అభివర్ణించారు. కేసీఆర్ చచ్చుడో.. తెలంగాణ వచ్చుడో అనే నినాదంతో నవంబర్ 29, 2009న కేసీఆర్ చేపట్టిన నిరాహార దీక్ష తెలంగాణ ఉద్యమాన్ని మలుపు తిప్పిందన్నారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దేశ రాజకీయ వ్యవస్థను, 36 పార్టీలను ఒప్పించి, మెప్పించిన గొప్పతనం కేసీఆర్ దన్నారు. అప్పుడున్న సమైక్య రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో ప్రతి వర్గం, ప్రతి మనిషి బతుకు చితికి పోయిందన్నారు. మళ్లీ ఈ రోజు అవే పరిస్థితులు కనిపిస్తున్నాయని జీవన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. అవే నిర్బంధాలు, అవే అణచివేతలు, అవే దుర్భర పరిస్థితుల నేపథ్యం కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కనిపిస్తు న్నాయన్నారు. ఆనాడు ఢిల్లీ మెడలు వంచి తెలంగాణ సాధించిన కేసీఆర్ దీక్షా దివస్ స్ఫూర్తితో నేడు మళ్లీ రెండు జాతీయ పార్టీల మెడలు వంచాల్సిన పరిస్థితి తెలంగాణ ప్రజలపై ఉన్నదన్నారు. ప్రాణాలకు తెగించి తెలంగాణ సాధించిన నేత కేసీఆర్ పదేళ్ళ పాలన ఒక స్వర్ణ యుగం. ఇప్పుడు కాంగ్రెస్ పాలన మరో రాతియుగం అని ఆయన మండిపడ్డారు. సీఎం రేవంత్ ది బూతులనోరు. ఆయనొక అబద్దాల కోరు అని ఎద్దేవా చేశారు.కాంగ్రెస్ కు అధికారం ఇస్తే తెలంగాణకు మళ్లీ అదే అంధకారం వచ్చింది. చిట్టినాయుడి చిల్లర పాలనలో సంపన్న వర్గాల నుంచి అట్టడుగు వర్గాల వరకు అందరూ బాధపడుతున్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో పాడి పంటలతో పచ్చబారిన తెలంగాణ గడ్డ నేడు కాంగ్రెస్ ఏడాది పాలనలో మళ్లీ ఎండిపోయింది. కేసీఆర్ ఇచ్చిన 24 గంటల కరెంటుతో వెలుగుజిలుగుల తెలంగాణ కనిపిస్తే కాంగ్రెస్ వచ్చాక మళ్లీ చీకటి తెలంగాణ కనిపిస్తోంది. కేసీఆర్ సంపద పెంచి పేదలకు పంచిండు. ప్రతీ ఇంట్లో సంక్షేమం, ప్రతీ కంట్లో సంతోషం వెల్లివిరిసింది. రైతు బంధు కాంగ్రెస్ రాబందుల పాలయింది. కాంగ్రెస్ రెండు లక్షల రుణమాఫీ అని చెప్పి రైతులకు టోపీ పెట్టింది. పెన్షన్లు పెరుగుడు దేవుడెరుగు ఉన్న పెన్షన్లకే మంగళం పాడిండు. పెన్షన్లు ఇవ్వకుండా అవ్వాతాతల, అక్కాచెల్లెళ్ల, విధివంచితుల కడుపు కొట్టిన ఘనుడు రేవంత్ రెడ్డి. కాంగ్రెస్ నికృష్ట పాలనతో ఏడాదిలోనే అన్నివర్గాల ప్రజల్లో తీవ్ర అసహనం కనిపిస్తోంది. సొంత నియోజకవర్గం కొడంగల్ లోనే రేవంత్ రెడ్డి పై ప్రజలు తిరగబడుతుండ్రు. కాంగ్రెస్ కాలకేయుల చేతిలో ప్రజలు దగా పడ్డరు. రేవంత్ రెడ్డి కి దమ్ముంటే ప్రజలకు సమాధానమివ్వాలన్నారు. కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. పోవాలి కాంగ్రెస్.. మళ్లీ రావాలి కేసీఆర్ అంటూ దీక్షదివస్ స్ఫూర్తితో పోరాడుదాం. కాంగ్రెస్ సర్కార్ ను తరిమికొడదాం అని జీవన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దీక్షా దీవాస్ జిల్లా ఇంఛార్జ్ ఫారుక్ హుస్సేన్, మాజీ మంత్రి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బిగాల గణేష్ గుప్తా, బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్సీ వి.జి గౌడ్, మాజీ జడ్పి ఛైర్మన్ విఠల్ రావు, సీనియర్ నాయకులు రాజారాం యాదవ్, రాంకిషన్ రావు, బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలి

- ఆదానికి 100 కోట్లు తిరిగి ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నాం
- ఒప్పందాలలో అవినీతి జరిగితే వెంటనే బయటపెట్టాలి
- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు.




విశ్వంభర, ఎల్బీనగర్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చాలా తప్పులు చేస్తుందని వారు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయడం లేదని పేద వాళ్లకు న్యాయం చేయవలసిన అవసరం ఉందని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం భారత కమ్యూనిస్టు పార్టీ ఎల్బీనగర్ నియోజకవర్గం జనరల్ బాడీ సమావేశం కొత్తపేట లోని బాబు జగ్జీవన్ రావ్ భవన్ లో సీపీఐ పార్టీ ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆదాని ఇచ్చిన రూ .100 కోట్లు తిరిగి ఇస్తామనడాని స్వాగతిస్తున్నామని అదేవిధంగా ఆదాని చేసుకున్న ఒప్పందలలో ఏమైనా అవినీతి జరిగిందా అనే కోణాన్ని కూడా ఈ ప్రభుత్వం బయట పెట్టాలని సాంబశివరావు డిమాండ్ చేశారు. జగన్మోహన్ రెడ్డికి లంచం ఇచ్చినట్టు అమెరికాలో తేలిందని ఇక్కడ ఎవరికైనా ఇచ్చారా అనే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. హర్యానా ఓటమికి కాంగ్రెస్ ప్రభుత్వం కారణమని వారి స్వయం కృపరాధం, స్వీయ అహంకారం తోనే ఓడిపోయిందని అదే ప్రభావ మహారాష్ట్ర ఎన్నికల్లో పడిందని అన్నారు. ఆదానిపై అనేక అవినీతి ఆరోపణలు వస్తున్న కూడా కేంద్ర ప్రభుత్వం ఎలాంటి విచారణ చేయకపోవడం వెనుక కారణం ఏమిటని ప్రశ్నించారు. దొంగలకు తోడ్పాటు ఇచ్చే విధంగా మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి, ప్రధాని నరేంద్ర మోడీ వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అవినీతి తో సంపాదించిన డబ్బుతో ఎన్నికల్లో పాల్గొని ఆ డబ్బులను జనాలకు ఇచ్చి ఎన్నికల్లో గెలుస్తున్నారని విమర్శించారు. మతం పేరుతో,సెంటిమెంట్ పేరుతో, కులం పేరుతో చేసే రాజకీయాలు తాత్కాలికమని మహారాష్ట్ర లాంటి పలితాలు మళ్ళీ పునరావతం కావని సాంబశివరావు అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రాచారి, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి జంగయ్య, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ, ముత్యాల యాదిరెడ్డి, పర్వతాలు, ఫమీద, బాతరాజు నరసింహ, శ్రీదేవి, రామ్ నారాయణ, కృష్ణ , రాములు గౌడ్, శ్రీ వర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాంగార్ యూనియన్ లో చేరికలు



**విశ్వంభర, హైదరాబాదు:** ఫతేనగర్ డివిజన్ నం. 6, సెక్షన్ కార్మికులు, యూనియన్ నాయకుడు శివరాంప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం కాంగార్ యూనియన్ అధ్యక్షులు మొగుళ్ళ రాజి రెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ బి. భూమయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.రామరాజు, ప్రధాన కార్యదర్శి సి.హెచ్. సురేష్ బాబు నాయకత్వాన్ని బలపరుస్తూ కాంగార్ యూనియన్ లో చేరారు. కాంగార్ యూనియన్ కృషితో పెండింగ్లో ఉన్న నలుగురు ఉద్యోగుల ఎన్.ఎమ్.ఆర్ వేతన బకాయిలు దాదాపు రు. 75 లక్షలు విడుదల అయ్యాయి. అబ్ధిపొందిన ఉద్యోగులు అధ్యక్షులు మొగుళ్ళ రాజి రెడ్డికి కృతజ్ఞతలు తెలియచేస్తూ సన్మానించారు. కాంగార్ అధ్యక్షులు కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ జలమండలి ఉద్యోగుల ప్రధాన సమస్య అయిన ఉచిత ప్రభుత్వ హెల్త్ కార్డు ఇప్పించుటకు బోర్డు మేనేజింగ్ డైరెక్టర్ తో చర్చించి ప్రభుత్వానికి లెటర్ పంపించడం జరిగింది. గతంలో అధికారంలో ఉన్న యూనియన్ అధ్యక్షులుగా ఉన్న నాయకులు సి. సతీష్ కుమార్, జి. రాంబాబు యాదవ్ విఫలమైన డిమాండ్, ప్రమోషన్ చానల్ లేనటువంటి (క్యూ.ఏ.టీ) జె.టీ.ఓ. అప్గ్రేడేషన్ ఏ.టీ.ఓ ప్రమోషన్లు ఇప్పించుటకు బోర్డు మేనేజింగ్ డైరెక్టర్ ప్రభుత్వానికి ప్రపోజల్ పంపించడం జరిగినది, త్వరలో ప్రభుత్వత్వంతో సంప్రదించి త్వరలో ఉత్తర్వులు ఇప్పించడం జరుగుతున్నదని అధ్యక్షులు వారు జలమండలి ఉద్యోగులకు హామీ ఇవ్వడం జరిగినది.

## ట్రైబల్ వెల్ఫేర్ మినీ గురుకులాన్ని తనిఖీ చేసిన మండల ఉన్నత అధికారులు



**విశ్వంభర, త్రిపురారం:** ట్రైబల్ వెల్ఫేర్ మిని గురుకులంను త్రిపురారం ఎంఈఓ రవి, ఎంపీడీవో విజయలక్ష్మి మంగళవారం తనకి నిమిత్తమై సందర్శించారు. వారు కిచెన్ వంటసామాగ్రి, టాయిలెట్స్ ను పరిసరాలను క్షుణంగా పరిశీలించారు. విద్యార్థినుల కొరకు వండిన వంటలను వారు రుచి చూసారు. శుభ్రమైన, నాణ్యమైన భోజనం విద్యార్థినులకు అందిస్తునందుకు హర్షం వ్యక్తంచేసారు. పాఠశాలకు అవసరమైన మౌళిక సదుపాయాలు ఏమైన ఉంటే వారి వంతు సహాయం చేస్తామని చెప్పారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా, డాక్టర్ బి ఆర్ అంబేడ్కర్ కి నివాళి అర్పించారు. సిబ్బందితో మీటింగును ఏర్పాటు చేసి వారితో తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి చర్చించారు. ఇట్టి కార్యక్రమానికి అధికారులతో హెచ్ఎం భారతి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## దీక్షా దివస్ సన్నాహక సమావేశం

### పాల్గొన్న సబితా ఇంద్రారెడ్డి, మహమూద్ అలీ




**విశ్వంభర, మహేశ్వరం:** భారత రాష్ట్ర సమితి రంగారెడ్డి జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం శంషాబాద్ జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. పరిశీలకులు మాజీ హోం మంత్రి మహమూద్ అలీ, మాజీ విద్యాశాఖ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మాజీ శాసనసభ్యులు జైపాల్ యాదవ్, అంజయ్య యాదవ్, యువ నాయకులు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మెన్ సత్తు వెంకటరమణారెడ్డి, జిల్లా రైతుబంధు మాజీ అధ్యక్షులు వంగేటి లక్ష్మారెడ్డి, మైనారిటీ అధ్యక్షుడు మహ్మద్ ముఖీం, దీపామల్లేష్, చిలకమర్రి నర్సిహ్మ, దేశమోళ్ల ఆంజనేయులు సాయిబాబా, పెద్దసంఖ్యలో అన్ని నియోజకవర్గాల నాయకులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించిన డీఎంహెచ్ఓ



**విశ్వంభర, వరంగల్:** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు వరంగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఖానాపూర్, చెన్నారావుపేట లలో పర్యటించి ఉద్యోగులకు ప్రజలకు అందించవలసిన సేవలు, సమయపాలన గురించి వివరించారు. సాధారణంగా చలికాలంలో చిన్నపిల్లలు, వృద్ధులు అనారోగ్య సమస్యలు ముక్కు కారడం, అస్తమ, శ్వాస కోస వ్యాధులు, హార్ట్ ఎటాక్స్ , చర్మ సంబంధిత వ్యాధులు మొదలగునవి అవకాశం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని చిన్న పిల్లలకు, వృద్ధులకు షెటర్స్, గ్లౌజెస్ , దుప్పట్లు నిండుగా కప్పుకొని చలికి గురి కాకుండా ఉండాలని కోరినారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని మాతా శిశు సంరక్షణ, ప్రభుత్వ హాస్పిటల్ లో డెలివరీలు, వ్యాధి నిరోధక టీకాలు, అందించాలని కోరినారు. సంక్రమిత వ్యాధులు, అసంక్రమిత వ్యాధులు నిర్ధారణ పరీక్షలు చేయించి తగు చికిత్సలు అందించాలని కోరినారు. ప్రజలు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సూచనలు పాటిస్తూ ఆరోగ్యంగా ఉండడానికి ప్రయత్నం చేయాలని తెలిపినారు. ఏమైనా ఆరోగ్య సమస్యలు వచ్చినట్లయితే వెంటనే సిబ్బంది ద్వారా తగు చికిత్సలు తీసుకోవాలని కోరినారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ప్రజల ఆరోగ్య అవసరాలకు నిర్మించారు కాబట్టి సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు డాక్టర్ అరుణ్ చంద్ర, డాక్టర్ అరుణ్ కుమార్, డాక్టర్ జ్యోతి, డాక్టర్ సరోజ ,పల్లె దావకాన డాక్టర్లు ,డిప్యూటీ డెమో అనిల్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోటుపుస్తకాలు, దుస్తుల పంపిణీ

**విశ్వంభర, సైదాబాద్:** జీపీఎస్, జీహెచ్ఎస్ శంకేశ్వర్ బజార్ విద్యార్థులకు సగౌరా చారిటబుల్ సొసైటీ వారు నోటుపుస్తకాలు, దుస్తుల పంపిణీ చేశారు. సగౌరా సొసైటీ ప్రెసిడెంట్ సత్యనారాయణ మాట్లాడుతూ పిల్లలందరూ చక్కగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరాలని కోరారు. సొసైటీ సభ్యులు పాపయ్య మాట్లాడుతూ పిల్లలకు సొసైటీ యొక్క సహకారం ఎల్లవేళలా ఉంటుందని తెలియజేశారు. సొసైటీ మాజీ జనరల్ సెక్రటరీ సూర్య ప్రకాష్ మాట్లాడుతూ సొసైటీ పిల్లలకు చాలా సంవత్సరాలుగా చాలా పాఠశాలలకు అన్ని రకాలుగా చేయూతనిస్తుందని తెలియజేశారు. పాఠశాల ఉపాధ్యాయుడు సాంబశివరావు, హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయురాలు సుకన్య , ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేణుక, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇచ్చిన హామీలు ఏమయ్యాయి?

### గ్రంథాలయ మాజీ ఛైర్మన్ కప్పాటి పాండు రంగారెడ్డి



**విశ్వంభర, మహేశ్వరం:** కందుకూరు మండల కేంద్రములో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్, మీడియా కో ఆర్డినేటర్ కప్పాటి పాండురంగా రెడ్డి, కందుకూరు మండల సీనియర్ నాయకులు సభావత్ గణేష్ నాయక్, ప్రశాంత్ కుమార్, శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు, అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన అనేక హామీలు అమలు చేయక తెలంగాణ ప్రజలను దగా చేసిన బీఆర్ఎస్ నాయకులా ప్రజా ప్రభుత్వాన్ని నిందించేది. బంగారు తెలంగాణ అంటూ ఏడు లక్షల కోట్ల అప్పుల తెలంగాణగా మార్చింది మీరు కాదా, తెలంగాణకు తొలి దళిత ముఖ్యమంత్రిని చేశారా, మూడు ఎకురాల భూమి పంచారా, రైతులకు ఉచిత ఎరువులు ఇచ్చారా,కేజి టు పీజీ ఏమైంది. ఇండ్లు లేని ప్రతి పేదవాడికి డబుల్ బెడ్ రూమ్ అంటూ,ఇంటికో ఉద్యోగం అంటూ ఆశపెడితిరిగా పది సంవత్సరాలు అయినా అతీ గతీ లేకపాయే, మూసి మురికి వదిలిందా? హుస్సేన్ సాగర్ ప్రక్షాళన జరిగిందా. పార్మ సిటి ఏర్పాటు అంటూ పది సంవత్సరాలు ఏమి చేశారని పదకొండు నెలలకే పార్మసిటా, పోర్త్ సిటా అంటూ ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల ముందు ఓటర్లును మభ్యపెట్టటానికి స్పెషల్ డెవలప్మెంట్ అంటూ నిధులు లేని ప్రొసిడింగ్ లు ఇచ్చి శిలా పలకాలు వేసి నియోజకవర్గ ప్రజలను దగా చేసిందే కాకా కాంగ్రెస్ ప్రభుత్వం పై నిందలు మోపడమా గ్రామాలు మున్సిపాలిటీగా మారితే పన్నుల భారం పెరుగుతుంది అభివృద్ధి కుంటుపడుతుంది అంటున్న సబితా ఇంద్రారెడ్డి మరి మహేశ్వరం నియోజకవర్గంలో మీర్పేట్,బడంగ్ పేట్ లు కార్పొరేషన్లు గాను,జల్ పల్లి, తుక్కుగూడ మున్సిపాలిటీలు గా మారింది బీఆర్ఎస్ ప్రభుత్వం లో కాదా అప్పుడు ప్రజలకు పన్నుభారం పడలేదా? బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం లో ఉన్నప్పుడు గ్రామ పంచాయతీలకు నిధులు ఇవ్వక సర్పంచ్ లు అనేక సార్లు ఆందోళనలు చేసింది నిజాం కాదా, ఆత్మహత్యలు చేసుకుంది నిజం కాదా హైదరాబాద్ నగరానికి చేరవలో వున్న అభివృద్ధికి ఆమడధూరం లో వున్న మహేశ్వరం నియోజకవర్గానికి ప్రపంచ స్థాయి పట్టణాలకు దీటుగా పోటీపడేలా నిర్మాణం చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకుంటే అభివృద్ధి చెందడాన్ని జీర్ణించుకోలేని బీఆర్ఎస్ నాయకులు అనవసర ఆరోపణలు చెస్తున్నారని వారు అన్నారు.

## నూతన సీఎస్ఆర్ పోస్టర్ విడుదల

### పాల్గొన్న శాసనసభ్యులు కె.పి వివేకానంద




**విశ్వంభర, హైదరాబాద్:** 75వ రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని మన రాజ్యాంగం లోని ప్రతికరణ 51 ఎ ప్రకారం ప్రాథమిక విధులను దృష్టిలో పెట్టుకొని నూతన సీఎస్ఆర్ పోస్టర్ ను కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె. పి. వివేకానంద విడుదల చేసారు. నూతన సీఎస్ఆర్ విధానం వల్ల ప్రతి పౌరుడు తన విధులను తను నిర్వర్తిస్తే ఎంతో బాధ్యతయుతమైన సమాజం మనం నిర్మించుకోవచ్చు. నా హక్కు కాపాడడం నీ బాధ్యత, నీ హక్కును కాపాడడం నా బాధ్యత, ఈ నూతన పౌర సామజిక బాధ్యత సీఎస్ఆర్ ను క్షేత్ర స్థాయిలో, ప్రతి ఒక్కరు పాటించేలా కృషి చేయాలి అన్నారు. సామజిక వేత్త మధుబాబు చికిలే బాల్య దశ నుండే బాలల్లో పౌర స్పృహ తో మనం పెంచాలి. ఇవి ఖర్చు లేకుండా మనం చేయతగ్గ పనులు. చెత్తను చెత్త బుట్టలో వేయడం, తడి చెత్త, పొడి చెత్త వేరు చేయడం,మొక్కలు నాటడం, వివిధ అవగాహన కార్యక్రమాలు చేయడం,కుళాయిని అవసరం మేరకు వాడడం, లైట్స్ మనం ఇంటిలో లేనప్పుడు ఆపి వేయడం, అవసర సమయాన ప్రథమ చికిత్స చేయడం, బాధ్యతయుత మైన డ్రైవింగ్ ఇలాంటివి. ఇవి చాలా చిన్నవి కానీ పెద్ద మార్పుకు నాంది. సహజ వనరులను మనం కాపాడుకుంటూ, బాధ్యతయుతమైన మానవ వనరులను నిర్మించుకున్న వారము అవుతాము. సమాజ అభివృద్ధి మానవ అభివృద్ధి, మానవ సంక్షేమమే సమాజ సంక్షేమం అని అన్నారు. కార్యక్రమం లో హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ అధ్యక్షులు తూటే విజయ్ కుమార్, కాట్రెడ్డి రమణ రెడ్డి, మాజీద్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



**శ్రీ ఆలూర్ మల్లయ్య (కండే రాయుడు) కళ్యాణం మరియు జాతర కు రావాలని ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి కి ఆలూర్ గ్రామ వీడీసీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆహ్వాన పత్రిక ను అందించారు.**
**- విశ్వంభర, నిజామాబాద్**

## ఘనంగా గురుశిష్య నృత్య పరంపర -2024



**విశ్వంభర, బషీర్ బాగ్:** సిరాజ్ డాన్స్, ఆర్ట్స్ అకాడమి శ్రీవేద ది యూనివర్స్ స్కూల్, శ్రేష్ఠ మల్టీ స్పెషలిటీ హాస్పిటల్ వారి సహకారంతో గురు శిష్య నృత్య పరంపర కార్యక్రమం శ్రీ సత్య సాయి నిగమాగమం హైద్రాబాద్ వేదికగా ఘనంగా జరిగింది. గురువు శిష్యులు కలిసి నృత్యం చేయడం చూపరులను అబ్బురపరిచింది. వివిధ జిల్లాల నుండి గురు శిష్యులు 450 మంది విచ్చేశారు. గురువులకు నేషనల్ కళారత్న అవార్డు, శిష్యులకు నాట్య ప్రతిభ అవార్డులతో సత్కరించారు.కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ప్రముఖ కూచిపూడి నాట్య గురువు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత డా. వేదాంతం రాధేశ్యామ్, డా.శ్రీనివాస్ రెడ్డి కోమాండ్ల, డా.అరవింద్ సాగర్, డా. స్పందన నలగండ్ల, శివ కుమార్ రెడ్డి, సరస్వతి ఉపసకులు దైవజ్ఞ శర్మల చేతుల మీదుగా నేషనల్ భారత్ సేవ, నేషనల్ కళారత్న అవార్డులు అందజేశారు. డా. అరవింద్ సాగర్, డా. స్పందన నలగండ్ల వారి సేవలకు గాను జాతీయ సేవ స్వర్ణ నంది, నేషనల్ భారత్ సేవ పురస్కారాలతో సన్మానించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతు భారతీయ సాంప్రదాయం ఉట్టిపడేలా సిరాజ్ డాన్స్, ఆర్ట్స్ అకాడమి ఫౌండర్ ప్రెసిడెంట్ డా. సిరాజుద్దీన్ (సిరాజ్ మాస్టర్) అద్భుతంగా కార్యక్రమం నిర్వహించారాని అభినందించారు. భవిష్యత్తులో తమ సపోర్ట్ తనకి ఉంటుందని అన్నారు. రామాయణం, భక్త ప్రహలదా, శ్రీనివాస కళ్యాణం, ఆర్మీ డాన్స్, ఓరిస్సా ఫోక్, వెంకటేశ్వర కళ్యాణం, కృష్ణ తీమ్ డాన్స్, పంచ భూతాలు, శివాష్టకం, జానపదం నృత్య రూపాలు ఒకరికి మించి ఒకరు చేయడం కన్నుల విందుగా అనిపించింది. కార్యక్రమం విజయవంతం చేసిన గురువులకు, చిన్నారులకు, తల్లి తండ్రులకు సిరాజ్ మాస్టర్ ధన్యవాదలు తెలిపారు.

## సాయిబాబాపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని తిప్పికొడదాం

### శ్రీ షిరిడి సాయి భక్త ఐక్యవేదిక అధ్యక్షులు ధనుంజయ



విశ్వంభర, నాగోల్: షిరిడి సాయి భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా జరుగుతున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టి, బాబా పై నమ్మకాన్ని బలం చేకూర్చే విధంగా అన్ని సాయి ఆలయాలను కలుపుకొని ముందుకు వెళ్లనున్నట్లు శ్రీ షిరిడి సాయి భక్త ఐక్యవేదిక అధ్యక్ష , కార్యదర్శి, కోశాధికారి ధనుంజయ, పీ. వి. సాయి, గుండా మల్లయ్య గుప్తాలు అన్నారు. మంగళవారం నాగోల్ లోని దేవకీ కన్వెన్షన్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల ద్వారా బాబా పై జరుగుతున్న విష ప్రచారాన్ని సమర్థవంతంగా శాస్త్రీయ బద్దంగా ఎదుర్కొనేందుకు ఐక్యవేదిక కృషి చేస్తుందన్నారు. ఇందుకోసం ప్రభుత్వాల సహకారం కూడా తీసుకునే విధంగా ప్రణాళికల రూపొందిస్తున్నామన్నారు. అవసరమైతే చట్టపరంగా కూడా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. బుధవారం దేవకి కన్వెన్షన్ హాల్లో కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా షిరిడి సంస్థాన్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గోక్ష గాడిల్ కార్, విశ్రాంత జడ్జి చంద్రకుమార్, సాయి తత్వ ప్రచారకులు ప్రసాద్, సాయి శ్రీనివాస్ లు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు శ్రావణ్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, హనుమంతు, వెంకట్రాంరెడ్డి, ఈశ్వరమ్మ యాదవ్, రవీంద్రబాబు, సాయిబాబా, ప్రసాదరావు, హరి ప్రసాద్ రావు, మైనంపాటి ప్రసాద్, అనిల్, సాయి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎంలపై ప్రజాహిత వ్యాజ్యాన్ని కొట్టివేసిన సుప్రీం



**విశ్వంభర, మహబూబాబాద్:** ఈవీఎంలపై ప్రజా శాంతి పార్టీ అధ్యక్షుడు కె. ఏ.పాల్ దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు ధర్మాసనం కొట్టి వేసింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ పి.బి. వరాల్ లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్ను పరిశీలించి, ఈవీఎంల ట్యాంపరింగ్కు సంబంధించిన వాదనలను తిరస్కరించింది. ఎన్నికల్లో ఓడిపోయినప్పుడు మాత్రమే ఈవీఎంల విశ్వసనీయతను ప్రశ్నించడం తగదని స్పష్టం చేసింది. ఎన్నికల్లో గెలిచినప్పుడు ఈవీఎంల ట్యాంపరింగ్ గురించి ఎవరూ అనుమానం వ్యక్తం చేయరు. కానీ ఓటమి జరిగినప్పుడు మాత్రమే ట్యాంపరింగ్ జరిగిందని అనడం సరైన దృష్టికోణం కాదు. అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ తీర్పు ఈవీఎంల విశ్వసనీయతకు మద్దతుగా, ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా జరగుతుందనడానికి రుజువుగా నిలుస్తుందని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ తెలిపారు. ఓటర్లందరూ ఎన్నికల ప్రక్రియ, భారత ఎన్నికల సంఘం పై నమ్మకం కలిగి, ప్రజాస్వామ్య ప్రాతిపదికగా నిర్వహించే ఎన్నికల్లో చురుకుగా పాల్గొనాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కోరారు.

## రాజ్యాంగ దినోత్సవాన్ని జాతీయ పండుగగా గుర్తించాలి

### జెరూసలెం మత్తయ్య



**విశ్వంభర, బషీర్ బాగ్:** రాజ్యాంగ దినోత్సవంను జాతీయ పండుగగా గుర్తించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఘనంగా నిర్వహించాలని క్రైస్తవ ధర్మ ప్రచార పరిరక్షణ సమితి అధ్యక్షులు జెరుషలేము మత్తయ్య అన్నారు. భారతదేశ జాతీయ పండుగ సందర్భంగా మంగవారం ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద రాజ్యాంగ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా జెరుషలేం మత్తయ్య మాట్లాడుతూ భారతీయ మత పండుగలు, వ్యక్తుల జయంతి, వర్ధంతిలకు సెలవు దినాలుగా ప్రకటించే ప్రభుత్వాలు మన సార్వభౌమ, సెక్యులర్ రాజ్యాంగం అమల్లోకి వచ్చిన నవంబర్ 26 ను విస్మరించడం సరికాదన్నారు. తాజాగా పార్లమెంట్లో సైతం రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న సందర్భంగా అదేవిధంగా అన్ని రాష్ట్ర అసెంబ్లీ, శాసనమండలతో పాటు ప్రజాస్వామ్యుతంగా ఏర్పడిన అన్ని పాలక మండల్లో కూడా ఈ రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించి రాజ్యాంగ దినోత్సవ వేడుకలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. కనీసం రాజ్యాంగం దినోత్సవం రోజునైనా ప్రభుత్వం ప్రజలకు రాజ్యాంగం విలువలను బోధించే విధంగా చర్యలు తీసుకోవాలని పలు సంఘాల నాయకులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి దయానంద రావు, పోకల కిరణ్, పివి యోహాన్, ఇజ్రాయిల్ పోచయ్య, చింతల ఏసన్న పాల్గొన్నారు.

## కుటుంబ సర్వేలో నమోదు చేసుకోని వారికి మరో అవకాశం

**విశ్వంభర, రామన్నపేట:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని అన్ని గ్రామాలలో ఈనెల 9 నుండి సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ మరియు కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) నిర్వహించనైనది. ఈ సర్వే సుమారుగా 96 శాతం పూర్తి కాబడినది. ఇందులో భాగంగా మండలంలోని గ్రామ పంచాయతీలలో లేదా ఆవాస ప్రాంతాల్లో సర్వే నిర్వహణకు సంబంధించి ఎవరైనా అందుబాటులో లేకపోవడం లేదా వారి ఇంటికి తాళం వేసి ఉన్న సందర్భంలో గానీ, ఈ సర్వేలో నమోదు కానట్లయితే, సంబంధికులు సర్వేలో నమోదు కొరకు ఎక్కడైనా మిగిలిన కుటుంబాలు వుంటే దయచేసి వారి సంబంధిత గ్రామపంచాయతీ కార్యదర్శి, గ్రామపంచాయతి యందు సంప్రదించి లేదా సంబంధిత పంచాయతీ కార్యదర్శికి తెలియజేసి వారి కుటుంబాన్ని ఈ సర్వేలో నమోదు చేయించుకోవాల్సిందిగా మరియు ఈ విషయాన్ని చాటింపుల ద్వారా గ్రామపంచాయతీల ప్రజలకు తెలియజేయాల్సిందిగా ఎంపీడీవో బి.యాకుబ్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు.

# ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



ఉస్మానియా యూనివర్సిటీ న్యాయ కళాశాల ఆవరణంలో



భూపాలపల్లి జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కే. జయరాం రెడ్డి ఆధ్వర్యంలో



రామన్నపేట మండలంలోని కక్కిరేణి గ్రామంలో..



ఆత్మకూరు(ఎం)మండలంలోని మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో



రామన్నపేట జూనియర్ సివిల్ జడ్జ్ ఎస్.శిరీష ఆధ్వర్యంలో

**విశ్వంభర, పెద్ద శంకరంపేట/ బషీర్ బాగ్/ ఉస్మానియా యూనివర్సిటీ/ భూపాలపల్లి / రామన్నపేట/ ఆత్మకూరు(ఎం)/ తలకొండపల్లి/ తెలకపల్లి :** మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ కార్యలయాల్లో, పాఠశాలల్లో, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో, పార్టీ కార్యలయాల్లో ఘనంగా భారత రాజ్యాంగం దినోత్సవం నిర్వహించారు. బాల్యం నుంచి రాజ్యాంగ పాటలు విద్యార్థులకు బోధించాలని అత్యంత పారదర్శకంగా ప్రభుత్వ ఫలాలు ప్రజలకు అందించే విధంగా అధికారులు విశేష కృషి చేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో ఘనంగా భారత రాజ్యాంగం దినోత్సవం నిర్వహించారు. ప్రజలు దేశ ఫలాలను పూర్తిస్థాయిలో పొందాలంటే బాల్యం నుంచే రాజ్యాంగ పాఠాలు బోధించాలన్నారు. అనంతరం అధికారులు సిబ్బందితో కలిసి భారత రాజ్యాంగ దినోత్సవం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో యూనస్, సంబంధిత వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగంగా గుర్తింపు పొందినది మన భారత రాజ్యాంగమని ప్రముఖ న్యాయశాస్త్ర ప్రొఫెసర్, తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్ట రెడ్డి అన్నారు. తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో జాతీయ రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ప్రతి ఇంట్లో ధర్మ గ్రంథం తో పాటు భారత రాజ్యాంగం ఉండాల్సిన అవసరం ఉందని, ప్రతి పౌరుడు రాజ్యాంగం పట్ల అవగాహన కలిగి ఉండాలని, గ్రామీణ ప్రాంతాల్లో చట్టం కల్పించిన హక్కులను తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ హైకోర్టు న్యాయవాదులు స్వదేశ్, అయోధ్య సాయి చక్రవర్తి, వి. చెత్రు నాయక్, దర్గ గూటి, డి.రాజిరెడ్డి, ఖానాపురం అమూల్య, మృతజవా అహ్మద్ అమీర్ లకు జ్యూరిస్ట్ అవార్డు 2024 ను ముఖ్య అతిథులు బహుకరించారు. సేవా రత్న పురస్కార గ్రహీతలు ఎల్ సి గోపయ్య, ఎస్ దీపక్ రాజ్, జి వీరమ్మ, కెప్టెన్ డాక్టర్ మడుగు విజయ్ కుమార్, డాక్టర్ మీరా, మహమ్మద్ జాహిద్ దాని, శ్రీనివాస్ గండే మల్లె, ఫారూఖ హెయిర్ ,పూరికా అర్పిత, ఎమ్ కిరణ్మయి, దీపాంకర్ పాల్, వాణి రాణి, రుద్రారం అంజయ్య ముదిరాజ్, డాక్టర్ బి శ్యామలను సేవారత్న పురస్కార్తో శాలువా మెమెంటో పూలమాలతో ముఖ్య అతిథి ఇతర న్యాయమూర్తులు ఘనంగా సన్మానించారు.

తెలంగాణ రాష్ట్రంలో 30 సంవత్సరాలుగా జరుగుతున్న ఎస్సీ వర్గీకరణ ఉద్యమానికి మాలలు మద్దతు పలికి రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాలని బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్ అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ న్యాయ కళాశాల ఆవరణంలో ఉన్న భారతరత్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించారు.

ప్రపంచ వ్యాప్తంగా ఎన్నోరాజ్యాంగాలను అధ్యయనం చేసిన తరువాత మన దేశాన్ని నడిపించడానికి అనుగునంగా భారత రాజ్యాంగాన్ని రూపకల్పన చేయడం జరిగిందని భూపాలపల్లి జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కే. జయరాం రెడ్డి తెలిపారు.

భారత రాజ్యాంగం 132 కోట్ల భారతీయుల జీవన గమనాన్ని ప్రతిబింబించే విలువైన సాధనం అని, ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత భారత రాజ్యాంగం అని, దీన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికి ఉన్నదని సామజిక కార్యకర్త వేముల సైదులు అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలంలోని కక్కిరేణి గ్రామంలో మంగళవారం 75వ భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

సామాజిక, ఆర్థిక, రాజకీయ పరంగా అందరికీ రాజ్యాంగ ఫలాలు అందాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ ఎస్.శిరీష అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కోర్టు ఆవరణలో ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ అడ్వకేట్ ఉయ్యాల హనుమంతు గౌడ్, బార్ అసోసియేషన్ కోశాధికారి మామిడి వెంకట్ రెడ్డి, బాసరాజు అశోక్ కుమార్, యాదాసు యాదయ్య, స్వామి, కోర్టు సూపరిండెంట్ బాలగోని శివరాజు, మధులిక, కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ప్రసూనాదేవి, నిర్మల, రాజేశ్వరి, కవిత, ఉమారాణి, కరుణ, పున్నారావు, వెంకట్ రెడ్డి, కిరణ్, నరసింహారావు, అశోక్, శ్రీకాంత్, నగేష్, ఉపేందర్, జానయ్య, పరశురాం, శ్రవణ్, సుధాకర్ రెడ్డి, నరసయ్య, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలంలోని మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో మంగళవారం "భారత రాజ్యాంగ దినోత్సవం" వేడుకలు ఘనంగా నిర్వహించినారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జె. రాములు నాయక్, పర్యవేక్షకులు ఏ. లోకేశ్వర్ రెడ్డి, కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

భూపాలపల్లి జిల్లా కోర్టు ప్రాంగణంలో రాష్ట్ర హైకోర్టు ఆదేశాలను అనుసరించి రాజ్యాంగ ఉపోద్ఘాతం పఠనం చేసారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా జిల్లా సీనియర్ సివిల్ జడ్జి కే. జయరాం రెడ్డి, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎన్. రామచంద్రా రావు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి. అఖిల హాజరయ్యారు.

రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల కేంద్రంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి మాజీ సర్పంచ్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా పూలమాలలు వేసి మండల ప్రజలకు రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ప్రజలకు సమన్యాయం కల్పించాలని ప్రతి ఒక్కరికి స్వేచ్ఛగా బతకాలని భారత రాజ్యాంగం ద్వారా ప్రతి ఒక్కరికి సమాన హక్కులు కల్పించారు.

తెలకపల్లి మండల కేంద్రంలో నాగర్ కర్నూలు జిల్లా స్వేరోస్ ప్రధాన కార్యదర్శి రెడ్డపాకుల శివ శంకర్ ఆధ్వర్యంలో 75వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలను అంబేద్కర్ గారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు...ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలకపల్లి సింగిల్ విండో వైస్ చైర్మన్ మామిళ్ళపల్లి యాదయ్య మరియు అంబేద్కర్ పూలే సంఘం నాయకులు గుగ్గిల ప్రకాష్ హాజరయ్యారు...ఈ సందర్భంగా మామిళ్ళపల్లి యాదయ్య మాట్లాడుతూ భారత రాజ్యాంగం చాలా గొప్పదని,అంబేద్కర్ గారు ముందు చూపుతో చాలా దృఢమైన రాజ్యాంగాన్ని భారతదేశానికి అందించారని కొనియాడారు ,ఈ గాలి,నీరు ప్రపంచం ఉన్నంతవరకు భారత రాజ్యాంగం కొనసాగుతుందని తెలియజేశారు.



తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో..



మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ ఆధ్వర్యంలో..



రామన్నపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో



భూపాలపల్లి జిల్లా కోర్టు ప్రాంగణంలో



భూపాలపల్లి జిల్లా కోర్టు ప్రాంగణంలో



తలకొండపల్లి మండల కేంద్రంలో

## నేషనల్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇన్సూరెన్స్ పెన్షనర్స్ అధ్యక్ష కార్యదర్శులుగా కె.రాజేందర్ రెడ్డి,మాడిశెట్టి గోపాల్





**కరీంనగర్ :** ఎల్ఐసి కరీంనగర్ డివిజన్ పరిధిలోని భారతీయ మజ్దూర్ సంఘ అనుబంధ సంస్థ నేషనల్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇన్సూరెన్స్ పెన్షనర్స్ నూతన అధ్యక్ష కార్యదర్శులుగా కే రాజేందర్ రెడ్డి, మాడిశెట్టి గోపాల్ లు ఎన్నికయ్యారు. మంగళవారం స్థానిక ఫిలిం భవన్ లో జరిగిన ఆర్గనైజేషన్ సర్వసభ్య సమావేశంలో రెండేళ్ల పదవీ కాలానికి గాను వారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారితోపాటు వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎం. రవి కిరణ్, ఉపాధ్యక్షులుగా బి. రాజయ్య, పి.మధునయ్య, జాయింట్ సెక్రటరీలుగా పి అనిల్ కుమార్, పి చంద్రశేఖర్ లు ఎన్నికయ్యారు. సలహాదారులుగా సదాశివరావును ఎన్నుకున్నారు. సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సంస్థ అఖిలభారత ఉపాధ్యక్షులు హెచ్ ఎస్ రమేష్ మాట్లాడుతూ సంస్థ అభివృద్ధికి పాటుపడుతూ దేశాభివృద్ధి కోసం పనిచేసే ఏకైక సంస్థ బిఎంఎస్ అని అన్నారు. పెన్షనర్లకు సంబంధించిన అపరిష్కృత సమస్యల కోసం సంస్థ నిరంతరం పని చేస్తుందని అన్నారు. గౌరవ అతిథిగా హాజరైన హైదరాబాద్ సికింద్రాబాద్ మెట్రో డివిజన్ల అధ్యక్షులు అశోక్ రావు మాట్లాడుతూ దేశాన్ని, మన విలువలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్, కరీంనగర్ పూర్వ ఉమ్మడి జిల్లాల ఎల్ఐసి రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేసిన మాంకాల శ్రీశైలం



**విశ్వంభర, నందిగామ(చేగూర్):** యువకులు క్రీడల పై మంచి పట్టు సాధించాలంటే, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. యువ కాంగ్రెస్ నాయకులు మాంకాల శ్రీశైలం. నందిగామ మండలంలోని చేగూరు గ్రామ గ్రెస్ బాల్ క్రికెట్ జట్టులో 18 మందికి తన సొంత ఖర్చులతో గ్రామంలో క్రీడాకారులకు కాంగ్రెస్ యువ నాయకులు మాంకాల శ్రీశైలం క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు శ్రీశైలం మాట్లాడుతూ, గ్రామీణ యువత, క్రీడాకారులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రీడల పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. క్రీడల అభివృద్ధి కోసం తన వంతు పాత్ర పోషిస్తానన్నారు.ఈ కార్యక్రమంలో క్రీడాకారులు,క్రికెట్ టీం సభ్యులు అయిన సోలిపేట శ్రీను, జింగ భీమేష్,అరవింద్,నర్సింగ్ రావు, భాస్కర్, హరికృష్ణ, సిద్ధు, కృష్ణ, చంటి,ప్రశాంత్,ఉదయ్,సన్నీ,తేజ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేయడమే బీజేపీ లక్ష్యం



**విశ్వంభర, బషీర్ బాగ్:** మనుస్మృతి అమలుకై ఆర్ఎస్ఎస్, సంఘ్ పరివార్ ఒత్తిడి మేరకు భారత రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా బీజేపీ పనిచేస్తుందని ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ఆరోపించారు. ఆమ్ ఆద్మీ పార్టీ 13 వ వ్యవస్థాపక దినోత్సవం, 75 రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళ వారం ఆప్ రాష్ట్ర కార్యాలయంలో రాజ్యాంగ హక్కులు కాపాడుకోవాల్సిన బాధ్యత అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా 'రాజ్యాంగ విలువలను' కాపాడుతామని ఆప్ కార్యకర్తలతో డాక్టర్ దిడ్డి సుధాకర్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ మన రాజ్యాంగ నిర్మాతలు ప్రతిపాదించిన సార్వభౌమ, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్యం పై బీజేపీ ప్రత్యక్ష దాడి చేస్తూ భారత రాజ్యాంగం పౌరులకు కల్పిస్తున్న న్యాయం, సమానత్వం, హక్కులు, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తుందన్నారు. సమాజాన్ని విభజించి, మీడియాను బానిసలుగా చేసి, భావప్రకటనా స్వేచ్ఛను తుంగలో తొక్కి, స్వతంత్ర సంస్థలను నిర్వీర్యం చేస్తూ, ప్రతిపక్షాలను నిర్మూలించేందుకు కుట్ర పన్నడం ద్వారా భారతదేశాన్ని నియంతృత్వ దేశంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మార్చాలనుకుంటుందన్నారు. రాజ్యాంగాన్ని నాశనం చేయడం అనే బీజేపీ మోసపూరిత ఎజెండాను ఎండగట్టాలని అయన కోరారు. మన ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అని అన్నారు. భారత రాజ్యాంగాన్ని, దాని విలువలను రక్షించడానికి ఆమ్ ఆద్మీ పార్టీ ఆవిర్భవించిందని, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య పరిరక్షణకై భవిషత్తులో పెద్దఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తుందని డాక్టర్ దిడ్డి సుధాకర్ పేర్కొన్నారు. ఈ సదస్సులో ఆప్ తెలంగాణ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాము గౌడ్, నేతలు ఆఫస, జావీద్ షరీఫ్, ఠాకూర్ రాకేష్ సింగ్, విజయ్ కుమార్, శివాజీ, కొడంగల్ శ్రీనివాస్, ఎండి. అజీమ్, ఏం. వివేక్, ధర్మేందర్ తివారి తదితరులు పాల్గొన్నారు.

## మ్యూజికల్ గార్డెన్‌కు పూర్వ వైభవం తెస్తాం

### మ్యూసికల్ గార్డెన్ పరిసరాలను పరిశీలించిన కుడా ఛైర్మన్



**విశ్వంభర, వరంగల్:** వరంగల్ భద్రకాళి చుట్టూ మాడ వీధుల నిర్మాణం కొరకై కాకతీయ మ్యూసికల్ గార్డెన్ లో చేపట్టనున్న అభివృద్ధి పనులను వైస్ ఛైర్మన్ అశ్విని తానాజీ వాకడే, కుడా సీపీవో అజిత్ రెడ్డి, ఈఈ భీం రావు, హార్టికల్చర్ అధికారి తో వరంగల్ కుడా ఛైర్మన్ శ్రీ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మంగ పరిశీలించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ భద్రకాళి అమ్మవారి మాడ వీధులను త్వరితగతిన పూర్తి చేస్తామని, భద్రకాళి జలాశయం ను త్రాగు నీటి జలాశయంగా మారుస్తామని, భద్రకాళి చెరువు ఖబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. చెరువుపై సర్వే చేయించి నిర్మాణాలను తొలగిస్తామని తెలిపారు. అలాగే మ్యూజికల్ గార్డెన్‌కు పూర్వ వైభవం తెస్తామని వరంగల్‌లోని కాకతీయ మ్యూజికల్ గార్డెన్ పునరుద్ధరణ పనుల్లో వేగం పెంచామని, ఇప్పటికే దాదాపు 90శాతం పూర్తి అయిందని, త్వరలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని అన్నారు. రూ.కోటీ 60 లక్షల కుడా నిధులతో గార్డెన్ పనులను చేపడుతున్నామని, రెండు మ్యూజికల్ ఫౌంటేన్‌లను ఏర్పాటు, వచ్చే సందర్శకులకు వీనుల విందైన సంగీతానికి అనుగుణంగా నాట్యం చేసే ఫౌంటేన్లను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. గార్డెన్ వెనుకబాగంలో ఒక ఫౌంటేన్, మధ్యలో ఒక ఫౌంటేన్ ఏర్పాటు చేసేలా ప్లాన్ చేస్తున్నామని తెలిపారు.

## అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



**విశ్వంభర, మిర్యాలగూడ:** మిర్యాలగూడ నియోజకవర్గ వ్యాప్తంగా దామరచర్ల మండలం నర్సాపురం(శాంతి నగర్) గ్రామంలో, మిర్యాలగూడ మండలం జాలు బాయ్ తండా గ్రామంలో, మాడుగులపల్లి మండలం తోపుచర్ల గ్రామాలలో పలు అభివృద్ధి పనులకు మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందితేనే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుంది. తద్వార రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది అని అన్నారు. కేవలం ఒకే సంవత్సరం లో ఏక కాలంలో 2 లక్షల రుణమాఫీ చేసిన ఏకైక రైతు ప్రభుత్వం అంటే అది కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమే అని అన్నారు. రానున్న కాలంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్ , సీనియర్ నాయకుడు స్కైలాభ్ నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పొదిల శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మరియు బీఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనం నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ


### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**విశ్వంభర, భూపాలపల్లి :** సంక్షేమ, అంగన్వాడీ పాఠశాలల్లో బియ్యం, సరుకుల నాణ్యతను ఖచ్చితంగా పాటించాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. మంగళవారం గణపురం మండల కేంద్రంలోని జడ్పి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను భోజనం ఎలా ఉంటుంది. కూరలు బావుంటున్నాయా అడిగి తెలుసుకున్నారు. బియ్యం, సరకులు స్టోర్ ను పరిశీలించారు. బియ్యం కానీ సరుకులు కానీ బాగా లేకపోతే తక్షణమే మార్చాలని, తప్పనిసరి నాణ్యత పాటించాలని సూచించారు. ఆహార తనిఖీలు చేయాలని మండల ప్రత్యేక అధికారులను, తహసీల్దార్లును, ఎంపీడీవోలకు సూచించారు.

సంక్షేమ వసతి గృహాలు, అంగన్వాడీ కేంద్రాలు, మధ్యాహ్న భోజన పథకాల్లో పిల్లలు, విద్యార్థులకు అందిస్తున్న ఆహారం శుభ్రత, పోషకాహార విలువలు కలిగి ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మెనూ పాటించాలని సూచించారు. అధికారుల పర్యవేక్షణలో ఏవైనా లోపాలు ఉంటే తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలను పాటించే విధంగా తనిఖీలు నిర్వహించి, నివేదికలు సమర్పించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థుల, చిన్నారుల ఆరోగ్యం, శ్రేయస్సు చాలా ముఖ్యమని ప్రతి ఒక్కరూ ఈ నాణ్యతా ప్రమాణాలను పాటించాల్సిన అవసరం ఉందని ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా విద్యార్థులు జిల్లా కలెక్టర్ కు మొక్కను అందించి రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్ విజయలక్ష్మి మండల ప్రత్యేక అధికారి కుమారస్వామి, డీఆర్డీఓ నరేష్, తహసిల్దార్ సత్యనారాయణ స్వామి, ఎంపీడీవో భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి రవాణా చేస్తున్న నిందితులు అరెస్ట్



**విశ్వంభర, వరంగల్:** వరంగల్ జిల్లా ఖానాపురం మండల కేంద్రానికి చెందిన పుల్లూరి రాజేష్ (21) కిచెన్ వర్క్, గౌట్కుల నవీన్ (22) విద్యార్థి ఇద్దరు చిన్న నాటి స్నేహితులు గతం లో వారిద్దరూ హైదరాబాద్ బొడ్ ఉప్పల్ లోని ఒక వాటర్ ప్లాంట్ నందు పని చేసిన సమయంలో గంజాయి తాగుడుకు అలవాటు అయినారు. అప్పటి నుండి వారు తరుచు గంజాయి తాగేవారు అలా వారు ఇద్దరు కలిసి తమ గ్రామం ఖానాపురం నుండి హైదరాబాద్ కి వెళ్లి ఒక గుర్తు తెలియని మహిళ వద్ద నుండి గంజాయి కొనుగోలు చేసుకొని తిరిగి తమ స్వగ్రామం అయిన ఖానాపురంకి వస్తుండగా నర్సంపేట్ లోని మహబూబాబాద్ రోడ్ లో గల భైరవ వైన్స్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న నర్సంపేట పోలీస్ వారికి పట్టుబడ్డారు. పట్టుబడిన నిందితుల వద్ద నుండి 440 గ్రాముల ఎండు గంజాయి దాని విలువ Rs. 11,000 సెల్ ఫోన్ ద్విచక్ర వాహనం ను రికవరీ చేసి పై ఇద్దరు వ్యక్తులను రిమాండ్ కి తరలించడం జరిగింది. ఇట్టి కేసులు ఛేదించడం లో ప్రతిభ కనబరిచిన రమణ మూర్తి, ఎస్ హెచ్ ఓ రవి కుమార్, ఎస్ఐ అరుణ్, ఎస్ఐ బాబు, పీసీ లు రవి రమేష్ నాగరాజు మాన్ సింగ్ రవీందర్ హెచ్సీ, ఇతర సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

# విమానంలో ఇబ్బందికర పరిస్థితులను వెల్లడించిన న్యాయమూర్తి

**దిల్లీ:** విమానంలో కొందరి ప్రవర్తన తోటి ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుంది. అత్యవసర ద్వారాన్ని తెరవడం, బాంబు ఉందంటూ బెదిరింపులకు పాల్పడడం తరచూ వింటూనే ఉన్నాం. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కేవీ విశ్వనాథన్‌కు కూడా విమాన ప్రయాణంలో ఊహించని సంఘటన ఎదురైందట. ఈ విషయాన్ని స్వయంగా ఆయనే వెల్లడించారు. న్యూయార్క్ నుంచి దిల్లీ బయలుదేరిన విమానంలో ప్రయాణించిన ఓ వృద్ధురాలి పట్ల ఒక ప్రయాణికుడు అసభ్యకరంగా ప్రవర్తించాడు. మద్యం మత్తులో ఆమెపై మూత్ర విసర్జన చేశాడు. దీంతో ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ప్రయాణ సమయంలో తోటి ప్రయాణికులను ఇబ్బందికి గురి చేసే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేసింది. రెండేళ్ల క్రితం దాఖలైన ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు తాజాగా విచారణ చేపట్టింది.దీన్ని పరిశీలించిన జస్టిస్ కేవీ విశ్వనాథన్.. గతంలో విమాన ప్రయాణంలో తనకు ఎదురైన చేదు అనుభవాన్ని పంచుకున్నారు. ''ఇటీవల సుప్రీం న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌కు నాకు విమానంలో ఇబ్బందికర పరిస్థితులు తలెత్తాయి. ఇద్దరు ప్రయాణికులు ఎక్కువగా మద్యం తీసుకున్నారు. అందులో ఒకరు బాత్‌రూంలోకి వెళ్లి దాదాపు 30 నిమిషాల పాటు అందులోనే ఉన్నాడు. మరో వ్యక్తి తలుపు బయటే నిలబడి వాంతులు చేసుకున్నాడు. అందులో ఉన్న సిబ్బంది అంతా మహిళలే. ఆ పరిస్థితి ఎంతో ఇబ్బందికరంగా అనిపించింది. వారిని బయటకు తీసుకువెళ్లాలని సహా ప్రయాణికులు అభ్యర్థించారు'' అని వెల్లడించారు. ఇటువంటి సమస్యల పరిష్కారానికి ఓ వినూత్న ప్రణాళికను అధికారులు రూపొందించాలని జస్టిస్ విశ్వనాథన్, జస్టిస్ బీఆర్ గవాయ్‌లతో కూడిన ధర్మాసనం.. అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటీకి సూచించింది.





## ఎన్నికల గ్యారంటీలపై సొంత ఎమ్మెల్యే నుంచే వ్యతిరేకత

**బెంగళూరు:** నిధుల కొరత కారణంగా రాష్ట్ర ప్రజలకు ఇస్తోన్న కొన్ని ఎన్నికల గ్యారంటీలను వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే ఒకరు సీఎం సిద్ధరామయ్యను కోరారు. దీనిపై డిప్యూటీ ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తీవ్రంగా స్పందించారు. విజయనగర ఎమ్మెల్యే హెచ్‌ఆర్ గవియప్ప ఒక బహిరంగ కార్యక్రమంలో మాట్లాడుతూ.. ''ఈ ఎన్నికల హామీల వల్ల పేద ప్రజలకు ఇళ్లు నిర్మించి ఇవ్వడం కష్టంగా మారింది. అవసరం లేని రెండుమూడు పథకాలను వెనక్కి తీసుకోవాలని సీఎంను కోరుతున్నాం. మరి ముఖ్యమంత్రి ఏం చెప్తారో చూద్దాం'' అంటూ సొంత పార్టీ హామీల గురించి వ్యాఖ్యలు చేశారు. ఈ విషయంలో సీఎం తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటామని చెప్పారు.ఈ వ్యాఖ్యలు డీకే శివకుమార్‌కు ఆగ్రహాన్ని తెప్పించాయి. ''ఇది కాంగ్రెస్ పార్టీ. ఆ ఎమ్మెల్యే అలా మాట్లాడి ఉండాల్సింది కాదు. ఆయనకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తాం. ఏ పథకాన్ని నిలిపివేసే ప్రసక్తే లేదు'' అని స్పష్టం చేశారు. ఇదిలా ఉంటే.. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. బీపీఎల్ కార్డుల జాబితా నుంచి ప్రభుత్వ ఉద్యోగులు, పన్ను చెల్లింపుదారులను తొలగించాలని కర్ణాటక ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

## రాహుల్ గాంధీ పౌరసత్వం అంశం.. పరిశీలనలో ఉంది: కేంద్రం



**దిల్లీ:** కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ పౌరసత్వం అంశాన్ని పరిశీలిస్తున్నామని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. రాహుల్ గాంధీ బ్రిటన్ పౌరుడని, ఈ నేపథ్యంలో ఆయన భారత పౌరసత్వాన్ని రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై స్పందన తెలియజేయాలంటూ అలహాబాద్ హైకోర్టు కేంద్రాన్ని ఆదేశించింది. న్యాయవాది, భాజపా నేత విఘ్నేశ్ శిశిర్ ఈ పిటిషన్ వేశారు. అలాగే కాంగ్రెస్ నేత పౌరసత్వం అంశంపై సీబీఐ విచారణ కూడా జరిపించాలని కోరారు.లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా ఉన్న రాహుల్ గాంధీ బ్రిటన్ పౌరుడని భాజపా సీనియర్ నేత సుబ్రహ్మణ్య స్వామి కొంతకాలంగా ఆరోపిస్తున్నారు. ఆ దేశంలో నమోదైన ఓ కంపెనీకి రాహుల్ గాంధీ డైరెక్టర్, సెక్రటరీగా ఉన్నారని చెబుతున్నారు. ఆ కంపెనీ వార్షిక నివేదికలో తనను తాను బ్రిటిష్ పౌరుడిగా గాంధీ పేర్కొన్నట్లు స్వామి తెలిపారు. ఇదే విషయమై 2019లో కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు ఆయన లేఖ రాశారు. వేరే దేశంలో పౌరుడిగా ఉన్న వ్యక్తి దేశ పౌరసత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకోవాల్సి ఉంటుందని తన లేఖలో ప్రస్తావించారు. అలా కలిగి ఉంటే రాజ్యాంగంలోని ఆర్టికల్ 9, భారతీయ పౌరసత్వ చట్టం, 1955ని ఉల్లంఘించడమే అవుతుందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో తదుపరి విచారణ డిసెంబర్ 19న జరగనుంది.

## ఈవీఎంలు మాకొద్దు.. బ్యాలెట్ పేపర్లే కావాలి

ఖర్గే కీలక వ్యాఖ్యలు



**దిల్లీ:** కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల నిర్వహణకు ఈవీఎంలు వద్దని.. బ్యాలెట్ పేపర్లే తాము కోరుకుంటున్నామన్నారు. మహారాష్ట్ర, ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన నేపథ్యంలో ఆయన ఈ తరహా వ్యాఖ్యలు చేయడం గమనార్హం. దేశంలో ఐక్యత కావాలంటే విద్వేషాలను విస్తరించడం మానుకోవాలని భాజపాను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. దిల్లీలోని తల్కటోరా స్టేడియంలో నిర్వహించిన 'సంవిధాన్ రక్షక్ అభియాన్' కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. బ్యాలెట్ పేపర్‌కు తిరిగి వచ్చేందుకు భారత్ జోడో యాత్ర తరహాలో ప్రచారం చేయాలని ఖర్గే ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కొందరు రాజ్యాంగాన్ని పొగిడి, దానికి నమస్కరించి భక్తిని ప్రదర్శిస్తుంటారని, లోపల మాత్రం రాజ్యాంగాన్ని నాశనం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేపట్టారన్నారు. ఈ యాత్రలో ఆయనతో పాటు సమాజంలోని అన్నివర్గాల ప్రజలు కదిలివచ్చారని తెలిపారు.

# ముంబయి ఉగ్రదాడులకు పదహారేళ్లు

మహీంద్రా పోస్ట్ వైరల్



**దిల్లీ:** ఎన్నో ఆసక్తికర విషయాలు, ప్రేరణ కలిగించే వీడియోలను తన అధికారిక 'ఎక్స్' ఖాతా ద్వారా పంచుకుంటుంటారు ప్రముఖ వ్యాపారవేత్త ఆనంద్ మహీంద్రా. కాగా 2008 నవంబర్ 26న ముంబయిలో జరిగిన ఉగ్రదాడుల ఘటనపై తాజాగా ఆయన సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. భారత దేశాన్ని ఉలిక్కి పడేలా చేసిన ఈ దాడులకు నేటితో సరిగ్గా 16 ఏళ్లు. ఈ నేపథ్యంలో మహీంద్రా అప్పటి ఘోరాన్ని తలుచుకుంటూ..ఆ నాటి మారణహోమాన్ని ఎన్నటికీ మరచిపోమని ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనలో ప్రాణాలు అర్పించిన సైనికుల త్యాగాలను దేశం ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేశారు. ''గతాన్ని గుర్తుపెట్టుకోలేని వ్యక్తులు మళ్లీ దాన్ని పునరావృతం చేస్తే వారికి శిక్ష పడాల్సిందే'' అని ఓ రచయిత రాసిన కోట్‌ను జత చేస్తు..ముంబయి ఉగ్రదాడులకు సంబంధించిన దృశ్యాలను పంచుకున్నారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే, గవర్నర్ సీపీ రాధాకృష్ణన్, రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ముంబయి ఉగ్రదాడుల్లో ప్రాణాలు కోల్పోయిన అమరవీరులకు నివాళులర్పించారు. బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్, భారత క్రికెటర్ మాజీ వీవీఎస్ లక్ష్మణ్ సైతం సైనికుల త్యాగాలను గుర్తు చేసుకున్నారు. 2008 నవంబర్ 26న 10 మంది పాకిస్థానీ ఉగ్రవాదులు సముద్ర మార్గం ద్వారా ముంబయికి చేరుకుని.. సీఎస్‌ఎంటీ, ఒబెరాయ్ ట్రైడెంట్, తాజ్ హోటల్ తదితర ప్రాంతాల్లో దాడులకు పాల్పడ్డారు. నవంబర్ 29 వరకు మారణహోమం కొనసాగింది. ఈ ఘటనల్లో 18 మంది భద్రత సిబ్బంది సహా 166 మంది ప్రాణాలు కోల్పోయారు. అనేక మంది గాయపడ్డారు. అప్పటి యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్) చీఫ్ హేమంత్ కర్కరే, ఆర్మీ మేజర్ సందీప్ ఉన్నికృష్ణన్, ముంబయి అదనపు పోలీస్ కమిషనర్ అశోక్ కామ్టే, సీనియర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ విజయ్ సలాస్కర్‌లు అమరులయ్యారు. భద్రత బలగాలు జరిపిన ఎదురు కాల్పుల్లో తొమ్మిది మంది ఉగ్రవాదులు హతమయ్యారు. సజీవంగా పట్టుబడిన ఏకైక ఉగ్రవాది అజ్మల్ కసబ్‌ను 2012 నవంబర్ 21న ఉరితీశారు.

## బంగ్లాదేశ్‌లో చిన్మయ్ కృష్ణదాస్ బ్రహ్మచారి అరెస్టుపై స్పందించిన భారత్




**దిల్లీ :** ఇస్కాన్ కు చెందిన చిన్మయ్ కృష్ణదాస్ బ్రహ్మచారిను బంగ్లాదేశ్‌లో అరెస్టు చేయడంపై భారత్ స్పందించింది. ఆయన్ను అరెస్టు చేసి అరెస్టు, బెయిల్ నిరాకరించడంపై భారత విదేశాంగశాఖ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ విషయంలో బంగ్లాదేశ్‌లో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న మైనార్టీలపై దాడులు సరికాదని తెలిపింది. హిందువులు, మైనార్టీలందరికీ భద్రత కల్పించాలని బంగ్లాదేశ్ అధికారులను కోరినట్లు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ తెలిపారు. బంగ్లాదేశ్‌లో ఇప్పటికే హిందువులు, మైనార్టీలపై తీవ్రవాద గ్రూపుల దాడులకు తెగబడుతున్నాయని.. ఈ క్రమంలోనే తాజాగా ఘటన జరగడంపై ఆందోళనకరమని విదేశాంగ శాఖ పేర్కొంది. మైనార్టీల ఇళ్లలో దోపిడీ, వ్యాపార సంస్థల్లో విధ్వంసం, దేవాలయాలను అపవిత్రం చేయడం వంటి దుశ్చర్యలు చోటుచేసుకున్నాయని తెలిపింది. ఇలాంటి దుర్మార్గాలకు కారణమైన వారిని కాకుండా.. శాంతియుత సమావేశాల ద్వారా న్యాయబద్ధమైన డిమాండ్‌ల కోసం పనిచేస్తున్న వారిపై అభియోగాలు మోపడం దురదృష్టకరమని పేర్కొంది. కృష్ణదాస్ బ్రహ్మచారి అరెస్టు విషయంలో జోక్యం చేసుకొని, ఆయన్ను విడిపించాలని ఇస్కాన్ ఆలయ అధికారులు కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన విషయం తెలిసిందే. 'ఇస్కాన్‌కు చెందిన కృష్ణదాస్‌ను బంగ్లాదేశ్‌లోని ఢాకా పోలీసులు అరెస్టు చేశారనే వార్తలను మేము చూశాం. అక్కడి అధికారులు ఇస్కాన్‌పై తప్పుడు ఆరోపణలు చేశారు. దీనిపై భారత ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి. బంగ్లాదేశ్ ప్రభుత్వంతో మాట్లాడి.. మాది శాంతి, ప్రేమగల భక్తి ఉద్యమం అని తెలపాలి. కృష్ణదాస్‌ను వెంటనే విడుదల చేయాలని బంగ్లాదేశ్ ప్రభుత్వాన్ని కోరుతున్నాం' అని ఇస్కాన్ 'ఎక్స్'లో పేర్కొంది. బంగ్లాదేశ్ మీడియా కథనాల ప్రకారం.. ఇస్కాన్‌కు చెందిన చిన్మయ్ కృష్ణదాస్ గత నెలలో అక్కడ జరిగిన ఓ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ క్రమంలో బంగ్లాదేశ్ జెండాను ఉద్దేశించి పలు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీంతో ఢాకా విమానాశ్రయంలో ఆయనను పోలీసులు అరెస్టు చేశారు. మరోవైపు అరెస్టును వ్యతిరేకిస్తూ పలు సంఘాలు ఆందోళనకు దిగాయి.



## డిజిటల్ అరెస్టు.. వృద్ధురాలి నుంచి రూ.4 కోట్లు కాజేసిన సైబర్ నేరగాళ్లు

**ముంబయి:** అమాయకులను భయపెట్టి ఆన్‌లైన్లో డబ్బులు కాజేసేందుకు సైబర్ నేరగాళ్లు 'డిజిటల్ అరెస్టు' పేరిట కొత్త మోసానికి తెరతీస్తున్నారు. 77 ఏళ్ల మహిళను సైబర్ నేరగాళ్లు కొన్ని రోజుల పాటు డిజిటల్ అరెస్టు చేసి ఏకంగా రూ.4 కోట్లు కాజేసిన ఘటన ముంబయిలో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ముంబయి నగరంలో ఓ వృద్ధ జంట నివాసముంటోంది. కొన్ని రోజుల క్రితం ఆమెకు వాట్సాప్‌లో గుర్తు తెలియని వ్యక్తుల నుంచి కాల్ వచ్చింది. అతడు పోలీసు ఉన్నతాధికారిగా పరిచయం చేసుకున్నాడు. ''తైవాన్‌కు మీరు పంపిన పార్సిల్‌ను అడ్డుకున్నాం. అందులో ఐదు పాస్‌పోర్టులు, బ్యాంక్‌కు సంబంధించిన కార్డులు, ఇతర వస్తువులు సహా ఎమ్‌డీఎమ్‌ఏ డ్రగ్స్‌లను స్వాధీనం చేసుకున్నాం'' అని అన్నాడు. తాను ఎలాంటి పార్సిల్ పంపలేదని.. దానికి తనకు ఎలాంటి సంబంధం లేదంటూ ఆమె బదులిచ్చారు. అయినప్పటికీ.. ఆ వ్యక్తి మాత్రం తమ వద్ద ఆధార్ కార్డు సహా కొన్ని వివరాలు ఉన్నాయని.. తాము విచారిస్తున్న మనీలాండరింగ్ కేసుతో మీ వివరాలు ముడిపడి ఉన్నాయంటూ బెదిరించాడు. దీనిపై మీకు స్పష్టత రావాలంటే తాము చెప్పిన యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడొచ్చంటూ నమ్మించాడు. మీరు డిజిటల్ అరెస్టు అయ్యారని.. మేం చెప్పేదాకా స్క్రీన్ ముందు నుంచి కదలొద్దు అని చెప్పాడు. అంతేకాకుండా.. ఈ విచారణ గురించి ఇతరులకు చెప్పకూడదంటూ బెదిరించాడు. ఈ క్రమంలోనే మరో వ్యక్తి ఐపీఎస్ ఆఫీసర్ ముసుగులో ఆమెతో మాట్లాడి.. బ్యాంకు వివరాలు సేకరించాడు. కొంత డబ్బును పంపాలని.. కేసులో మీరు నిర్దోషి అని తేలితే తిరిగి ఇస్తామన్నాడు. అలా కొన్ని రోజుల పాటు డిజిటల్ అరెస్టు చేసిన సైబర్ నేరగాళ్లు.. కొంచెం కొంచెంగా ఆమె నుంచి ఏకంగా రూ.4 కోట్ల వరకు కాజేశారు. ఎంతకీ డబ్బు తిరిగి రాకపోవడంతో తన కుమార్తెకు విషయాన్ని వివరించింది. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

## ఏపీ సహా 4 రాష్ట్రాల్లో రాజ్యసభ ఉపఎన్నికలకు షెడ్యూల్



**దిల్లీ:** ఆంధ్రప్రదేశ్ సహా నాలుగు రాష్ట్రాల్లో రాజ్యసభ ఉపఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) షెడ్యూల్ విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో మూడు, ఒడిశా , బెంగాల్, హరియాణా రాష్ట్రాల్లో ఒక్కో స్థానానికి ఉప ఎన్నిక జరగనుంది. డిసెంబర్ 3న నోటిఫికేషన్ విడుదల కానుంది. నామినేషన్ల స్వీకరణకు డిసెంబర్ 10ని తుది గడువుగా ఈసీ నిర్ణయించింది. డిసెంబర్ 11న నామినేషన్ల పరిశీలన, 13వ తేదీ వరకు ఉపసంహరణకు ఈసీ అవకాశం కల్పించింది. డిసెంబర్ 20న ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్.. అదే రోజు 5 గంటల నుంచి లెక్కింపు ఉంటుంది. ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్ రావు, ఆర్. కృష్ణయ్యల రాజీనామాతో ఉప ఎన్నికల అనివార్యం అయింది.

# మహా కుంభమేళాలో తొలిసారి రోబోలు!



**ప్రయాగ్‌రాజ్:** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో అతిపెద్ద ఆధ్యాత్మిక సమ్మేళనమైన మహా కుంభమేళా వచ్చే ఏడాది జరగనుంది. దీనికి సంబంధించిన ఏర్పాట్లను అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఈక్రమంలో కుంభమేళాలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా రోబోటిక్ ఫైర్ టెండర్లను ఏర్పాటుచేసినట్లు అధికారులు పేర్కొన్నారు. దీంతోపాటు 200 అగ్నిమాపక కమాండోలను సైతం ఉంచనున్నట్లు తెలిపారు. ఈమేరకు అడిషనల్ డైరెక్టర్ జనరల్ పద్మజా చౌహాన్ మీడియాకు వివరాలు వెల్లడించారు. 'అత్యవసర సమయాల్లో సిబ్బంది చేరుకోలేని ప్రాంతాలకు వెళ్లేందుకు మూడు రోబోటిక్ ఫైర్ టెండర్లను ఉపయోగిస్తాం. ఇది ఒక్కొక్కటి 20 నుంచి 25 కిలోల బరువుంటుంది. ఈ రోబోలు మెట్లు ఎక్కడంతో పాటు మంటలను సైతం అదుపు చేస్తాయి. దీంతోపాటు 35 మీటర్ల ఎత్తు నుంచి నీటిని స్ప్రే చేసే ఆర్టిక్యూలేటింగ్ వాటర్ టవర్‌లు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన కెమెరాలు ఏర్పాటు చేశాం. ఎన్డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ తరహాలో ప్రత్యేక శిక్షణ తీసుకున్న ఎస్‌టీఆర్‌జీని ప్రారంభించాం. ఈ యూనిట్‌లో ఎన్‌డీఆర్ఎఫ్, సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) హైదరాబాద్‌లో శిక్షణ పొందిన 200 మంది సిబ్బంది ఉన్నారు. వారు జాతర సమయంలో హై రిస్క్ జోన్‌లలో మోహరిస్తారు' అని పేర్కొన్నారు. అగ్నిమాపక సేవల కోసం గత కుంభమేళాకు రూ.6 కోట్లు కేటాయించగా.. ప్రస్తుతం దాన్ని రూ.67 కోట్లకు పెంచినట్లు తెలిపారు.



# పద్మావతి అమ్మవారి ఆలయంలో శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**విశ్వంభర, తిరుపతి:** తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. టీటీడీ జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం పాల్గొన్నారు. ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి సహస్రనామార్చన, శుద్ధి నిర్వహించారు.అనంతరం ఉదయం 6 నుంచి 9 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపట్టారు. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేశారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణంతో పాటు పలు సుగంధ ద్రవ్యాలు కలిపిన పవిత్ర జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. ఈ కారణంగా కల్యాణోత్సవం, ఊంజల్‌సేవను రద్దు చేశారు.

**పరదాలు విరాళం**

ఈ సందర్భంగా ఆలయానికి హైదరాబాదుకు చెందిన స్వర్ణకుమార్ రెడ్డి ఆరు పరదాలు, రెండు కురాళాలు, తిరుపతికి చెందిన సుధాకర్, జయ చంద్రారెడ్డి, అరుణ్ కుమార్ నాలుగు పరదాలు 25 హుండీ వస్త్రాలు విరాళంగా జేఈవో వీరబ్రహ్మంకు అందించారు.

**నవంబరు 28 నుంచి బ్రహ్మోత్సవాలు**

శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు నవంబరు 28 నుంచి డిసెంబరు 6వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నాయి. ఇందుకోసం నవంబరు 27వ తేదీన ఉదయం లక్ష కుంకుమార్చన, సాయంత్రం అంకురార్పణ నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు ఆలయ మాడ వీధుల్లో వాహనసేవలు జరుగనున్నాయి.


# హార్డ్ వర్క్ వద్దు స్మార్ట్ వర్క్ చేయండి

## ఉద్యోగులకు చంద్రబాబు సూచన



**విశ్వంభర, అమరావతి:** ఉద్యోగులు హార్డ్ వర్క్ చేయొద్దు.. స్మార్ట్ వర్క్ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. రాజ్యాంగ దినోత్సవ సభలో ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులతో మాట్లాడుతూ చంద్రబాబు ఈ వ్యాఖ్యలు చేశారు. గతంలో ఎక్కువ గంటలు కార్యాలయంలో ఉండి పనిచేసేవారు. ప్రస్తుతం.. ఆధునిక సాంకేతికత అప్‌డేట్ అవుతోన్న కారణంగా ఆ అవసరం లేదని సీఎం అన్నారు. సాయంత్రం 6 గంటల తరువాత ఉద్యోగులెవరూ కార్యాలయాల్లో ఉండొద్దనేది ఇప్పుడు ఈ ప్రభుత్వ విధానం అని చెప్పారు. సచివాలయ ఉద్యోగులు సహా ఏ ప్రభుత్వ ఉద్యోగి కూడా ఎక్కువ గంటలు కష్టపడాల్సిన పనిలేదన్నారు. స్మార్ట్ వర్క్ ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చున్నారు. తాను కూడా సచివాలయం నుంచి సాయంత్రం 6 గంటలకే ఇంటికి వెళ్లేందుకు ప్రయత్నం చేస్తున్నానని సీఎం పేర్కొన్నారు.

# తిరుమలలో జనవరి 10 నుంచి 19 వరకు వైకుంఠ ద్వార దర్శనం



**విశ్వంభర, తిరుమల :** తిరుమలలో జనవరి 10 నుంచి 19వ తేది వరకు వైకుంఠ ద్వార దర్శనాలకు టీటీడీ ఏర్పాట్లు చేస్తుంది. ఇందుకు నలభై రోజులు మాత్రమే ఉండటంతో సన్నద్ధం కావాలని ఆయా శాఖల అధికారులతో టీటీడీ అడిషనల్ ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి సమీక్షా నిర్వహించారు. పది రోజుల వైకుంఠ ద్వార దర్శనాల్లో సాధారణ భక్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.సాధారణ భక్తులకు ఎక్కువ దర్శన సమయం కల్పించేలా జారీ చేయాల్సిన టికెట్ల కోటా, ఇతర అంశాలపై మరో రెండు వారాల్లో మరో సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రోటోకాల్ వీఐపీలు మినహా ఆర్జిత సేవలు, చంటి బిడ్డలు, వృద్ధులు, దివ్యాంగులు, ఆర్మీ, ఎన్ఆర్ఐ దర్శనాలు రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు. జనవరి 10న స్వర్ణ రథం ఊరేగింపు, 11న చక్ర స్నానం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.


# రాంగోపాల్ వర్మ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా



**విశ్వంభర, అమరావతి:** ప్రముఖ టాలీవుడ్ డైరెక్టర్ రాంగోపాల్ వర్మ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. ఈనెల 27కు ఏపీ హైకోర్టు విచారణను వాయిదా వేసింది. ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్‌పై ఫొటోలు మార్ఫింగ్ చేసి ఎక్స్‌లో పోస్ట్ చేసిన వ్యవహారంలో రాంగోపాల్ వర్మపై ఒంగోలు, విశాఖ, గుంటూరు జిల్లాలో కేసులునమోదయ్యాయి.

## రఘురామను చిత్రహింసలు పెట్టిన కేసులో

# విజయ్‌పాల్ అరెస్టు




**విశ్వంభర, ఒంగోలు:** మాజీ ఎంపీ, మాజీ ఎంపీ, ప్రస్తుత ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజును కస్టడీలో చిత్రహింసలు పెట్టిన కేసులో నిందితుడిగా ఉన్న సీఐడీ విశ్రాంత అదనపు ఎస్పీ ఆర్.విజయ్‌పాల్‌ను పోలీసులు అరెస్టు చేశారు. విజయ్‌పాల్ మంగళవారం ఉదయం ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్ ఎదుట విచారణకు హాజరయ్యారు. ఉదయం 11 గంటల నుంచి విచారించిన పోలీసులు రాత్రి 7గంటల సమయంలో అరెస్టు చేసినట్టు సమాచారం. రఘురామకృష్ణరాజుపై కస్టోడియల్ హింస కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ విజయపాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. దీంతో ఆయన ఇవాళ ప్రకాశం జిల్లా పోలీసుల ఎదుట విచారణకు హాజరయ్యారు. సుదీర్ఘ విచారణ తర్వాత అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు.

**ఏం జరిగిందంటే?**

2021లో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌పై రఘురామకృష్ణరాజు అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఆయనపై సీఐడీ అధికారులు కేసు నమోదు చేశారు. ఆ తర్వాత హైదరాబాద్‌లోని రఘురామ నివాసం నుంచి ఆయన్ను బలవంతంగా గుంటూరు సీఐడీ ప్రాంతీయ కార్యాలయానికి తరలించారు. ఆ రోజు రాత్రి కస్టడీలో తనపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి హత్యాయత్నానికి పాల్పడ్డారని రఘురామ ఈ ఏడాది జూలై 11న గుంటూరు నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి సీఎం జగన్‌తో పాటు నాటి సీఐడీ చీఫ్ పీవీ సునీల్‌కుమార్, నిఘా విభాగం అధిపతి పీఎస్ఆర్ ఆంజనేయులు, సీఐడీ అదనపు ఎస్పీ విజయపాల్, జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రభావతి తదితరులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలన్న విజయపాల్ అభ్యర్థనను హైకోర్టు తిరస్కరించింది. దీంతో అక్టోబరు 1న విజయపాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టు ఆయనకు రక్షణ కల్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు చర్యలు తీసుకోవద్దని సూచించింది. సోమవారం ఆ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ప్రసన్న బీ వరాలేతో కూడిన ద్విసభ్య ధర్మాసనం... ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం విజయపాల్ పిటిషన్‌ను కొట్టివేసింది.

## న్యాయవ్యవస్థ ప్రతిపక్ష

# పాత్ర పోషించదు

## మాజీ సీజేఐ చంద్రచూడ్



**ఢిల్లీ:** న్యాయవ్యవస్థ అసెంబ్లీ, పార్లమెంట్‌లలో ప్రతిపక్షాల పాత్ర పోషించాలని భావించకూడదని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ వ్యాఖ్యానించారు. ఓ ఆంగ్ల వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈవిషయాన్ని వెల్లడించారు. ఇటీవల ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. న్యాయవ్యవస్థ పాత్రను ప్రతిపక్షాలు భుజాన వేసుకొన్నాయన్నారు. ఈనేపథ్యంలో చంద్రచూడ్ వ్యాఖ్యలు వెలువడటం గమనార్హం. ''నేను ఈ వివాదంలో ప్రతిపక్ష నేతలతో స్వరం కలపాలనుకోవడం లేదు. ఎందుకంటే ఆ విషయం మాట్లాడేందుకు నేను ఇక్కడికి రాలేదు. ఒక్క విషయం చెప్పదల్చుకొన్నాను. పార్లమెంట్, అసెంబ్లీల్లో ప్రతిపక్షాల పాత్రను న్యాయవ్యవస్థ పోషించాలని ప్రజలు భావించకూడదు. శాసనవ్యవస్థలో న్యాయవ్యవస్థ ప్రతిక్షంలా ఉండాలనేదే తప్పుడు భావన. మేము ఇక్కడ ఉన్నది చట్టాలను సమీక్షించడానికే. కార్యనిర్వాహక వర్గం చర్యలు చట్టాలకు లోబడి ఉన్నాయో, లేదో సమీక్షించే బాధ్యతలను మేం నిర్వహిస్తున్నాం. రాజకీయ ప్రతిపక్షాలకు ప్రజాస్వామ్యంలో ఓ ప్రత్యేక స్థానం ఉంది. ప్రజలు ఏం చేస్తున్నారంటే.. న్యాయ వ్యవస్థలను వాడుకొంటున్నారు. దాని భుజాల మీద నుంచి తుపాకీ కాలుస్తున్నారు. కోర్టులను రాజకీయ ప్రతిపక్షాల కేంద్రంగా మారుస్తున్నారు'' అని చంద్రచూడ్ వ్యాఖ్యానించారు. ఇటీవల ఓ సందర్భంలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ ''మేమే ఒంటరిగా మీడియా, దర్యాప్తు సంస్థల, న్యాయవ్యవస్థల పాత్రను పోషిస్తున్నాం. ఇది భారత్‌కు సంబంధించిన నిజం'' అని పేర్కొన్నారు. రాజకీయ నాయకులతో న్యాయమూర్తులు కలిసినప్పుడు సోషల్ మీడియాలో జరిగే చర్చపై చంద్రచూడ్ స్పందించారు. సాధారణంగా అధికారిక సమావేశాల్లో ప్రతిపక్ష, ప్రభుత్వ నేతలతో కలిసినప్పుడు కొద్దిసేపు పిచ్చాపాటి ముచ్చట్లు సహజమన్నారు. ప్రధాని మోదీ తన ఇంటికి రావడం కొత్తేమీ కాదని.. గతంలో చాలామంది పీఎంలు వివిధ సందర్భాల్లో న్యాయమూర్తుల ఇళ్లకు వెళ్లారన్నారు.

## తదుపరి సీఎం ఫడణవీస్ కావచ్చు


### సంజయ్ రౌత్ కీలక వ్యాఖ్యలు



**ముంబయి:** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమి విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో ఆ రాష్ట్రానికి తదుపరి ముఖ్యమంత్రి ఎవరనే దానిపై చర్చలు కొనసాగుతున్నాయి. కాగా ఈ విషయంపై శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఏక్‌నాథ్ శిందే తన పదవికి రాజీనామా చేశారని.. తదుపరి సీఎం ఫడణవీస్‌నే కావచ్చని అభిప్రాయం వ్యక్తంచేశారు. తమ పార్టీల కోసం ఏక్‌నాథ్ శిందే, అజిత్ పవార్‌లు సొంతంగా నిర్ణయాలు తీసుకోలేరని అన్నారు. ఈ రెండు పార్టీలు ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షా కనుసన్నల్లోనే నడుస్తాయని.. ప్రస్తుతం భాజపా మెజారిటీ సాధించింది కాబట్టి వారికి అవకాశం ఉండకపోవచ్చని పేర్కొన్నారు. మహారాష్ట్ర 14వ అసెంబ్లీ పదవీకాలం మంగళవారంతో ముగియనుంది. దీంతో ఆలోపు కొత్త ప్రభుత్వం ఏర్పాటుకాకపోతే రాష్ట్రపతి పాలన విధించాల్సి వస్తుందన్న వార్తలొచ్చాయి. వాటిని అధికారులు ఖండించినప్పటికీ.. కొత్త సీఎం ఎవరనే దానిపై ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. ఒకవేళ, భాజపాకు అవకాశం వస్తే దేవేంద్ర ఫడణవీస్ ముఖ్యమంత్రి అవుతారా అన్న దానిపైనా స్పష్టత లేదు. ఇదే విధంగా 2019లోనూ భాజపా అతిపెద్ద పార్టీగా అవతరించినా సీఎం విషయంలో విభేదాలు తలెత్తాయి. మరో ప్రత్యామ్నాయం లేకపోవడంతో బీజేపీ ఉద్ధవ్ ఠాక్రే కాంగ్రెస్, ఎన్సీపీలతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఈసారి కూడా భాజపా అతిపెద్ద పార్టీ అయినా మెజారిటీకి ఇంకా కొంత దూరంలోనే నిలిచిపోయింది. అయితే ఈసారి అజిత్ రూపంలో మద్దతుదారు ఉన్నారు.

## అదానీ సంస్థ లంచం ఇచ్చిన వ్యవహారంలో

# వైఎస్ జగన్‌పై ఏసీబీకి ఫిర్యాదు



**విశ్వంభర, అమరావతి :** వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై ఏసీబీకి ఫిర్యాదు అందింది. అదానీ సంస్థ లంచం ఇచ్చిన వ్యవహారంపై సెంటర్ ఫర్ లిబర్టీ సంస్థ వ్యవస్థాపకుడు చక్రవర్తి ఈ మేరకు మంగళవారం ఏసీబీకి ఫిర్యాదు చేశారు. జగన్‌కు రూ. 1,750 కోట్లు లంచం ఇచ్చినట్లు ఫిర్యాదుదారుడు ఆరోపించారు.సెకీతో అదానీ కంపెనీ విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందంపై విచారణ జరపాలని ఆయన కోరారు. జగన్‌కు అదానీ సంస్థ లంచం ఇచ్చినట్లు అమెరికా విచారణలో తేలిందని వెల్లడించారు. ఒప్పందానికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

**విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలి : షర్మిల**

అదానీతో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో చేసుకున్న విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. అక్రమ డీల్‌తో 25 ఏళ్ల పాటు ఆంధ్ర రాష్ట్ర ప్రజలపై పడే భారం రూ.1.50 లక్షల కోట్లు అని.. ఈ డీల్‌ను వెంటనే రద్దు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడికి సుదీర్ఘ లేఖను రాశారు. అదానీతో జగన్ చేసుకున్నది అక్రమ ఒప్పందం అని షర్మిల ఆరోపించారు. దీనివల్ల 25 ఏళ్ల పాటు ఆంధ్ర రాష్ట్ర ప్రజలపై పడే భారం 1.50 లక్షల కోట్లు అని అన్నారు. విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందంలో అదానీ నుంచి రూ.1750 కోట్ల ముడుపులు అందుకున్న జగన్‌పై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సీబీఐతో లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

# మహారాష్ట్ర సీఎం పదవికి శిందే రాజీనామా



**ముంబయి:** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమి ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఏక్‌నాథ్ శిందే తన పదవికి రాజీనామా చేశారు. ఈమేరకు మంగళవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌కు తన రాజీనామా పత్రాన్ని సమర్పించారు. మహారాష్ట్రలోని 14వ అసెంబ్లీ పదవీకాలం మంగళవారంతో ముగియడంతో ఈ పరిణామం చోటుచేసుకుంది. మరోవైపు తదుపరి సీఎంపై స్పష్టత వచ్చేంతవరకు ఆపధర్మ ముఖ్యమంత్రిగా శిందే వ్యవహరించనున్నారు. మహారాష్ట్ర ఎన్నికల్లో మొత్తం 288 స్థానాలకు గాను 234 స్థానాలతో మహాయుతి కూటమి ఘన విజయం అందుకుంది. ప్రతిపక్ష మహావికాస్ అఘాడీ (ఎంవీఏ) 48 సీట్లకే పరిమితమైంది. ఈనేపథ్యంలో బీజేపీ నుంచే ముఖ్యమంత్రి అభ్యర్థి ఉండాలని ఆ పార్టీ అధిష్ఠానం అంటుండగా.. ఏక్‌నాథ్ శిందేనే కొనసాగించాలని శివసేన పట్టుబడుతుంది. దీంతో సీఎం బాధ్యతలు ఎవరు స్వీకరిస్తారనే దానిపై స్పష్టత కొరవడింది.


# బ్రిటీషోళ్లు కూడా ఇన్ని కేసులు పెట్టలేదు

- రెడ్‌బుక్ రాజ్యాంగంపై అంబటి రాంబాబు సీరియస్



**విశ్వంభరః అమరావతి:** వైసీపీ హయాంలో అప్పటి సీఎం జగన్‌కు అదానీ సంస్థ లంచం ఇచ్చిన వ్యవహారంపై ఏసీబీకి ఫిర్యాదు అందింది. సెంటర్ ఫర్ లిబర్టీ సంస్థ వ్యవస్థాపకుడు నల్లమోతు చక్రవర్తి ఫిర్యాదు చేశారు. జగన్‌కు అదానీ సంస్థ రూ.1,750కోట్ల లంచం ఇచ్చినట్లు అమెరికా ఏజెన్సీ విచారణలో తేలిందని అందులో ఆయన పేర్కొన్నారు. సెకితో అదానీ కంపెనీ ఒప్పదంపై విచారణ జరపాలని.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.బ్రూట్ మెజారిటీ వచ్చింది కాబట్టి తమకు తిరుగులేదని.. పోలీసులు తాము ఏం చెబితే అది చేయాలన్నట్లుగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుందని అంబటి రాంబాబు తెలిపారు. ఎవర్ని పట్టుకురావాలంటే వారిని పోలీసులు పట్టుకురావాలి.. ఎవర్ని లోపల వేయమంటే వాళ్లను లోపల వేయాలన్నట్లుగా నడుస్తోందని విమర్శించారు. ఒక్కొక్క వ్యక్తి మీద ఒకటి రెండు కేసులు కాదు.. 15 కేసులు, 20 కేసులు, 30 కేసులు అని పోలీస్ స్టేషన్లు, న్యాయస్థానాలు తిప్పుతూ హింసిస్తున్నారని మండిపడ్డారు. బహూశా బ్రిటీష్ వారి పరిపాలన చేసే రోజుల్లో కూడా స్వాతంత్య్రం కోసం పోరాడిన వారిపై ఇన్ని కేసులు పెట్టి ఉంటారని అనుకోవడం లేదని ఎద్దేవా చేశారు.మీడియా, సోషల్‌మీడియాపై అణిచివేత ధోరణిలో కూటమి ప్రభుత్వ నేతలు వ్యవహరిస్తున్నారని అంబటి రాంబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రెడ్‌బుక్ రాజ్యాంగానికి మరి మనం సమాధానం చెప్పుకోవాల్సి వస్తుందని అన్నారు. మన కంటే ముందుగా దాని రచయిత నారా లోకేశ్ ఈ సమాజానికి చెప్పుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్‌లో ఆయన దోషిగా నిలబడాల్సి వస్తుందని చెప్పారు.

# ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన ఆర్బీఐ గవర్నర్



**ఢిల్లీ:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ శక్తికాంత దాస్ ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఆర్బీఐ అధికార ప్రతినిధి ఈ విషయాన్ని మీడియాకు వెల్లడించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉందని చెప్పారు.ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ మంగళవారం ఉదయం స్వల్ప అస్వస్థతకు గురికావడంతో చెన్నైలోని అపోలో ఆస్పత్రిలో చేరారు. చికిత్స అనంతరం ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు ప్రకటించారు. కొన్ని గంటల పరిశీలన అనంతరం సాయంత్రం ఆయనను ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశారు.

## హైబ్రిడ్ మోడల్‌ను అంగీకరించేలా
# పాక్‌కు ఐసీసీ ఆఫర్!

**ఇస్లామాబాద్:** వచ్చే ఏడాది ఛాంపియన్స్ ట్రోఫీని హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహించేలా పాక్‌ను ఒప్పించేందుకు అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఈక్రమంలో పాకిస్థాన్ క్రికెట్ బోర్డ్ తమ ప్రతిపాదనను అంగీకరిస్తే.. ఆర్థిక ప్రోత్సాహకాలు పెంచుతామని హామీ ఇచ్చినట్లు సమాచారం. ఈ టోర్నీ నిమిత్తం తాము పాక్‌కు వెళ్లలేమని భారత్ ఇప్పటికే ఐసీసీకి సమాచారం ఇవ్వడంతో.. ఇప్పటివరకు షెడ్యూల్‌ను ప్రకటించలేదు. నేడు ఐసీసీ బోర్డు సభ్యులు భేటీ అయి పాక్‌ను ఒప్పించేందుకు సిద్ధమయ్యారు. ''హైబ్రిడ్ మోడల్‌లో టోర్నీని నిర్వహించేందుకు పాక్ సిద్ధంగా లేదు. ఈ చిక్కుముడిని విప్పేందుకు వారికి ఆర్థిక ప్రోత్సాహకాలు కూడా ఆఫర్ చేశాము. భారత్‌తో జరిగే మ్యాచ్‌లను యూఏఈ వేదికగా నిర్వహించాలని, ఒకవేళ టీమ్ ఇండియా ఫైనల్స్‌కు వస్తే ఆ మ్యాచ్‌ను దుబాయ్‌లో ఏర్పాటుచేయాలని ప్రతిపాదించాము'' అని ఐసీసీ వర్గాలు వెల్లడించాయి. నేడు భేటీ ముగిశాక దీనిపై స్పష్టత వస్తుందని తెలిపాయి. మరోవైపు పాక్ మాత్రం ఇప్పటివరకు జరిగిన ప్రయత్నాలకు సానుకూలంగా స్పందించలేదు. ఆడటం.. ఆడకపోవడం భారత్ సమస్య అని ఆ దేశం వాదిస్తోంది. మిగిలిన ఆరు జట్లకు లేని ఇబ్బంది భారత్‌కు ఎందుకని ప్రశ్నిస్తోంది. ఒకవేళ తాము హైబ్రిడ్ మోడల్‌కు అంగీకరించినా.. గ్రూప్ దశలోని భారత్-పాక్ మ్యాచ్, ఫైనల్స్‌ను లాహోర్‌లో నిర్వహించాలని పట్టుబడుతోందని ఐసీసీ వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు సెమీస్, ఫైనల్స్ సహా తాము ఆడే అన్ని మ్యాచ్‌లు దుబాయ్‌లోనే నిర్వహించాలని భారత్ పట్టుబడుతోంది. ఈ అంశంపై పీసీబీ ఛైర్మన్ ఇంతవరకు స్పందించలేదు.

## అత్యవసరంగా స్వదేశానికి బయలుదేరిన కోచ్ గౌతం గంభీర్

**పెర్త్:** భారత క్రికెట్ జట్టు ప్రధాన కోచ్ గౌతం గంభీర్.. ఆస్ట్రేలియా పర్యటన నుంచి ఆకస్మికంగా స్వదేశానికి బయలుదేరారు. కుటుంబసభ్యులతో కలిసి ఇవాళ ఆయన ఇండియాకు రిటర్న్ అయ్యారు. అత్యవసరమైన వ్యక్తిగత కారణాలతో గంభీర్.. స్వదేశానికి బయలుదేరినట్లు తెలుస్తోంది. డిసెంబర్ 6వ తేదీన అడిలైడ్‌లో జరగనున్న రెండవ టెస్టుకు ముందు.. మళ్లీ గంభీర్ జట్టుతో కలవనున్నట్లు బీసీసీఐ వర్గాల ద్వారా వెల్లడైంది. నవంబర్ 30 నుంచి కేన్‌బెరాలో జరగనున్న వార్మప్ మ్యాచ్‌కు దూరం కానున్నారు.పెర్త్‌లో జరిగిన తొలి టెస్టులో బుమ్రా నేతృత్వంలోని ఇండియన్ జట్టు భారీ విజయాన్ని నమోదు చేసిన విషయం తెలిసిందే. అయితే బుధవారం ఆ జట్టు పెర్త్ నుంచి కేన్‌బెరా బయలుదేరుతుంది. అక్కడ ఆ దేశ ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్ ఇచ్చే ప్రత్యేక విందులో భారత జట్టు క్రికెటర్లు పాల్గొంటారు. ఇక రెండవ టెస్టు మ్యాచ్ డే అండ్ నైట్ గేమ్ కావడంతో.. భారత జట్టు ఆ మ్యాచ్ కన్నా ముందే ప్రాక్టీస్ మ్యాచ్‌లో ఆడనున్నది. రెండో టెస్టు కోసం పింక్ కలర్ కోకాబురా బంతిని వాడనున్నారు.ప్రైమ్ మినిస్టర్స్ లెవన్ జట్టుతో జరిగే మ్యాచ్‌కు భారత్ సిద్ధమైంది. ప్రైమ్ మినిస్టర్స్ లెవన్ జట్టుకు జాక్ ఎడ్వర్డ్స్ నాయకత్వం వహిస్తున్నాడు. ఆ జట్టు పూర్తిగా యువకులతో నిండి ఉన్నది. స్కాట్ బోలాండ్, మాథ్యూ రెన్‌షా కూడా ఆ జట్టులో ఉన్నారు. అనధికార మ్యాచ్ కావడం వల్ల.. రెండు జట్లూ బ్యాటింగ్, బౌలింగ్ చేసే రీతిలో ప్రాక్టీస్ గేమ్ కొనసాగనున్నది.

# 13 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ.. ఐపీఎల్‌లో ఆడేందుకు అర్హుడా?



**ముంబయి:** ఐపీఎల్ మెగా వేలంలో 13 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ చరిత్ర సృష్టించాడు. వేలంలో అమ్ముడుపోయిన అతిపిన్న వయస్సు ఆటగాడు రికార్డు సృష్టించాడు. బీహార్‌కు చెందిన ఈ కుర్రాడు రూ.1.10 కోట్ల ధర పలకడం విశేషం. దిల్లీతో పోటీపడి మరీ అతణ్ని రాజస్థాన్ రాయల్స్ దక్కించుకుంది. అయితే, క్రికెట్ అభిమానుల్లో ఇప్పుడో ప్రశ్న మెదులుతోంది. అదేంటంటే.. 13 ఏళ్ల వైభవ్ ఐపీఎల్‌లో ఆడేందుకు అర్హుడా? అసలు ఈ టోర్నీలో ఆడేందుకు వయసు నిబంధన ఉందా?. ఐపీఎల్‌లో అధికారికంగా ఆడేందుకు కనీస వయసు నిబంధన లేదు. ఆటగాళ్ల సంసిద్ధత పై నిర్ణయాలను ఫ్రాంచైజీలకు వదిలేశారు. ప్రస్తుతం 13 నెలల 8 నెలల వయసు ఉన్న వైభవ్ సూర్యవంశీ 2025 ఐపీఎల్ సీజన్ ప్రారంభమయ్యే నాటికి 14 ఏళ్లు పూర్తి చేసుకుంటాడు. వచ్చే సీజన్‌లో రాజస్థాన్ అతడిని ఆడించే అవకాశాలు తక్కువే. కానీ, రాజస్థాన్ కోచింగ్ బృందంలో ఉన్న రాహుల్ ద్రవిడ్, కుమార సంగక్కర వంటి దిగ్గజ ఆటగాళ్లతో డ్రెస్సింగ్ రూమ్‌లో పాలుపంచుకోవడం వైభవ్ కెరీర్‌కు ఎంతగానో ఉపయోగపడుతుంది.

**అంతర్జాతీయ క్రికెట్‌లో నిబంధనలు ఇలా..**

అంతర్జాతీయ క్రికెట్‌లో ఆడటానికి కనీస వయసు నిబంధన ఉంది. ఇంటర్నేషనల్ లెవల్‌లో మ్యాచ్‌లు ఆడే ఆటగాళ్లకు కనీసం 15 ఏళ్ల వయస్సు ఉండాలి. ఐసీసీ 2020లో ఈ నిబంధనను అమల్లోకి తీసుకువచ్చింది. అయితే, అసాధారణమైన సందర్భాల్లో క్రికెట్ బోర్డులు 15 ఏళ్లలోపు ఆటగాళ్లను తమ దేశానికి ప్రాతినిధ్యం వహించడానికి ఐసీసీ నుంచి ప్రత్యేక అనుమతిని అభ్యర్థించవచ్చు. 1996 - 2005 మధ్య పాకిస్థాన్ తరఫున ఏడు టెస్టులు, 16 వన్డేలు ఆడిన హసన్ రజా అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన అతి పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించాడు. అతను 14 సంవత్సరాల 227 రోజుల వయసులో టెస్టుల్లోకి అరంగేట్రం చేశాడు. అప్పటికీ ఐసీసీ నిబంధనలు లేకపోవడం గమనార్హం.

# ఆ ప్రయాణం అద్భుతం

- **దిల్లీ జట్టును వీడడంపై పంత్ ఎమోషనల్ పోస్టు**



**దిల్లీ:** ఐపీఎల్ మెగా వేలంలో యువ ఆటగాడు రిషభ్ పంత్ అందరి దృష్టిని ఆకర్షించాడు. ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక ధరకు అమ్ముడుపోయిన ఆటగాడిగా నిలిచాడు. తొమ్మిదేళ్లుగా దిల్లీ క్యాపిటల్స్‌లో కొనసాగిన పంత్.. ఇకపై లఖ్‌నవూ తరఫున బరిలోకి దిగనున్నాడు. ఈనేపథ్యంలోనే దిల్లీ జట్టును వీడడంపై స్పందించిన రిషభ్ పంత్.. 'ఎక్స్' (ట్విటర్) వేదికగా ఎమోషనల్ పోస్టు పెట్టాడు. ''యుక్త వయసులో నేను దిల్లీ క్యాపిటల్స్‌లో చేరాను. మైదానంలో ఎన్నో ఉత్కంఠభరితమైన క్షణాలు ఉన్నాయి. ఇక్కడ ఎంతో నేర్చుకున్నాను. అది నా అభివృద్ధికి సహాయపడింది. దిల్లీ జట్టుతో తొమ్మిదేళ్ల నా ప్రయాణం ఎంతో అద్భుతం. ఈ జర్నీ నాకెంతో విలువైంది. జీవితంలో క్లిష్ట సమయాల్లో అభిమానులు ఎంతో అండగా ఉన్నారు. నేను ముందుకుసాగుతున్నప్పటికీ.. మీ ప్రేమాభిమానాలు నా హృదయంలో ఎప్పటికీ ఉంటాయి. మైదానంలో మిమ్మల్ని ఉత్సాహపరిచేందుకు ప్రయత్నిస్తూనే ఉంటా. నా ప్రయాణాన్ని ప్రత్యేకంగా మార్చినందుకు మీ అందరికీ ధన్యవాదాలు'' అంటూ ఎమోషనల్ పోస్టు పెట్టాడు.పంత్ పోస్టు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కాగా.. ఐపీఎల్ వేలంలో రిషభ్ పంత్‌పై లఖ్‌నవూ కాసుల వర్షం కురిపించిన సంగతి తెలిసిందే. అతడి కోసం లఖ్‌నవూ, బెంగళూరు తీవ్రంగా పోటీపడ్డాయి. చివరకు లఖ్‌నవూ రూ.27 కోట్ల రికార్డు ధరకు అతడిని దక్కించుకుంది. దీంతో లఖ్‌నవూ జట్టులో చేరిన పంత్.. దిల్లీ క్యాపిటల్స్‌ను వీడాల్సి వచ్చింది. ఈక్రమంలోనే పంత్ పెట్టిన పోస్టు అభిమానుల మనసును హత్తుకుంది.

# స్టార్ ఆటగాళ్లకు షాకిచ్చిన ఫ్రాంచైజీలు

## అన్‌సోల్డ్‌గా మిగిలిన టాప్ ప్లేయర్లు వీరే




**ముంబయి:** అంచనాలకు మించి సాగిన ఐపీఎల్ మెగా వేలం ముగిసింది. తొలిరోజే అగ్రశ్రేణి ఆటగాళ్ల కోసం భారీగా ఖర్చుపెట్టిన ఫ్రాంచైజీలు.. సోమవారం ఆచితూచి వ్యవహరించాయి. జట్టును బలోపేతం చేసుకునే దిశగా, ఆటగాళ్ల నైపుణ్యాలను బట్టి ఎంపిక చేసుకున్నాయి. రెండో రోజు భారత పేసర్లకు మంచి డిమాండ్ ఏర్పడింది. వేలంలో 182 మంది ఆటగాళ్లను కొనుగోలు చేసిన 10 ఫ్రాంచైజీలు ఇందుకు రూ.639.15 కోట్లు ఖర్చుపెట్టాయి. ఇందులో 62 మంది విదేశీ ఆటగాళ్లున్నారు. అయితే, పలువురు స్టార్ ఆటగాళ్లకు ఫ్రాంచైజీలు షాకిచ్చాయి. వారిని కనీస ధరకు కూడా కొనుగోలు చేయడానికి ఫ్రాంఛైజీలు ముందుకురాలేదు. ఈ జాబితాలో భారత ఆటగాళ్లతోపాటు విదేశీ ప్లేయర్లున్నారు.

**ఆ ఆటగాళ్లు వీరే...**

డేవిడ్ వార్నర్ - రూ.2 కోట్లు
కేన్ విలియమ్సన్ - రూ.2 కోట్లు
శార్దూల్ ఠాకూర్ - రూ.2 కోట్లు
మయాంక్ అగర్వాల్ - రూ. కోటి
పృథ్వీ షా - రూ.75 లక్షలు
సర్ఫరాజ్ ఖాన్ - రూ.75 లక్షలు
ఉమేశ్ యాదవ్ - రూ.2 కోట్లు
ఫిన్ అలెన్ - రూ.2 కోట్లు
జానీ బెయిర్‌స్టో - రూ.2 కోట్లు
డేవాల్డ్ బ్రెవిస్ - రూ.75 లక్షలు
బెన్ డకెట్ - రూ.2 కోట్లు
పాథుమ్ నిశాంక - రూ.75 లక్షలు
స్టీవ్ స్మిత్ - రూ.2 కోట్లు
పీయూష్ చావ్లా - రూ.50 లక్షలు
ముజీబుర్ రెహ్మాన్ - రూ.2 కోట్లు
అదిల్ రషీద్ - రూ.2 కోట్లు
అకీలా హోస్సేన్ - రూ.1.50 కోట్లు
కేశవ్ మహరాజ్ - రూ.75 లక్షలు
ముస్తాఫిజుర్ రెహ్మాన్ - రూ.2 కోట్లు
నవీనుల్ హక్ - రూ.2 కోట్లు
అల్జారీ జోసెఫ్ - రూ.2 కోట్లు
నవదీప్ సైని - రూ.75 లక్షలు
శివమ్ మావి - రూ.75 లక్షలు
దిల్షాన్ మధుశంక - రూ.75 లక్షలు
ఆడమ్ మిల్నే - రూ.2 కోట్లు
క్రిస్ జోర్డాన్ - రూ.2 కోట్లు
డారిల్ మిచెల్ - రూ.2 కోట్లు
గాస్ అట్కిన్సన్ - రూ.2 కోట్లు
సికిందర్ రజా - రూ.1.50 కోట్లు
కైల్ మేయర్స్ - రూ.1.50 కోట్లు
మైకేల్ బ్రాస్‌వెల్ - రూ.1.50 కోట్లు
రోస్టన్ ఛేజ్ -రూ.75 లక్షలు
తబ్రైజ్ షంసి - రూ.2 కోట్లు
జాసన్ హోల్డర్ - రూ.2 కోట్లు
టామ్ లాథమ్ - రూ.1.50 కోట్లు
షకీబ్ అల్ హసన్ - రూ.కోటి
కృష్ణప్ప గౌతమ్ - రూ.కోటి
మహమ్మద్ నబీ - రూ.1.50 కోట్లు
టిమ్ సౌథీ - రూ.1.50 కోట్లు
షై హోప్ - రూ.1.25 కోట్లు
కేఎస్ భరత్ - రూ.75 లక్షలు
అలెక్స్ కేరీ - రూ.కోటి
లిటన్ దాస్ - రూ.75 లక్షలు
జోష్ లిటిల్ - రూ.75 లక్షలు
చరిత్ అసలంక - రూ.75 లక్షలు
దునిత్ వెల్లలాగె - రూ.75 లక్షలు
దాసున్ శనక - రూ.75 లక్షలు
యశ్ ధుల్ - రూ.30 లక్షలు
అన్మోల్‌ప్రీత్ సింగ్ - రూ.30 లక్షలు

# కేకేఆర్ కెప్టెన్‌గా అజింక్య రహానె?

**ముంబయి:** ఐపీఎల్ మెగా వేలం ముగిసింది. ఫ్రాంఛైజీలు జట్టును బలోపేతం చేసుకునే దిశగా, ఆటగాళ్ల నైపుణ్యాలను బట్టి ఎంపిక చేసుకున్నాయి. కోల్‌కతా నైట్‌రైడర్స్ మినహా దాదాపు అన్ని జట్లకు కెప్టెన్లు దొరికినట్లే. గతేడాది కేకేఆర్‌ను ఛాంపియన్‌గా నిలిపిన శ్రేయస్ అయ్యర్ ఈ సారి వేలంలోకి వెళ్లాడు. అతడిని వేలంలో పంజాబ్ రూ.26.75 కోట్లకు సొంతం చేసుకుంది. ప్రస్తుతం రసెల్, నరైన్ సీనియర్లుగా ఉన్నారు. కానీ, వీరిని కెప్టెన్ చేసే అవకాశాలు తక్కువ. ఇక, కొన్నాళ్ల నుంచి కేకేఆర్ తరఫున ఆడుతున్న వెంకటేశ్ అయ్యర్ తిరిగి దక్కించుకుంది. అతడి కోసం కోల్‌కతా ఏకంగా రూ.23.75 కోట్లు వెచ్చించింది. కానీ, అతడికి కెప్టెన్సీ అనుభవం లేదు. దీన్ని దృష్టిలో ఉంచుకునే చివరి నిమిషంలో అజింక్య రహానెను కేకేఆర్ కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. మొదట అన్‌సోల్డ్ అయిన రహానెను రెండో రోజు వేలంలో కనీస ధర రూ.1.75 కోట్లకు కోల్‌కతా తీసుకుంది. కెప్టెన్ కోసమే అతడిని కొనుగోలు చేసినట్లు క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. రహానె 2022లో కోల్‌కతా తరఫున ఏడు మ్యాచ్‌లు ఆడి 133 పరుగులు చేశాడు. ఈ నేపథ్యంలో కోల్‌కతా కెప్టెన్సీ అంశంపై కేకేఆర్ ఫ్రాంఛైజీ సీఈవో వెంకీ మైసూర్ స్పందించారు. రహానెను కెప్టెన్ చేయాలా? వద్దా అనే దానిపై ఫ్రాంఛైజీలో భాగస్వాములుగా ఉన్న వాటాదారులందరూ అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని తుది నిర్ణయం తీసుకుంటారని ఆయన తెలిపారు. వేలంలో తమ ప్లాన్‌ను సరిగ్గా అమలు చేశామని, జట్టు చాలా అద్భుతంగా ఉందని వెంకీ మైసూర్ పేర్కొన్నారు. అనుకున్న విధంగా అన్ని విభాగాల్లో మంచి ఆటగాళ్లు పొందినందుకు చాలా సంతోషంగా ఉందని తెలిపారు.

**కోల్‌కతా జట్టు:** వెంకటేశ్ అయ్యర్, రింకు సింగ్, వరుణ్ చక్రవర్తి, సునీల్ నరైన్, రసెల్, అన్రిచ్ నోకియా, హర్షిత్ రాణా, రమణ్‌దీప్ సింగ్, క్వింటన్ డికాక్, రఘువంశీ, స్పెన్సర్ జాన్సన్, రెహ్మానుల్లా గుర్బాజ్, మొయిన్ అలీ, వైభవ్ అరోరా, అజింక్య రహానె, రొవ్‌మన్ పావెల్, ఉమ్రాన్ మలిక్, మనీశ్ పాండే, అనుకుల్ రాయ్, లవ్‌నిత్ సిసోడియా, మయాంక్ మార్కండె.




# పోర్టబుల్ బ్యాటరీతో ₹39 వేలకే ఓలా కొత్త స్కూటర్!

**ముంబయి:** ప్రముఖ విద్యుత్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ తన వాహన శ్రేణిని మరింత విస్తరించింది. గిగ్, ఎస్1 జడ్ శ్రేణిలో కొత్త స్కూటర్లను లాంచ్ చేసింది. గిగ్ శ్రేణిలో ఓలా గిగ్ , ఓలా గిగ్+ (Ola Gig+) స్కూటర్లను ప్రకటించింది. వీటి ధరలు రూ.39,999, రూ.49,999గా నిర్ణయించింది. ఎస్1 జడ్ (Ola S1 Z) స్కూటర్ ధరను రూ.59,999గా, ఎస్1 జడ్+ స్కూటర్ ధరను రూ .64,999గా నిర్ణయించింది. రూ.499 చెల్లించి నేటి నుంచే వీటిని బుక్ చేసుకోవచ్చని ఓలా తెలిపింది. గిగ్ శ్రేణి వాహనాలు వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి, ఎస్1 జడ్ శ్రేణి వాహనాల డెలివరీ మే నుంచి ప్రారంభం కానున్నాయి.

**ఓలా గిగ్:** గిగ్ వర్కర్ల కోసం దీన్ని తీసుకొచ్చారు. తక్కువ దూరాల ప్రయాణానికి వీలుగా దీన్ని డిజైన్ చేశారు. 1.5 KWh రిమూవబుల్ బ్యాటరీతో వస్తున్న ఈ స్కూటర్.. సింగిల్ ఛార్జ్‌తో 112 కిలోమీటర్లు దూరం వెళ్తుంది. టాప్ స్పీడ్ 25kmph. ఇది బి2బి కొనుగోళ్లు, రెంటల్ కోసం అందుబాటులో ఉంటుంది.

**ఓలా గిగ్+:** దూర ప్రయాణాలు చేసే గిగ్ వర్కర్ల కోసం దీన్ని తీసుకొచ్చారు. దీని టాప్ స్పీడ్ 45kmph. ఇది 1.5kWh డ్యూయల్ బ్యాటరీ ప్యాక్‌తో వస్తోంది. సింగిల్ ఛార్జ్‌తో 81 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. రెండు బ్యాటరీలతో అయితే 157 కిలోమీటర్లు వెళ్లొచ్చు. దీన్ని కూడా బి2బి కొనుగోళ్లు, రెంటల్స్ కోసం అందుబాటులోకి తేనున్నారు.

**ఓలా ఎస్1 జడ్:** తక్కువ ధరలో వ్యక్తిగత అవసరాల కోసం రూపొందించిన స్కూటర్ ఇది. ఇది కూడా 1.5kWh చొప్పున డ్యూయల్ బ్యాటరీలతో వస్తోంది. సింగిల్ బ్యాటరీపై 75 కిలోమీటర్లు, రెండు బ్యాటరీలతో 146 కిలోమీటర్ల రేంజ్ ఇస్తుంది. 70 kmph టాప్‌స్పీడ్‌తో ప్రయాణించొచ్చు. ఎల్‌సీడీ డిస్‌ప్లే, ఫిజికల్ కీ. ఉంటుంది.



**ఓలా ఎస్1 జడ్+:** వ్యక్తిగత, కమర్షియల్ వినియోగం కోసం దీన్ని రూపొందించారు. ఇది కూడా 1.5kWh డ్యూయల్ బ్యాటరీతో వస్తోంది. ఐడీసీ రేంజ్ 75 కిలోమీటర్లు. రెండు బ్యాటరీలతో అయితే 146 కిలోమీటర్లు. టాప్ స్పీడ్ 70 kmph. ఫిజికల్ కీ, ఎల్‌సీడీ డిస్‌ప్లేతో వస్తోంది.

**ఓలా పవర్‌పాడ్:** గృహావసరాల కోసం పవర్ పాడ్‌ను ఓలా ఎలక్ట్రిక్ తీసుకొచ్చింది. దీంతో ఓలా పోర్టబుల్ బ్యాటరీని ఇన్వెర్టర్‌లా వాడుకోవచ్చు. 1.5kWh బ్యాటరీ సాయంతో 5 ఎల్ఈడీ బల్బులు, 3 సీలింగ్ ఫ్యాన్లు, 1 టీవీ, 1 మొబైల్ ఫోన్, 1 వైఫై రూటర్‌ను 3 గంటల పాటు వినియోగించుకోవచ్చని ఓలా తెలిపింది. విద్యుత్ సరఫరా కొరత ఎదుర్కొంటున్న వారికి ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొంది. దీని ధరను రూ.9,999గా కంపెనీ పేర్కొంది.

# నష్టాల్లో ముగిసిన మార్కెట్ సూచీలు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలు, వాణిజ్యపరమైన ఉద్రిక్తతల భయాలు మన మార్కెట్లపై ప్రభావం చూపాయి. తాను అధికారంలోకి రాగానే మెక్సికో, కెనడా, చైనా దిగుమతులపై సుంకాలు విధిస్తానని అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో గెలుపొందిన ట్రంప్ పేర్కొనడం ఇందుకు నేపథ్యం. దీనివల్ల ప్రపంచ వాణిజ్య సంబంధాలపై ప్రభావం పడే అవకాశం ఉందన్న ఆందోళనలు మదుపర్లను కలవరపెట్టాయి. దీంతో మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడంతో సూచీలు నష్టోయాయి. సెన్సెక్స్ ఉదయం 80,415.47 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 80,109.85) లాభాల్లో ప్రారంభమైంది. కాసేపటికే నష్టాల్లోకి జారుకుంది. రోజంతా ఒడుదొడుకులు ఎదుర్కొంది. చివరికి 105.79 పాయింట్ల నష్టంతో 80,004.06 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 27.40 పాయింట్ల నష్టంతో 24,194.50 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 84.33గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో అదానీ పోర్ట్స్, అల్ట్రాటెక్ సిమెంట్, సన్‌ఫార్మా, ఎన్టీపీసీ, మహీంద్రా అండ్ మహీంద్రా సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఏషియన్ పెయింట్స్, ఇన్ఫోసిస్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, టీసీఎస్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 73 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 2629 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.




**జొమాటో రూ.8500 కోట్ల క్యూఐపీ..**

ఫుడ్ డెలివరీ సంస్థ జొమాటో క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్ ద్వారా ద్వారా నిధులు సమీకరించేందుకు నిర్ణయించింది. సంస్థాగత మమదుపర్ల నుంచి ఈ నిధులను సమీకరించేందుకు ఒక్కో షేరు ఫ్లోర్ ప్రైస్‌ను రూ.265.91గా నిర్ణయించింది. ఈ విషయాన్ని జొమాటో కంపెనీ సోమవారం రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. ఇందుకు బోర్డు ఆమోదం తెలిపిందని పేర్కొంది. రూ.8,500 కోట్లు సమీకరించాలని గతంలో జొమాటో వెల్లడించింది. తన బ్యాలెన్స్ షీట్‌ను పటిష్ఠం చేసుకునేందుకే క్యూఐపీ చేపడుతున్నట్లు జొమాటో సీఈఓ దీపిందర్ గోయల్ తెలిపారు.


# ఉద్యోగులకు ఇన్ఫీ గుడ్‌న్యూస్..

## నవంబర్ వేతనంతో 85% బోనస్

**ముంబయి:** ప్రముఖ ఐటీ సేవల సంస్థ ఇన్ఫోసిస్ ఉద్యోగులకు గుడ్‌న్యూస్ చెప్పింది. అర్హులైన ఉద్యోగులకు సగటున 85 శాతం చొప్పున పనితీరు ఆధారిత బోనస్ చెల్లించేందుకు నిర్ణయించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో మెరుగైన ఫలితాలు ప్రకటించిన నేపథ్యంలో ఈ బోనస్‌ను ఇచ్చేందుకు నిర్ణయించింది. నవంబర్ నెల వేతనంతో పాటు ఈ బోనస్‌ను చెల్లించనుంది. సంబంధిత త్రైమాసికంలో ఉద్యోగి పనితీరు, సహకారం ఆధారంగా ఈ బోనస్ చెల్లింపులు చేయనుంది. బోనస్ చెల్లింపులకు సంబంధించి ఇప్పటికే ఉద్యోగులకు ఇన్ఫోసిస్ మెయిల్స్ పంపించింది. క్యూ2లో మెరుగైన వృద్ధిని నమోదు చేశామని, అందులో ఉద్యోగుల సహాయ సహకారాలు మరువలేనివని ఇన్ఫోసిస్ పేర్కొంది. ఇదే నిబద్ధతను ఉద్యోగులు మున్ముందూ కొనసాగించాలని ఆకాంక్షించింది. ఇన్ఫోసిస్ నిర్ణయం ద్వారా డెలివరీ, సేల్స్ యూనిట్‌లో పనిచేసే మిడ్, జూనియర్ లెవల్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో లబ్ధి పొందనున్నారని 'ఎకనమిక్ టైమ్స్' పేర్కొంది. సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో ఇన్ఫోసిస్ రూ.6506 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. ఆదాయం సైతం 5.1 శాతం వృద్ధితో రూ.40,986 కోట్లుగా నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వృద్ధి అంచనాలను సైతం 3.75 - 4.5 శాతంగా నమోదు కావొచ్చని పేర్కొంది.

# వొడాఫోన్ ఐడియాకు ఊరట..

## కేబినెట్ నిర్ణయంతో షేర్లు పైకి




**దిల్లీ:** టెలికాం రంగానికి సంబంధించి కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. టెలికాం కంపెనీలు బ్యాంక్ గ్యారెంటీ సమర్పించాల్సిన నిబంధనను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో టెలికాం కంపెనీలపై ఆర్థికంగా భారం తగ్గించినట్లయ్యింది. ముఖ్యంగా అప్పుల ఊబిలో కూరుకుపోయిన వొడాఫోన్ ఐడియా కంపెనీకి భారీ ఊరట ఇచ్చినట్లయ్యింది.2022కు ముందు నిర్వహించిన వేలంలో స్పెక్ట్రమ్ దక్కించుకున్న టెలికాం కంపెనీలు బ్యాంకు గ్యారెంటీలు సమర్పించాలన్న నిబంధనను కేబినెట్ తొలగించింది. వొడాఫోన్ ఐడియా సంస్థ.. 2025 అక్టోబర్ నుంచి 2026 సెప్టెంబర్‌ల మధ్య చెల్లించాల్సిన స్పెక్ట్రమ్ చెల్లింపులకు సంబంధించి సుమారు రూ.24,746.9 కోట్లు విలువైన బ్యాంకు గ్యారెంటీలను సమర్పించాల్సి ఉంది. సుమారు రూ.2.22 లక్షల కోట్లు అప్పుల్లో కూరుకుపోయిన ఆ కంపెనీకి ఇదో పెద్ద గుదిబండగా మారిన వేళ ఈ ఊరట లభించడం గమనార్హం. కేబినెట్ నిర్ణయం వేళ వొడాఫోన్ ఐడియా షేర్లు ఇవాళ రాణిస్తున్నాయి. ఇంట్రాడేలో 17 శాతం మేర లాభపడ్డాయి. మధ్యాహ్నం 1 గంట సమయానికి 12 శాతం లాభంతో రూ.7.78 వద్ద కొనసాగుతున్నాయి. ప్రభుత్వరంగ టెలికాం సంస్థ ఎంటీఎన్ఎల్ షేర్లు కూడా 4 శాతం లాభంతో రూ.49 వద్ద ట్రేడవుతున్నాయి. ఈ నిర్ణయం భారతీ ఎయిర్‌టెల్, రిలయన్స్ జియో వంటి టెలికాం కంపెనీలకూ ఊరటనిచ్చే అంశమని నిపుణులు పేర్కొంటున్నారు. మరోవైపు ఉదయం లాభాల్లో ప్రారంభమైన సూచీలు.. తర్వాత నష్టాల్లోకి జారుకున్నాయి. సెన్సెక్స్ 170 పాయింట్ల నష్టంతో 79,932.48 వద్ద ట్రేడవుతుండగా.. నిఫ్టీ 47 పాయింట్ల నష్టంతో 24,174.20 వద్ద కొనసాగుతోంది.

## మోసం చేశాడని యువతి ఫిర్యాదు..
# నటుడు శ్రీతేజ్‌పై పోలీసు కేసు

**హైదరాబాద్:** సినీ హీరో శ్రీతేజ్‌పై కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని ఓ యువతి గచ్చిబౌలి పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో శ్రీతేజ్‌పై జీరో ఎఫ్ఐఆర్‌తో కూకట్‌పల్లిలో కేసు నమోదు చేశారు. అతడిపై బీఎన్ఎస్ 69, 115(2),318(2) సెక్షన్ కింద కేసు నమోదైంది. గతంలోనూ కూకట్‌పల్లిలో బాధితురాలు ఫిర్యాదు చేసింది. 'వంగవీటి', 'లక్ష్మీస్ ఎన్టీఆర్', 'పుష్ప ది రైజ్', 'మంగళవారం', 'ధమాకా' తదితర సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న శ్రీతేజ్ ప్రస్తుతం అల్లు అర్జున్ కథానాయకుడిగా నటిస్తున్న 'పుష్ప ది రూల్'లో కీలక పాత్రలో నటిస్తున్నాడు. డిసెంబరు 5న ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఒకవైపు సినిమాల్లో నటిస్తూనే మరోవైపు వెబ్‌సిరీస్‌ల్లోనూ శ్రీతేజ్ రాణిస్తున్నాడు. 'పరంపర', '9 అవర్స్', 'బహిష్కరణ' వంటి సిరీసుల్లో నటించి మెప్పించాడు.



# పాటల రచయిత కుల శేఖర్ ఇకలేరు

**హైదరాబాద్:** ప్రముఖ సినీ గేయ రచయిత కుల శేఖర్ (53) ఇకలేరు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గాంధీ ఆస్పత్రిలో చేరారు. చికిత్స పొందుతూ మంగళవారం తుదిశ్వాస విడిచారు. సింహాచలంలో జన్మించిన కుల శేఖర్ పలు మీడియా సంస్థల్లో విలేకరిగా పని చేసి అనంతరం చిత్ర పరిశ్రమలోకి వెళ్లారు. ఆర్పీ పట్నాయక్ స్వరపరిచిన చాలా పాటలకు కుల శేఖర్ సాహిత్యం అందించారు. 'చిత్రం', 'జయం', 'ఔనన్న కాదన్నా' తదితర చిత్రాలకు ఆయనకు పని చేశారు. 'గాజువాక పిల్లా', 'రాను రాను అంటూనే చిన్నదో'లాంటి హుషారైన పాటలను రాసిన ఆయన 'అందమైన మనసులో ఇంత అలజడి ఎందుకో'లాంటి మనసుని హత్తుకునే గీతాలతోనూ అలరించారు. ఇతర సంగీత దర్శకులు పని చేసిన 'వసంతం', 'ఘర్షణ', 'సుబ్బు' తదితర చిత్రాలకూ కుల శేఖర్ పాటలు రాశారు.





# ఐదేళ్ల 'పుష్ప' ప్రయాణం.. ఎట్టకేలకు షూటింగ్ పూర్తి



అల్లు అర్జున్ కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'పుష్ప: ది రూల్'. రష్మిక కథానాయిక. డిసెంబరు 5న విడుదల కానున్న ఈ మూవీ షూటింగ్ పూర్తయింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ అల్లు అర్జున్ ఆనందం వ్యక్తం చేశారు. ''చివరి రోజు షూటింగ్. అద్భుతమైన ఐదేళ్ల 'పుష్ప' ప్రయాణం పూర్తయింది'' పేర్కొన్నారు. 'బాహుబలి' వంటి లార్జర్‌దేన్ లైఫ్ చిత్రాలు దాదాపు ఐదేళ్ల పాటు షూటింగ్ జరుపుకొన్న సంగతి తెలిసిందే. 'పుష్ప' వంటి కమర్షియల్ మూవీకి ఇన్నేళ్ల పాటు షూటింగ్ జరుపుకోవడానికి కరోనా ఒక కారణమైతే, ప్రతిదీ పర్‌ఫెక్ట్‌గా రావాలని తపన పడే దర్శకుడు సుకుమార్ మరో కారణం. అందుకు అల్లు అర్జున్ నిబద్ధత కూడా తోడవడంతో 'పుష్ప'రాజ్ ప్రయాణం సుదీర్ఘంగా సాగింది. 2019 అక్టోబరు 30న పూజా కార్యక్రమాలతో 'పుష్ప' ప్రయాణం మొదలైంది. కొవిడ్-19 కారణంగా కొంతకాలం షూటింగ్‌కు విరామం ప్రకటించారు. కరోనా పరిస్థితులు కుదట పడిన తర్వాత ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి సినిమాను పూర్తి చేశారు. డిసెంబరు 17, 2021న విడుదలైన 'పుష్ప: ది రైజ్' బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని నమోదు చేసింది. కరోనా కారణంగా థియేటర్‌కు దూరమైన ప్రేక్షకుడు 'పుష్ప'తో మళ్లీ ఆ అనుభూతి ఆస్వాదించాడు. ఉత్తరాది ప్రేక్షకులు పుష్పరాజ్ శ్వాగ్‌కు ఫిదా అయ్యారు. దేవిశ్రీ ప్రసాద్ మ్యూజిక్‌కు చిందులేశారు. సుకుమార్ టేకింగ్‌కు 'టేక్ ఏ బౌ' అన్నారు. బాక్సాఫీస్ వద్ద రూ.350 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టినట్లు ట్రేడ్ వర్గాలు అంచనా వేశాయి.'పుష్ప1' ఇచ్చిన విజయోత్సాహంతో సుకుమార్ ఆయన టీమ్ పార్ట్2 విషయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. తొలుత అనుకున్న స్క్రిప్ట్‌నకు మరిన్ని మెరుగులు దిద్ది 'పుష్ప: ది రూల్'ను సిద్ధం చేశారు. ఇప్పటికే విడుదల చేసిన లిరికల్ సాంగ్స్, ట్రైలర్ సినిమాపై అంచనాలను పెంచాయి. తొలి భాగంతో పోలిస్తే, రెండో భాగంలో మరింత డ్రామాను సుకుమార్ మేళవించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా అల్లు అర్జున్, ఫహద్ ఫాజిల్ ఫేస్ ఆఫ్ సన్నివేశాలకు థియేటర్ దద్దరిల్లిపోతుందని ఇన్‌సైడ్ టాక్. 'పుష్ప1' రన్‌టైమ్ దాదాపు 3గంటలు కాగా, 'పార్ట్2' ఆ సమయాన్ని దాటి 'తగ్గేదేలే' అంటోందని చిత్ర వర్గాలు చెబుతున్నాయి.

## ఇప్పుడే స్పందించను.. రాంగోపాల్ వర్మ డుమ్మాపై పవన్ కల్యాణ్


ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఫొటోలు మార్ఫింగ్ చేసి ఎక్స్‌లో పోస్ట్ చేసిన వ్యవహారంలో ప్రముఖ టాలీవుడ్ డైరెక్టర్ రాంగోపాల్ వర్మపై ప్రకాశం జిల్లా మద్దిపాడు పీఎస్‌లో కేసు నమోదైన విషయం తెలిసిందే. అయితే ఈ కేసు విచారణకు హాజరుకాని వర్మ కోసం ఏపీ పోలీసులు కోయంబత్తూరు వెళ్లినట్టు ఇప్పటికే వార్తలు వచ్చాయి.ఈ నేపథ్యంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ పర్యటనలో బిజీగా ఉన్న పవన్ కల్యాణ్‌ను ఆర్జీవీ వ్యవహారంపై అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. ఆర్జీవీతోపాటు పలువురు నోటీసులు



ఇచ్చినా విచారణకు రాకపోవడంపై ఇప్పుడే ఏం స్పందించనన్నారు. ఈ కేసు విషయంలో పోలీసులను పని చేసుకోనివ్వండి. నా పని నేను చేస్తా. పోలీసుల సామర్థ్యంపై నేను స్పందించనని చెప్పారు.హోంశాఖ, లా అండ్ ఆర్డర్ నా పరిధిలో లేవు. మీరు అడగాల్సింది ముఖ్యమంత్రిని. నేను ఏం మాట్లాడినా బాధ్యతగా ఉండాలి. మీరు చెప్పిన విషయాలన్నీ సీఎం చంద్రబాబు దృష్టికి తీసత్తా. మిమ్మల్ని ఇబ్బంది పెట్టిన వారిని పట్టుకునేందుకు ఎందుకు తటపటాయిస్తున్నారని ఢిల్లీ మీడియా నన్ను అడిగిందని సీఎం చంద్రబాబుకు చెబుతానన్నారు.

## సీక్రెట్‌గా ఎంగేజ్‌మెంట్ చేసుకున్న అక్కినేని అఖిల్

అక్కినేని ఇంట మరో పెళ్లి బాజా మోగనుంది. ఇప్పటికే నాగార్జున పెద్ద కొడుకు నటుడు నాగ చైతన్య శోభితా ధుళిపాళను డిసెంబర్‌లో వివాహం చేసుకోనున్న విషయం తెలిసిందే. తాజాగా నాగార్జున రెండో కొడుకు అఖిల్ కూడా వివాహబంధంలోకి అడుగుపెట్టబోతున్నాడు. ఈ క్రమంలోనే అఖిల్ ఎంగేజ్‌మెంట్ చేసుకున్నట్లు ఎక్స్ వేదికగా ప్రకటించాడు నాగార్జున.ఈ విషయాన్ని నాగార్జున ఎక్స్ వేదికగా తెలుపుతూ.. అఖిల్‌కు ఈరోజు జైనబ్‌తో నిశ్చితార్థం అయ్యింది. జైనబ్‌ను మా ఫ్యామిలీలోకి ఆహ్వానించడం కంటే సంతోషమైన విషయం ఇంకొకటి లేదు. ఈ సంతోషమైన విషయాన్ని మీ అందరితో పంచుకోవాలి అనుకుంటున్నాను. మీ అందరి ఆశీస్సులు ఈ జంటపై ఉండాలి దీవించండి.




## బాలకృష్ణతో వన్స్‌మోర్.. అన్‌స్టాపబుల్ విత్
# ఎన్‌బీకేలో శ్రీలీల

టాలీవుడ్ యాక్టర్ బాలకృష్ణ హోస్ట్‌గా వ్యవహరిస్తున్న టాక్ షో అన్‌స్టాపబుల్ విత్ ఎన్‌బీకే . బాలకృష్ణ సీజన్ 4లో ఎంటర్‌టైన్ మెంట్ డోస్ పెంచుతూ కొత్త కొత్త సెలబ్రిటీలతో సందడి చేస్తున్నాడు. ఇటీవలే పుష్ప 2 ది రూల్ ప్రమోషన్స్‌లో భాగంగా పాన్ ఇండియా స్టార్ అల్లు అర్జున్ అన్‌స్టాపబుల్ విత్ ఎన్‌బీకేలో బాలకృష్ణతో సందడి చేశాడని తెలిసిందే. ఈ ఎపిసోడ్ కూడా నెట్టింట వైరల్ అవుతోంది. భగవంత్ కేసరిలో బాలకృష్ణతో కలిసి నటించిన విషయం తెలిసిందే. ఈ ఇద్దరి కాంబోకు మంచి ప్రశంసలు దక్కాయి. తాజాగా బాలయ్య, శ్రీలీల మరోసారి సందడి చేయబోతున్నారన్న వార్త ఇండస్ట్రీ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. తాజాగా మరో అతిథిగా డ్యాన్సింగ్ క్వీన్ శ్రీలీల ను ఫైనల్ చేశారు మేకర్స్. శ్రీలీల అన్‌స్టాపబుల్ తాజా ఎపిసోడ్ షూట్‌లో జాయిన్ అయింది.స్లీవ్ లెస్ టాప్, చీరకట్టులో క్యారవాన్ ముందు హొయలు పోతున్న స్టిల్స్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఇంతకీ శ్రీలీల ఎపిసోడ్ ప్రోమో ఎప్పుడొస్తుందనేది తెలియాల్సి ఉంది. అన్‌స్టాపబుల్ షోలో శ్రీలీల తర్వాత రాబోయే గెస్ట్ నవీన్ పొలిశెట్టి అని ఫిలింనగర్ సర్కిల్ టాక్.

# ఈ మాట వింటే ఎలాన్ మస్క్ నా ట్విటర్ అకౌంట్ బ్లాక్ చేస్తాడేమో

## శివకార్తికేయన్

సోషల్‌మీడియాకు వీలైనంత దూరంగా ఉంటే మంచిదని, అలా చేస్తే, ఇతరుల అభిప్రాయాలు మనపై పడకుండా ఉంటాయని కథానాయకుడు శివకార్తికేయన్ అన్నారు. ఇఫ్ఫీ వేడుకల్లో భాగంగా ఆయన మాట్లాడారు.''గత రెండేళ్లుగా సోషల్‌మీడియా చాలా తక్కువగా వాడుతున్నా. ఇంటర్నెట్ వేదికగా చాలా సమాచారం ఉంటుంది. అందులో సానుకూల అంశాలు కూడా ఉంటాయి. నా సలహా ఏంటంటే, అతిగా సోషల్‌మీడియా వాడొద్దు. ముఖ్యంగా ట్విటర్ (ఇప్పుడు ఎక్స్)లాంటి మాధ్యమాలను చూడటం వీలైనంత తగ్గించండి. ఇది విని ఎలాన్ మస్క్ నా ఎక్స్ ఖాతాను బ్లాక్ చేస్తాడేమో. ఒకవేళ అది జరిగితే, నా మొదటి విజయం అవుతుంది (నవ్వులు). సోషల్‌మీడియా నుంచి బయటకు వస్తే, మన ఆలోచనలు ప్రశాంతంగా ఉంటాయని అనుకుంటా. ఇతరుల అభిప్రాయాలు మనపై పడవు'' ''నా సినిమాలకు సంబంధించి ఏదైనా తప్పుగా జరగడం, సరిగా ఆడక పోవడం, ఫ్లాప్ అనే మాట వినపడితే మొదట గందరగోళానికి గురవుతా. వాటికి సమాధానాల కోసం సోషల్‌మీడియాలో వెతుకుతూ ఉంటా. సినిమా ఏంటో అర్థం చేసుకోకుండా చాలా మంది కామెంట్స్ చేస్తారు. ఎప్పటికో కానీ, అసలు విషయం అర్థం కాదు. నేను టెలివిజన్ రంగంలో పనిచేస్తున్నప్పుడు సోషల్‌మీడియా లేదు. ప్రశంసలు, విమర్శలు నేరుగా ప్రేక్షకుల నుంచి వచ్చేవి. భారతీయులకున్న మంచి లక్షణం ఏంటంటే, ఎవరైనా ఎదురుపడితే వెంటనే నెగెటివ్స్ చెప్పరు. నా కెరీర్‌లో కొన్ని సినిమాలు బాగా ఆడకపోయి ఉండవచ్చు. అలాంటి వాటి ప్రస్తావన వచ్చినా, వాటిలో మంచి విషయాలనే చెబుతారు'' అని అన్నారు. సినిమాలు, పాత్రల విషయంలో తానెప్పుడూ లెక్కలు వేసుకుని పనిచేయలేదని శివకార్తికేయన్ తెలిపారు. 'మొదట యాంకరింగ్ చేద్దాం.. ఆ తర్వాత సినిమాల్లో చిన్న పాత్రలు చేసి, నెమ్మదిగా హీరోగా అవుదాం. ఆ తర్వాత భారీ బడ్జెట్ మూవీలు చేద్దాం' అని నేను ఎప్పుడూ అనుకోలేదు. ప్రణాళిక ప్రకారం ఏదీ చేయలేదు. ఇక్కడున్న (ఇఫ్ఫీ వేడుకలో..) వాళ్లలాగే నేనూ సాధారణ వ్యక్తిని. గతంలో నేనెప్పుడూ ఫిల్మ్ ఫెస్టివల్స్‌కు హాజరు కాలేదు. చాలా మంది నాకంటే జీవితంలో సక్సెస్ సాధించి ఉంటారు. నేను కేవలం సినిమా ప్రేమికుడిని, అలాగే సగటు ప్రేక్షకుడిని. అంతకు మించిన విషయం ఏంటంటే, రజనీకాంత్‌కు పెద్ద ఫ్యాన్‌ని. అయినా కూడా ఇతర హీరోల సినిమాలు ఫస్ట్‌డే లేదా రెండో రోజు కచ్చితంగా థియేటర్‌లోనే చూస్తా. 2005 నుంచి ఇప్పటివరకూ ఒక్కసారి కూడా పైరసీలో మూవీ చూడలేదు. అది నాకు సినిమాపై ఉన్న ప్రేమ'' అని శివకార్తికేయన్ చెప్పుకొచ్చారు.ఆయన కీలక పాత్రలో నటించిన బయోగ్రాఫికల్ వార్ ఫిల్మ్ 'అమరన్' . రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహించారు. సాయిపల్లవి కథానాయిక. అక్టోబరు 31న విడుదలైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పటివరకూ రూ.300 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. మేజర్ ముకుంద్ వరదరాజన్ జీవిత కథ ఆధారంగా ఈ మూవీ రూపొందింది.



Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com